

- పార్టీలో ఒక్కసారిగా బేలతనం
- రాజీనామాలు.. ఫిరాయింపులు
- దామచర్లను కలిసే ప్రయత్నంలో ఒంగోలు మేయర్
- ఎన్నికల సమయంలోనే టీడీపీతో టచ్‌లోకి..
- ఆచితూచి అడుగేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్
- కనిపించని ఓడిపోయిన అభ్యర్థులు
- జీవో మార్పించాలన్న ఆలోచనలో శాసనసభ్యులు

వైసీపీ వణికిపోతోంది. ఒక్కసారిగా ఆ పార్టీ శ్రేణుల్లో బేలతనం నెలకొంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైతే పదవులను కాపాడుకునే ప్రయత్నాల్లో పడ్డారు. తదనుగుణంగా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలను ప్రసన్నం చేసుకునేందుకు కొందరు చూస్తుండగా.. అవకాశం ఇస్తే టీడీపీలో చేరేందుకు అత్యధికులు సిద్ధమవుతున్నారు. ఎలాగూ అవకాశం లేదనుకున్న వారు రాజీనామా బాట పట్టారు. ఇలా మొత్తంగా వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు అతలాకుతలమవుతుండగా వారి గురించి ఆపార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులు పట్టించుకోవడం లేదు. ఇటుచూస్తే టీడీపీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే కన్నా వీలైనంత త్వరగా చట్టపరంగానే వారిని పదవుల నుంచి తొలగించే యోచన చేస్తున్నారు. సోమవారం పశ్చిమప్రాంతంలోని కొందరు ఎంపీపీలు పదవులకు రాజీనామాలు చేయగా.. ఒంగోలు మేయర్, పలువురు కార్పొరేటర్లు టీడీపీలో చేరే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.



ఒంగోలులోని మేయర్ ఇంట్లో ఆదివారం సమావేశమైన వైసీపీ కార్పొరేటర్లు

వైఛీపీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
ప్రభుత్వంలో ఏపార్టీ ఉంటే దానికి అనుకూలంగా స్థానిక సంస్థల ఫలితాలు రావడం సహజం. అయితే జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం తీవ్రమైన అప్రజాస్వామ్య చర్యలతో మొత్తం స్థానిక సంస్థలను చేజిక్కించుకునేందుకు ప్రయత్నించి చాలా వరకు సఫలీకృతమైంది. తదనుగుణంగా జిల్లాలో కూడా అన్ని నియోజకవర్గాల్లో స్థానికసంస్థల ఎన్నికల్లో వైసీపీ హవా కనిపించింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఏర్పడి జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలతోపాటు రెండు లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడం తెలిసిందే. దీంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో వణుకు మొదలైంది. కార్పొరేషన్, మునిసిపాలిటీలు, మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు తదితర పదవులకు ఎంపికైన వారికి మరో రెండు న్నరేళ్ల వరకూ పదవుల్లో కొనసాగే అవకాశం ఉంది. అయితే ఎంపీపీలు, మునిసిపల్ చైర్మన్లు, మేయర్లను అవిశ్వాస తీర్మానంతో తొలగించే అవకాశం ఉంది. దీంతో ప్రధానంగా ఆ పదవుల్లో ఉన్నవారు టీడీపీ ఎమ్మెల్యే మద్దతు కోసం పరుగులు తీస్తున్నారు.

అన్నీ ఆలోచించి నిర్ణయం

కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించిన దామచర్ల జనార్దన్ ఈ విషయంలో ఆచితూచి అడుగు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఎవరొచ్చినా పార్టీలో చేర్చుకునే పంథాను అనుసరించిన జనార్దన్ ప్రస్తుతం ఆలోచనలో పడినట్లు తెలిసింది. కార్పొరేషన్‌లో అనుకున్న అభివృద్ధి సాధించాలంటే పాలకమండలి సహకారం అవసరం. ఆ కోణంలో ప్రభుత్వానికి అనుకూల పాలక మండలి ఉండాలనేది ఆయన ఆలోచన. అయితే పార్టీశ్రేణుల నుంచి వైసీపీ మేయర్, కార్పొరేటర్లను చేర్చుకునే విషయంలో వ్యతిరేకత ఎదురవుతోంది. మరోవైపు మేయర్‌కు మద్దతుగా కొందరు దామచర్లపై ఒత్తిడి పెంచినట్లుగా కూడా సమాచారం. దీంతో పాలకమండలిని కట్టడి చేయాలనుకునే అవకాశాలపైన, అవసరమైతే అనుకూలమైన కొత్త మేయర్‌ను ఎంపిక చేసుకునే అవకాశాన్ని కూడా ఆయన పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేయర్‌ను అవిశ్వాస తీర్మానంతో తొలగించేందుకు వారు ఎన్నికైన నాలుగేళ్ల తర్వాతే అవకాశం ఉంటుంది. అలాచూస్తే ప్రస్తుత మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు మరో ఏడాది సమయం ఉంది. దీంతో మంత్రిమండలి ఏర్పడిన తర్వాత కొత్తచట్టం తీసుకొస్తే ఉన్నవారిని తొలగించేందుకు వెంటనే అవకాశం వస్తుంది. అయితే అప్పుడైనా కార్పొరేషన్‌లో ఎక్కువమంది కార్పొరేటర్ల మద్దతు కోసం వైసీపీ వారిని చేరదీయాలి. దీంతో తొందరపడకుండా ఒంగోలు కార్పొరేషన్ పాలకమండలిని దారిలోకి తెచ్చుకునే అంశంపై నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో దామచర్ల ఉన్నారని తెలిసింది. అందుకే మేయర్ అడగ్గానే ఇంటర్వ్యూ ఇవ్వకపోగా, ఇవ్వనని కూడా చెప్పకుండా జనార్దన్ తటస్థ వైఖరిలో ఉన్నారని భావిస్తున్నారు.

దామచర్లను కలిసేందుకు ఒంగోలు మేయర్ ప్రయత్నం

జిల్లాలో ఏకైక కార్పొరేషన్‌గా ఉన్న ఒంగోలులో గత ఎన్నికల్లో వైసీపీ భారీ విజయం సాధించింది. మొత్తం 50 డివిజన్లకుగాను 43ను వైసీపీ గెలుచుకోగా.. ఆరు డివిజన్లలో టీడీపీ, ఒకచోట జనసేన అభ్యర్థులు గెలుపొందారు. అయితే ప్రస్తుత సాధారణ ఎన్నికల పోలింగ్‌కు ముందే వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. టీడీపీ బలం 11కి చేరింది. పరిస్థితిని గమనించి కాబోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత టీడీపీలో చేరేందుకు తహతహలాడుతున్నారు. అవకాశం ఇస్తే కలిసి మాట్లాడతానంటూ ఎమ్మెల్యే జనార్దన్‌కు సమాచారం పంపారు. తనతోపాటు కొందరు కార్పొరేటర్లను తీసుకొని టీడీపీలో చేరాలన్న యోచనలో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. తదనుగణంగా వైసీపీ కార్పొరేటర్లతో ఆదివారం తన ఇంట్లో సమావేశమయ్యారు. ప్రస్తుతం 39మంది కార్పొరేటర్లు ఉండగా సుమారు 27మంది ఆమెతో సమావేశమైనట్లు తెలిసింది. 13 మంది గైర్హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన కార్పొరేటర్లలో ఎక్కువమంది తమ డిమాండ్లు నెరవేరిస్తే వైసీపీని వీడేందుకు సిద్ధమేనని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా మేయర్ సుజాత భేటీకి అవకాశం ఇవ్వాలని దామచర్లకు సమాచారం పంపారు.

పోలింగ్‌కు ముందే ఒకసారి ప్రయత్నం

పోలింగ్‌కు ముందే టీడీపీకి మద్దతు ప్రకటించేందుకు మేయర్ సుజాత సిద్ధమైనట్లు సమాచారం. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్ ఆమె తరఫున రాయబారం నడిపినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచార సమయంలో ఒంగోలు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆమె పార్టీలో చేరే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకుడు బాలినేని ఆమెను కట్టడి చేసినట్లు తెలుస్తోంది. టంగుటూరు వచ్చిన సీఎం జగన్ వద్దకు ఆమెను తీసుకెళ్లి మాట్లాడించినట్లు కూడా తెలిసింది. త్రుటిలో అవకాశం తప్పింది లేదంటే మీకు సంతనూతలపాడు ఎమ్మెల్యే టికెట్ వచ్చేదని జగన్ చెప్పి భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఆతర్వాత ఆమె పార్టీ మారే యోచన వీడినట్లు ప్రచారం జరిగింది. అప్పట్లో టీడీపీ నాయకులు కూడా వైసీపీ నుంచి ముఖ్యులు ఎవరొచ్చినా పార్టీలో చేర్చుకునేందుకు ద్వారాలు తెరిచారు. దీంతో మేయర్ ఓకే అని ఉంటే పార్టీలో చేర్చుకునేవారే. ప్రస్తుతం కూడా కార్పొరేషన్ మేయర్‌గా అధికారికంగా దామచర్లను కలిసి అభినందించాలన్నా, సమస్యలపై చర్చించాలన్నా అందుకు ప్రత్యేక అనుమతులు అవసరం లేదు. కానీ పార్టీ మారే యోచనతోనే ఆమె తన మద్దతు కార్పొరేటర్లతో ప్రత్యేకంగా కలవాలని దామచర్లకు సమాచారం పంపారని భావిస్తున్నారు.



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న ప్రకాశం భవన్

అందరికీ ఆహ్వానం

రేపు సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం

కేసరపల్లి వద్ద కార్యక్రమం



- నియోజకవర్గానికి 150 పాస్‌లు
- కలెక్టర్ ద్వారా అందజేత
- 20 కార్లు, నాలుగు బస్సులకు అనుమతి
- నేడు విజయవాడలో కూటమి శాసనసభాపక్ష సమావేశం

ఒంగోలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ కార్యక్రమానికి భారీగా వెళ్లేందుకు జిల్లాలోని తెలుగు తమ్ముళ్లు సన్నద్ధమవుతున్నారు. అయితే పార్టీశ్రేణులు అందరికీ అధినేత ప్రమాణస్వీకారానికి ఆహ్వానం పలుకుతున్న అధిష్ఠానం అక్కడి సభా ప్రాంగణంలోకి మాత్రం పరిమిత సంఖ్యలోనే అనుమతించాలని నిర్ణయించింది. గన్నవరం విమానాశ్రయం ఎదురు కేసరపల్లి వద్ద బుధవారం ఉదయం 11.27కు సీఎంగా చంద్రబాబు ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధాని మోదీతోపాటు పలురాష్ట్రాల సీఎంలు, పలువురు కేంద్రమంత్రులు హాజరుకానున్నారు. దీంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు ప్రమాణ స్వీకారోత్సవం జరిగే ప్రాంగణం కేవలం 18 ఎకరాలు మాత్రమే. అలా స్థలం తక్కువగా ఉండటం, ఎక్కువగా ప్రముఖులు వస్తుండటంతో వారి భద్రత దృష్ట్యా సభా ప్రాంగణంలోకి ముఖ్యనేతలను మాత్రమే అనుమతించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రకారం ఒక్కోనియోజకవర్గానికి 150 పాసులను మాత్రమే ఇవ్వనున్నారు. అందులో 20 వీవీఐపీవి, 130 వీఐపీలవి ఉంటాయి. వారంతా ఎవరి వాహనాలలో వారు వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనే భావనతో వాహనాల పాసులను కూడా నియంత్రిస్తున్నారు. నియోజకవర్గానికి కేవలం 20 పాసులు మాత్రమే ఇవ్వనున్నారు. మిగిలిన వారు ఏసీ బస్సులలో వచ్చేవిధంగా నియోజకవర్గానికి నాలుగు బస్సులను కేటాయిస్తున్నారు.

ప్రమాణస్వీకార సభ ప్రత్యక్ష వీక్షణ

ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జిల్లాలో ప్రజానీకం ఎక్కువమంది తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్షణం కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ వైపు దృష్టి సారించారు. పలువురు అధికారులకు ఆ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం నుంచి బుధవారం వరకు విద్యుత్ అలంకరణ బాధ్యతను జిల్లా, డివిజన్, మండల అధికారులకు ఇచ్చారు. ఇక ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఎక్కువమంది ప్రజలు వీక్షించేలా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించిన కలెక్టర్ వాటి పర్యవేక్షణ బాధ్యతను జడ్పీ సీఈవో, డీపీవోలకు అప్పగించారు. అన్నిచోట్లా ఆప్టిక్ ఫైబర్ లైన్లు ఏర్పాటుచేయాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సూచించారు. మొత్తం ఏర్పాట్ల పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఓడా వైస్ చైర్మన్ వి.విశ్వేశ్వరరావును నియమించారు.

ప్రభుత్వపరంగానే కార్యక్రమం

ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రభుత్వపరంగానే సాగుతుంది కనుక పాసులను కూడా అధికారులే ఇవ్వనున్నారు. జిల్లాలో కలెక్టర్ల ఆధ్వర్యంలో నియోజకవర్గానికి 150 పాసులు అక్కడి టీడీపీ ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జికి అందజేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. అలాగే 20 వాహన పాసులను ఇవ్వడంతో రవాణా శాఖ ద్వారా నియోజకవర్గానికి నాలుగు బస్సులను సమకూర్చే బాధ్యత కూడా కలెక్టర్లకు అప్పగించారు. పాసులు, వాహనాల అనుమతి ఇతర అంశాలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు సోమవారం ఉదయం టెలీకాన్ఫరెన్స్‌లో పార్టీ ఎమ్మెల్యేలకు సూచనలు చేశారు. పాసులలో కొన్నింటిని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు కూడా ఇవ్వాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యేల సమావేశం

కూటమి తరఫున గెలుపొందిన ఎమ్మెల్యేల ఉమ్మడి సమావేశం మంగళవారం విజయవాడలో జరగనుంది. అక్కడి ఏ1 కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో చంద్రబాబును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోనున్నారు. కాగా ఆ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు సోమవారం రాత్రికే విజయవాడ చేరుకున్నారు.

రూ.కోట్లలోనే అవినీతి

- పల్లామల్లి సొసైటీలో బయటపడుతున్న బాగోతం
- ఖాతాదారులకు తెలియకుండానే డిపాజిట్లపై సిబ్బంది రుణాలు
- విచారణ చేపట్టిన కమిటీ
- మూడు రోజులు కొనసాగే అవకాశం

వివరాలు లోపలి పేజీల్లో..

పీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాజీనామా

ఒంగోలు విద్య, జూన్ 10: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్ పదవికి వై.ఎం.ప్రసాద్‌రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. లేఖను సహకారశాఖ కమిషనర్‌కు పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆయన కోరారు.

దర్శి ఏఎంసీ చైర్మన్ కూడా..



రాజీనామా లేఖపై సంతకం చేస్తున్న షకీలా

దర్శి, జూన్ 10 : దర్శి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు స్వచ్ఛందంగా వైదొలగడం ప్రారంభించారు. దర్శి ఏఎంసీ చైర్మన్ షేక్ షకీలా సోమవారం రాజీనామా చేశారు. మార్కెట్‌యార్డు కార్యదర్శి పద్మశేఖర్‌కు రాజీనామా పత్రం అందజేశారు. పలువురు సభ్యులు కూడా రాజీనామాలు చేశారు. మరికొంతమంది నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు త్వరలో రాజీనామాలు చేసే అవకాశం ఉంది.

త్రిపురాంతకం ఎంపీపీ..



డిప్యూటీ సీఈవోకు రాజీనామా పత్రం సమర్పిస్తున్న సుబ్బారెడ్డి

త్రిపురాంతకం, జూన్ 10 : త్రిపురాంతకం మండల పరిషత్ అధ్యక్ష పదవికి కోట్ల సుబ్బారెడ్డి రాజీనామా చేశారు. ఆ లేఖను ఒంగోలు జడ్పీ డిప్యూటీ సీఈవో హనుమంతరావుకు సోమవారం అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు అందులో తెలిపారు. కోట్ల సుబ్బారెడ్డి వెంట ఉమ్మడివరం ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల అంజనేయరెడ్డి, వైసీపీ నాయకుడు ఆర్‌వీ.పిచ్చయ్య ఉన్నారు.



అధినేత చంద్రబాబుతో ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్, అశోక్‌రెడ్డి, టీడీపీ నేతలు

బాబు, లోకేష్‌ను కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు

గిద్దలూరు టౌన్, జూన్ 10: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం కలిశారు. పార్టీ అఖండ విజయం సాధించిన నేపథ్యంలో మొదట అధినేతను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎన్నికలు జరిగిన తీరును వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాత లోకేష్‌ను కలిసి మాట్లాడారు. వారివెంట ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి, అంబవరం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

నాన్నకు సాయం కోసం వెళ్లి..

విద్యుదాఘాతంతో అన్నదమ్ములు మృతి

- ఆటోలో టెంట్ హౌస్ సామాను తీసుకొస్తుండగా వైరు తగలడంతో ఘటన
- ముండ్లపాడులో విషాదం

గిద్దలూరు టౌన్, జూన్ 10 : తండ్రికి సాయం చేసేందుకు వెళ్లిన ఆ ఇద్దరు కుమారులను మృత్యువు కబళించింది. విద్యుత్ షాక్ రూపంలో వారిని బలితీసుకొంది. ట్రాలీ ఆటోకు సర్వీసు వైరు తాకడంతో రెప్పపాటులో పిల్లలు విగతజీవులయ్యారు. తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చారు. ఈ విషాద ఘటన గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన శీలం గోపీకృష్ణ అదే గ్రామంలో న్యూ గోపాలకృష్ణ సప్లయర్స్ నడుపుతున్నారు. గిద్దలూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీప వీధిలో ఒక గృహప్రవేశానికి తన సప్లయర్స్ నుంచి వంట, షామియానా సామాను సరఫరా చేశాడు. గృహప్రవేశం ముగిసిన తర్వాత తిరిగి సామానును ముండ్లపాడుకు తీసుకు వెళ్లాల్సి ఉంది. దీని కోసం గోపీకృష్ణ కుమారులు లోహిత్‌కృష్ణ(18), సాయికృష్ణ(16) ఆటోను తీసుకుని గిద్దలూరు వచ్చారు. అక్కడి సామానంతా ఆటోలో నింపుకొని ముండ్లపాడు బయల్దేరారు. కొద్దిదూరం వెళ్లగా ఓ ఇంటి కోసం ఏర్పాటు చేసిన సర్వీసు తీగ ఆటోలోని సామానును తాకింది. దీంతో ఆటో ట్రాలీలోని సామానుపై ఉన్న సాయికృష్ణ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. ఇది చూసి ఆటో నడుపుతున్న లోహిత్‌కృష్ణ డోర్ తీసి కిందకు దిగడంతో ఎర్త్ పాస్ అయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అన్నదమ్ములిద్దరూ అక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గోపీకృష్ణ దంపతులు, బంధువులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. విగతజీవులై పడివున్న కుమారులను చూసి తల్లిదండ్రులు సొమ్మసిల్లి పడిపోయారు.



లోహిత్‌కృష్ణ, సాయికృష్ణ (ఫైల్)



ఆటోపక్కనే కిందపడి ఉన్న అన్నదమ్ముల మృతదేహాలు

తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ..

ఐటీఐ పూర్తిచేసిన లోహిత్‌కృష్ణ, 10వ తరగతి పూర్తిచేసిన సాయికృష్ణ ఖాళీ సమయాల్లో తండ్రికి సహాయపడుతూ ఉండేవారు. ఇద్దరూ ఒకేసారి మృతిచెందడంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. నిన్నటివరకు కలిసిమెలసి తిరిగిన అన్నదమ్ములు ఒకేసారి మృతిచెందారన్న వార్తతో ముండ్లపాడులో విషాదం నెలకొంది. ఘటనపై గిద్దలూరు సీఐ సోమయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరోజు ఆలస్యంగా స్కూళ్లు పునఃప్రారంభం

- ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ నిర్ణయం

ఒంగోలు (విద్య), జూన్ 10 : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఒకరోజు ఆలస్యంగా పునఃప్రారంభం కానున్నాయి. విద్యాశాఖ ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు ఈనెల 12న పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే అదేరోజు ఉదయం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీంతో 12న సెలవు దినంగా ప్రకటించి 13న పాఠశాలలను తెరవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. వారి కోరికను మన్నించిన ప్రభుత్వం సెలవులను మరో రోజు పొడిగించింది.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల బదిలీ

నాగులుప్పలపాడు, జూన్ 10 : ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. డీపీవో ఆదేశాల మేరకు ఉప్పుగుండూరు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న హరిబాబును వినోదరాయునిపాలెంకు, అక్కడ పనిచేస్తున్న వీరయ్యను ఉప్పుగుండూరు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఎంపీడీవో మహాలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం మేరకు బదిలీ జరిగిందని ఆమె తెలిపారు.వైసీపీ పాలనలో ఉప్పుగుండూరు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న హరిబాబుపై అనేక ఆరోపణలు రావడంతోనే అధికారులు బదిలీ చేసినట్లు చర్చ జరుగుతోంది.

స్కిల్‌హబ్ సెంటర్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి, జూన్ 10 : కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో శిక్షణకు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఎం.గోపీకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని వారు కోరారు

నగరానికి పూర్వ వైభవం

- టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి మళ్లీ కనిపించాలి
- తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 10 : అభివృద్ధిలో ఒంగోలు నగరానికి పూర్వ వైభవం తీసుకురావాలని, అందుకోసం అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని, అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన దామచర్ల తన నివాసంలో తొలి సమావేశం కార్పొరేషన్ అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు నగరంలో జరిగిన అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులపై సమీక్షించారు. ముఖ్యంగా నగర ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని సూచించారు. గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు తాగునీరు సరఫరా పనుల గురించి అడిగి తెలుసుకున్న ఆయన ఇటీవల కాలంలో తాగునీటి కోసం మంజూరు అయిన రూ. 339 కోట్లతో చేపట్టిన పనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదించిన పనులు వేగవంతం చేయలన్నారు. నగరంలో తాగునీటికి సమస్య లేకుండా చూడాలని, లీకుల నియంత్రణతోపాటు, శివారు కాలనీల ప్రజలు అవస్థలు పడకుండా సకాలంలో తాగునీరు అందించాలని ఆదేశించారు. అస్తవ్యస్తంగా ఉన్న నీటి సరఫరా విధానికి స్వస్తి పలకాలని, అలాగే సకాలంలో తాగునీరు అందించాలని ఆదేశించారు. అలాగే నగర అభివృద్ధి కోసం చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ హయాలోనే ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని, ఆ నమ్మకాన్ని ప్రజల్లో నిలబెట్టాలన్నారు. అందుకు అవసరమైన నిధుల మంజూరు విషయంతో తాను ప్రభుత్వంతో మాట్లాడతానని దామచర్ల తెలిపారు. అభివృద్ధిలో రాజీ పడేది లేదని, అందుకు అనుగుణంగా అధికారులు మరింత కష్టపడి పనిచేయాలన్నారు. త్వరలోనే మరోసారి సమావేశం నిర్వహిస్తానని, పూర్తినివేదికలు సిద్ధం చేయాలని దామచర్ల తెలిపారు. ఇదిలా ఉండగా, నగరంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. త్వరితగతిన పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని ఆదేశించారు. రోడ్లపై చెత్తలేకుండా చూడాలని, ఇంటింటి చెత్త సేకరణ రోజూ చేపట్టాలన్నారు. అలాగే రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ ఇంటి పన్నుల విధింపుల్లో అడ్డగోలు వ్యవహారాలకు తావులేకుండా పారదర్శకంగా ఉండాలన్నారు. సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధివైపు నడిపించడానికి అందరు సహకరించాలని, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు, తెలుగుదేశం హయాంలో జరిగిన విధంగా అభివృద్ధిలో పూర్వ వైభవం తీసుకురావాలి ఆదేశించారు. సమావేశంలో కమిషనరు ఎం.జశ్వంత్‌రావు, మునిసిపల్ ఇంజనీర్ జానీబాషా, డీఈలు గణపతి, పద్మజ, ఆర్‌వో మధుబాబు, ఆర్‌ఐలు శ్రీనాథ్, అమ్మిరెడ్డి, మిరియాల శ్రీను, సాయి, సుస్మిత, సుజాతతోపాటు ఇతర ఇంజనీరింగ్, రెవెన్యూ, సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దేవస్థాన పాలకమండలి

15 నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 10:స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఆమె ఇతర ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ తేదీ సాయంత్రం అంకురార్పణ, 16న శేషవాహన సేవ, కూచిపూడి నృత్యప్రదర్శన, 17న ఊంజల్ సేవ, వినోద్‌కుమార్‌చే భక్తి సంకీర్తల ఆలాపన, 18న చక్రస్నానం, డాక్టర్ రామచంద్రుని రమేష్‌కృష్ణచే ప్రసంగం, 19న శ్రీవారి కల్యాణం, తిరువీధి ఉత్సవం, కోలాట ప్రదర్శన ఉంటాయన్నారు. కరపత్ర ఆవిష్కరణలో అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీకుమారి, ఆలయ అర్చకులు ప్రద్యుమ్న కుమార్, రంగస్వామి అయ్యంగార్, వేదపండితులు పొదిల భాను ప్రకాశ శర్మ, శనగవరపు రవితేజ పాల్గొన్నారు.


సంప్రదాయ కళలకు సంబంధించి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

సంప్రదాయ కళలకు ఆదరణ పెరగాలి

ఒంగోలు(కల్చరల్), జూన్ 10: భారతీయ సంప్రదాయ కళలైన నటన, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి వాటికి ఆదరణ పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నటుడు, గాయకులు, పీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ కుంభా రాఘవయ్య అన్నారు. సోమవారం స్థానిక వీవీఎం కళాశాల (మంగమ్మ కాలేజీ) ఆవరణలో ఏర్పాటుచేసిన వేదిక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంస్థ చైర్మన్ షేక్ సిద్దాంటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ చిన్నతనం నుంచే విద్యార్థులకు కళల పట్ల ఆసక్తిని కలిగించాలన్నారు. రచయిత, దర్శకులు వెలనాటి మల్లికార్జున రావు మాట్లాడుతూ జిల్లా కళాకారులకు పుట్టినిల్లని, ఈ జిల్లానుంచి ఎంతోమంది నటులు సినీరంగంలో ప్రవేశించి రాణించారన్నారు. అటువంటి జిల్లా కేంద్రంలో కళలలో శిక్షణనిచ్చేందుకు మంచి సంస్థను ఏర్పాటుచేయటం అభినందించదగిన విషయమన్నారు. సినీ స్టంట్ మాస్టర్, డైరెక్టర్ బి.విక్కీమాస్టర్ మాట్లాడుతూ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం సైతం కళారంగాన్ని ప్రోత్సహించినప్పుడే ఎంతోమంది ఔత్సాహిక కళాకారులు వెలుగులోకి వస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రంగారావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇటువంటి సంస్థను ఏర్పాటుచేయటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంగీత కళాకారుల సంఘ అధ్యక్షురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, ఆంజనేయులు, సయ్యద్ ఇస్మాయిల్, గోరంట్ల చినరామయ్య, డాక్టర్ ఏ.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయనీగాయకులు డి.కోటేశ్వరరావు, శ్రీదేవి, శేషారత్నం తదితరులు గానం చేసిన పలు సినీగీతాలు అలరించాయి.

కోట్లలోనే అవినీతి

పల్లామల్లి సొసైటీలో బయటపడుతున్న సిబ్బంది బాగోతం


ఖాతాదారులను విచారిస్తున్న అధికారి కృష్ణశాస్త్రి

చీమకుర్తి, జూన్10: గత కొన్నేళ్లుగా గుట్టుగా ఖాతాదారులకు తెలియకుండా వారి నమ్మకాన్ని ఫణంగాపెట్టి సొసైటీ సిబ్బంది పాల్పడిన అవినీతి భాగోతం ఒక్కొక్కటిగా బహిర్గతమవుతోంది. పల్లామల్లి సొసైటీ ఆవరణలో సోమవారం 51ఏ విచారణను అధికారి కృష్ణశాస్త్రి తన బృందసభ్యులతో చేపట్టారు. ఇప్పటివరకూ సొసైటీలో జరిగిన అవినీతి లక్షల్లో ఉంటుందని భావించినా సమగ్ర విచారణ చేపట్టటంతో అవినీతి కోట్లల్లో జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనాకు విచారణ అధికారులు వస్తున్నారు. మూడురోజుల పాటు రైతులనుంచి సమాచారం సేకరించిన తదుపరి విచారణలో వెలుగు చూసిన మేరకు బాధ్యులైన వారికి నోటీసులు జారిచేసి విచారణ జరుపుతారు.అప్పటికి ఎంతమేరకు అవినీతి జరిగింది అనేది పూర్తిస్థాయి లెక్కతేలనుంది. ఇప్పటికే పదుల సంఖ్యలో బాధితులు తమకు అన్యాయం జరిగిందని విచారణ అధికారికి ఫిర్యాదు చేశారు. ఖాతాదారుల డిపాజిట్లపై లోన్ తీసుకొని జేబులో వేసుకోవటం, రుణాలకు జమ చేయమని ఇచ్చిన నగదును జమ చేయకుండా సొమ్ముచేసుకోవటం లాంటి చర్యలకు సిబ్బంది పాల్పడినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తి అయితే ఏమేరకు అవినీతి జరిగిందనే విషయం తేటతెల్లమవనుంది.


సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

117 జీవోను రద్దు చేయాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల డిమాండ్

ఒంగోలు విద్య, జూన్ 10: విద్యాశాఖలో అలజడికి కారణమైన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి అధ్యక్షుడు జనార్దనరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో రెండు మాధ్యమాల్లో బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించేందుకు వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐఆర్, పీఆర్సీతో, ఓపీఎస్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు పాండురంగ వరప్రసాద్, ఐవీ.విజయసారథి, నాయబ్‌రసూల్, శేషారావు, హనుమంతరావు, దేవిప్రసాద్, శేఖరరెడ్డి, శివరామకృష్ణ, తిరుమల, యోహానురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 10 : నీట్ యూజీ-24 ఫలితాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. నీట్ ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు రావడం, వారందరికి 720/720 మార్కులు రావడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. అదే సెంటర్‌లో పరీక్ష రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్టు అయ్యాయని తెలిపారు. కానీ ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉండగా 720/720 ఏలా వచ్చాయని ప్రశ్నించారు. ఎంతో మంది విద్యార్థులకు సాధ్యం కాని విధంగా మార్కులు వచ్చాయని, వీటన్నింటినిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే స్వామి


ఎమ్మెల్యే స్వామిని సత్కరిస్తున్న అపుస్మా సంఘ నాయకులు

సింగరాయకొండ, జూన్ 10 : ప్రైవేటు స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయన్ను సోమవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో అపుస్మా సంఘ జిల్లా నాయకులు మార్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పలు విద్యాసంస్థల కరస్పాండెట్లు స్వామి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నక్కా శ్రీనివాసరావు, పలువురు సంఘనాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామికి వీఆర్ఏల సన్మానం

టంగుటూరు : గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు సోమవారం తూర్పునాయుడుపాలెంలోని తన నివాసంలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయనకు గజమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు వివేకానంద, నాయకులు సుందరావు, నారాయణ, తేజ, మల్లెల కృష్ణ, రవి, సుజాత, అనిత, శ్రావణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్),జూన్ 10 : జిల్లాలో పీసీఅండ్ పీఎన్డీటీ యాక్టును పటిష్టంగా అమలు చేయడంతో పాటు ఈ చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన పీసీఅండ్ పీఎన్డీటీయాక్టు అమలుపై జిల్లా మల్టీమెంబర్ అప్రోప్రియేట్ ఆథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టం కింద అనుమతులు పొందిన స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తారా లేదా అని నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం రెన్యూవల్ చేసుకుంటున్నారా లేదా అనేది కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆయన ఆదేశించారు. స్కానింగ్ సెంటర్స్ అనుమతుల్లో భాగంగా ఈ సమావేశంలో ఎనిమిది కొత్త దరఖాస్తులు, ఎనిమిది రెన్యూవల్ దరఖాస్తులు ఆమోదించగా ఒక దరఖాస్తును తిరస్కరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీధరరావు, డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ నాగార్జున, సార్డ్ ఎన్‌జీవో సభ్యులు సరోజిని తదితరులు ఉన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


ఒంగోలు నగరంలోని అద్దంకిబస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నేతలు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 10 : సినీ హీరో, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం ఒంగోలులో ఘనంగా జరిగాయి. చెన్నుపాటి బ్రదర్స్ ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చెన్నుపాటి వరప్రసాద్, చెన్నుపాటి వేణు, కొఠారి నాగేశ్వరరావు, పుచ్చకాయల అంజిబాబు, సింహాచలం, రాజా, బొల్లినేని వాసుకృష్ణ, టెంకాయల బాష తదితరులు పాల్గొన్నారు. స్థానిక గోరంట్ల మల్టీప్లెక్స్ హాలులో బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గోరంట్ల అధినేత వీర నారాయణ బాబు, దారపు నేని బాబు, ఈర్ల వెంకట్రావు, పఠాన్ హనీఫ్ ఖాన్, నాగిశెట్టి మధుసూదన్ రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక 29వ డివిజన్‌లోని రాజపానగల్ రోడ్‌లో జనార్దన్ గెలుపుతో డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, పెద్దిశెట్టి వరలక్ష్మి, ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జనార్దన్ ఫ్లెక్సీకి వందలీటర్లతోపాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, బండారు మదన్, షేక్ మస్తాన్ వలి, సయ్యద్ రబ్బాని, గుంజి విజయలక్ష్మి, ఎడ్లూరి నాగేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

చీమకుర్తిలో


చీమకుర్తిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నేతలు

చీమకుర్తి : నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు చీమకుర్తి పట్టణంలోని తూర్పుబజార్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. కేక్‌కట్ చేసి నటీడీపీ నాయకులు అభిమానులు స్వీట్లు పంపిణీ చేశారు. యడ్లపల్లి రామబ్రహ్మం,కాట్రగడ్డ రమణయ్య,రావిపాటి రాంబాబు, ఉన్నం సుబ్బారావు, కందిమళ్ల గంగాధర రావు, ముప్పూరి చలమయ్య, అభిమానులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

ఒంగోలు(కల్చరల్) : సినీ హీరో, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక శివం శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు మండవ లావణ్య, 4వ డివిజన్ కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాలలో దాదాపు 300 మంది అనాథలకు అన్నదానం చేశారు. శివం శరణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, బాలకృష్ణ అభిమాన సంఘ నాయకులు రావి వాసు, సుధాకర్, అశోక్, యశ్వంత్, గోపి, దండే శ్రీను, మారెళ్ల సుబ్బారావు, చౌదరి, కరీదు శ్రీనివాస రావు, అలగర వెంకట్, పంతులు, పెద్దసంఖ్యలో బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

మద్దిపాడులో బాలకృష్ణ జన్మదిన వేడుకలు

మద్దిపాడు : బాలకృష్ణ జన్మదిన వేడుకలు మద్దిపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంతి బాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ దేవభక్తుని ప్రసాదరావు, పాటిబండ్ల అజయ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జి మల్లిపెద్ది బాలకృష్ణ, సుద్దపల్లి అనిల్, సుద్దపల్లి నరసింహానాయుడు, భానుచందర్, మండవ గోవిందరాజులు, కోడూరి ప్రసాద్, మందపల్లి శ్రీనివాసరావు, మొనపాటి రామకృష్ణ, రావి నరసింహారావు, రావి వరప్రసాద్, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు. నందిపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోడెంపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో మారెళ్ల సురేంద్రబాబు, నాదెండ్ల అంకబాబు, పోతుల పవన్‌కుమార్, మండవ లక్ష్మీనారాయణ నల్లూరి నాగలక్ష్మి, మండవ రమణమ్మ,బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసిన సంతనూతలపాడు తహసీల్దార్

బీఎన్‌కు కలిసిన తహసీల్దార్

సంతనూతలపాడు, జూన్ 10: ఎమ్మెల్యేగా గెలుపొందిన బీఎన్ విజయ్‌కుమార్‌ను ఒంగోలులోని ఆయన నివాసంలో సోమవారం సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్‌కె.మీరావలి మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూసిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.330

మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు కిలో ధర రూ.330లు పలికింది. వేలంకు చిలంకూరు నుంచి 1,430 పొగాకు బేళ్లు రాగా 1,342 బేళ్లు కొనుగోలు జరగ్గా 88 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.330లు పలకగా, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.311.52 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో 30 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు పాల్గొన్నారు.


శేషమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

శేషమ్మకు ఎమ్మెల్యే బీఎన్ నివాళి

నాగులుప్పలపాడు, జూన్ 10 : జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు అత్తమ్మ ముప్పవరపు శేషమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్ సోమవారం అమ్మనబ్రోలు చేరుకొని శేషమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్, ఐటీడీపీ మండల అధ్యక్షులు బెల్లం వెంకటేశ్వర్లు, గుమ్మడి సాయిబాబ, ఈదర వెంకట కృష్ణారావు, వలేటి పాండురంగారావు, బెజవాడ వెంకటరావు, మందపాటి వీరాంజనేయులు, ఈదర వెంకట సుబ్బారావు ఉన్నారు.

ఎయిడెడ్ టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

ఒంగోలు(విద్య), జూన్ 10 : జిల్లాలో వివిధ దశల్లో ప్రభుత్వంలో విలీనమైన 250 మంది ఎయిడెడ్ టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. వీరికి జీవోనెంబరు 50 ప్రకారం హైస్కూళ్లలో ఉద్యోగోన్నతులు ఇవ్వాలని వారు కోరారు.

సంగీత విద్యార్థినికి వయోలిన్ వితరణ


వయోలిన్ బహుకరిస్తున్న మండవ మురళీకృష్ణ దంపతులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 10:తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని భవ్యశ్రీకి సూర్యశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీ కృష్ణ, సవిత దంపతులు సోమవారం వయోలిన్‌ను బహూకరించారు. స్థానిక కర్నూల్‌రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బండ్లమిట్టకు చెందిన అంబటి శ్రీనివాస రావు, సంధ్యారాణి దంపతుల కుమార్తె భవ్యశ్రీ సంగీతంలో డిప్లొమా కోర్సు చేస్తున్నదని, అందుకు అవసరమైన వయోలిన్ కొనే శక్తి లేకపోవటంతో రాజ్ కనపర్తి, శిల్పా రాఘవేంద్రల ఆర్థిక సహాయంతో ట్రస్ట్ ద్వారా సమకూర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ షహనాజ్, సర్దార్ బాషా, మల్లవరపు శ్రీనివాస రావు, జనసేన నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైను పనులు ప్రారంభం

జరుగుమల్లి (కొండపి), జూన్ 10 : మండలంలోని చిర్రికూరపాడు గ్రామ ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంకుకి పాలేరు నుంచి పైపులైను, కాలనీలో అంతర్గత పైపులైన్‌ల నిర్మాణానికి రూ.17 లక్షలు మంజూరయ్యాయి. పనులను సోమవారం గ్రామ సర్పంచ్ మెడబలిమి కోటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ నలదల రామారావు ప్రారంభించారు.


పనులను ప్రారంభిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి కల్పన

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నాగులుప్పలపాడు, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజనం అందించే కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కల్పన కోరారు.నాగులుప్పలపాడులో సోమవారం నిర్వహించిన కుకింగ్ కార్మికుల మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలతో పాటు కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. ప్రత్యేక యూనిఫాం,గుర్తింపు కార్డులను అందించాలన్నారు. వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హనుమంతరావు, మాధవి, వెంకటేశ్వరమ్మ, జి.బసవపున్నయ్య పాల్గొన్నారు

టీడీపీ కార్యకర్తపై దాడి

దొనకొండ, జూన్ 10: టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త గొడ్డలితో దాడి చేసిన సంఘటన మండలం లోని కట్టకిందప ల్లిలో సోమవారం చోటుచేసు కుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పోలు కోటేశ్వరరావు ఎన్ని కల్లో గ్రామంలో వైసీపీకి వంద ఓట్లు మెజార్టీ వస్తుం దనుకుంటే 25 ఓట్లు మెజార్టీ రావడాన్ని జీర్ణించుకోలేకపో యాడు. అందుకు టీడీపీ కార్యకర్త కాటి చెన్నకేశవులు కారణమని భావించాడు.


గాయపడ్డ చెన్నకేశవులు

దీంతో గ్రామంలోని టీ కొట్టు వద్ద చెన్నకేశవులు కూర్చొని ఉండగా వైసీపీ కార్యకర్త పోలు కోటేశ్వరరావు గొడ్డలితో దాడి చేశాడు. తప్పించుకునే క్రమంలో చెన్నకేశవులు తలకు గొడ్డలి తగిలి తీవ్రగా యమైంది. చెన్నకేశవులును బంధువులు హుటాహుటీన దొనకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఎస్సై సంపత్‌కుమార్ వైద్యం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

చినగంజాం, జూన్ 10 : మండలంలోని సోపిరాల గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తి రునాళ్లను పురస్కరించుకొని నాటుబండి పోలు రాధ బల ప్రదర్శనలో సోమవారం ఎడ్ల పోటీ పడ్డాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన మండల స్థాయి పోటీలకు కడవకుదురు, సోపి రాల, పెదగంజాం, రాజుబంగారుపాలెం, చిన గంజాం, కుక్కలవారిపాలెం తదితర గ్రామా లకు చెందిన 14 ఎడ్ల జతలు పోటీలో పాల్గొ న్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలను గ్రామ టైరు బండ్ల యూనియన్ నాయకులు ఆమంచి బ్రహ్మయ్య, గంటా సుబ్బారావు ప్రా రంభించారు. ఎడ్ల పందేలు గ్రామీణ సంస్కృ తికి ప్రతీకగా నిలుస్తాయని వారు అన్నారు. యువకులు, పెద్దల ఈలలు, కేరింతలతో ఆల య ప్రాంగణం హోరెత్తింది. పరిసర గ్రామా లకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ పోటీలను ఉత్సాహంగా తిలకించారు. పోటీ లలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు మంగళవారం బహుమతులను అందజేస్తా మని నిర్వాహకులు తెలిపారు. న్యాయనిర్ణేత గా తంగేడి హుసన్, వ్యాఖ్యాతగా తుమ్మలపెం ట చిన్నాలు వ్యవహరించా రు. పోటీల్లో పాల్గొ నడానికి వచ్చిన ఎడ్ల జత యాజమానులను ని ర్వాహకులు శాలువాలు కప్పి సన్మానించారు. సోపిరాల గ్రామ టైరుబండ్ల యూనియన్ అధ్య క్షుడు తుమ్మలపెంట జయరావు, సభ్యులు చెరుకూరి భాస్కరరావు, ఆమంచి ఏసు, సీహె చ్ అంకమ్మ, రాంబాబు, కృష్ణ, అప్పారావు, శివ శంకర్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.


పోటీపడుతున్న సోపిరాల ఎడ్లు

అధికారులు ఫుల్.. సభ్యులు నిల్!

కోరంలేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సింగరాయకొండ, జూన్ 10 : రాష్ట్రంలో జరి గిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజ యాన్ని చవిచూడటంతో ఆపార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జనం సమస్య లపై చర్చించేందుకు కూడా విముఖత చూపుతు న్నారు. కోరంలేక స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ప్రభుత్వం మారిన తరువాత తొలి సమావేశం కావడంతో అధికారులు ఫుల్‌గా రాగా సభ్యులు మాత్రం కరువయ్యారు. మండలంలో 19 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా కేవలం ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ షకీలా, శానం పూడి ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే హాజర య్యారు. పది మంది సర్పంచ్‌లలో పాకల, బింగ నపల్లి సర్పంచ్‌లు సైకం చంద్రశే ఖర్, జెట్టి విజయలక్ష్మి వచ్చారు. సమావేశం నిర్వహించడానికి కనీసం 8 మంది సభ్యులు ఉండాలి. కానీ కేవలం ముగ్గురు మాత్రమే రావడంతో కోరం సరి పోక సమావేశాన్ని మంగళవారా నికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీ డీవో నగేష్‌కుమారి ప్రకటించారు. అప్పుడు కూడా కనీస సభ్యులు హాజరుకాకపోతే నిరవధికంగా వాయిదా వేస్తామని ఆమె తెలి పారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేష్‌కుమారి

మీ కృషితోనే అఖండ విజయం

ఎమ్మెల్యే గొట్టిపాటి
ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
ఘనస్వాగతం పలికిన టీడీపీ కార్యకర్తలు, అధికారులు

బల్లికురవ, జూన్ 10 : ఎన్నికలలో టీడీపీ కూటమి అఖండ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేరు పేరునా కృతజ్ఞ తలు తెలిపారు. ఈ ఎన్నికలలో ఘన విజయం సాధిం చిన అనంతరం సో మవారం తొలిసారిగా బల్లికురవ మండలానికి వచ్చిన గొట్టిపాటికి నాయకులు, కార్యక ర్తలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్, గొట్టిపాటి హనుమంతురావు విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన శ్రే ణులను ఎమ్మెల్యేగా విడివిడిగా కలిసి తన గెలుపునకు శ్రమించినవారిని అభి నందించారు. కొరిశపాడు మండలం పమిడిపాడు నుంచి పెద్ద ఎత్తున వాహ నాల్లో వచ్చి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కృషి చేసిన వారందరికీ అండగా ఉంటానన్నారు. పలు శాఖల అధికారులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది ఎమ్మె ల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు మలినేని గో విందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి శంకర్, అమరనేని కాశియ్య, మాలపాటి పోతురాజు, గొట్టిపాటి లక్ష్మయ్య, అంజిరెడ్డి, దద్దాల అంజయ్య, జూపల్లి రాఘవరావు, ధూళిపాళ్ల బుల్లిరా మయ్య, పుచ్చకాయల సుబ్బరామయ్య, ఆళ్ల చంద్ర మౌళి, ముంద్రు దానయ్య, జాష్టి శ్రీరంగనాయకులు, పత్తిపాటి వెంకట్రా వు, ఏడుకొండలు, భైరపునేని అజయ్, హనుమంతురావు, యాగంటి సింగరయ్య, కోట శ్రీనివాసరావు, అరవింద్‌కు మార్, అబ్రహం పాల్గొ న్నారు.


ఎమ్మెల్యే గొట్టిపాటికి స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

కాబోయే మంత్రి అంటూ నినాదాలు

కాబోయే మంత్రి గొట్టి పాటి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కష్ట కాలంలో కూడా పార్టీ కోసం ముందుండి నిలిచిన ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఖా యమంటూ పలువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన పమిడిపాడు మహిళలు

మేదరమెట్ల : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను పమిడిపాడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభినంద నలతో ముంచెత్తారు. సోమ వారం పమిడిపాడు నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే రవి కుమార్‌ను కలిసి అభినంద నలు తెలిపా రు. ఈ సంద ర్భంగా మహిళా కార్యకర్తలు రవికుమార్‌కు పూల మాలలు వేసి తమ అభిమా నాన్ని చాటుకున్నారు. నియో జకవర్గంలోని గ్రామాల్లో వచ్చిన గ్రా మాల్లో తెలుగు దేశం పార్టీకి పమిడిపాడు గ్రామంలోనే తెలుగుదేశం పార్టీకి 1147 మెజార్టీ వచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలోని తెలుగుదేశం కార్యకర్తలు తమ ఆనం దాన్ని రవికుమార్‌తో పంచుకున్నారు. పార్టీ మండలా ధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ ఆధ్వర్యంలో 7 బస్సులు, 15 కారు, పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాల్లో బల్లి కురవ వెళ్లారు. గ్రామంలో మహిళా కార్యకర్తలు ఊ రేగింపు అనంతరం వెళ్లారు. కార్యక్రమంలో పిన్నక శ్రీని వాసరావు, విక్రం కృపానాగేశ్వరరావుతోపాటు మహి ళలు ఉన్నారు.


ఎమ్మెల్యేని అభినందిస్తున్న పమిడిపాడు టీడీపీ మహిళలు

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2.54 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 10: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం రూ.2,54,213 వచ్చినట్టు ఈవో గిరిరాజు నరసింహబాబు ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ,లక్షా ఒక్కవెయ్యి, లడ్డు ప్రసాదం ద్వారారూ.30,150. అన్నదాన విరాళం ద్వారా వచ్చిన ఆదాయం రూ.1,12,031, వచ్చాయని తెలిపారు. అన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు వాస్తవులు మాధవరావు నారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళం అందజేశారు.

తైక్వాండోతో ఆత్మవిశ్వాసం

కొండపి, జూన్ 10 : తైక్వాం డోతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కొండపి ఎస్సై కృష్ణబాజీబాబు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీలోని కట్టావారి పాలెంలో గ్రామానికి చెందిన మన ఊరి వికాసం సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలలుగా జరిగిన ఉచిత వేసవి కరాటే, తైక్వాండో శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావే శానికి ఎస్సై హాజరై మాట్లాడారు. అనంతరం బెల్టులు అందజేశారు. కార్యక్ర మంలో శిక్షకులు పవన్, బాలాజీ, లీలా, మైత్రి, శ్రీనివాస్, గ్రామ పెద్దలు లాయర్ చెంచురా మయ్య, బొక్కిసం సుబ్బారావు, మాజీ వీఆర్వో రావెళ్ల చెంచయ్య, కట్టా రమణయ్య, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎస్సై కృష్ణబాజీబాబు

అరకొరగా పాఠ్యపుస్తకాలు

- రేపు పాఠశాలలు పునఃప్రారంభం
- రాని టెన్త్ పీఎస్, 7వతరగతి పుస్తకాలు
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆందోళన

అద్దంకిటౌన్, జూన్ 10 : విద్యా సంవత్సరం మరో రెండు రోజుల్లో ప్రారంభం కాబోతుంది. ఆయా పాఠశాలలలోని విద్యార్థులకు అవసర మైన పాఠ్యపుస్తకాలు అరకొరగా మండలానికి చేరాయి. మండలంలో మొత్తం 76వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరంకాగా వాటిలో కేవలం 56 వేల మంది విద్యార్థులకు మాత్రమే పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. దీనికితోడు పలు తరగతులకు అ స లు పాఠ్యపుస్తకాలు రాకపోగా మరో తరగతికి సంబంధించి ఒక సబ్జెక్ట్ పుస్తకాలు రాలేదు. దీంతో పాఠశాలలు ప్రారంభమవుతున్న తరు ణంలో పుస్తకాలు రాకపోతే ఎలా అని విద్యా శాఖ అదికారులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అద్దంకి మండలంలో మొత్తం ప్రభుత్వ పాథమిక పాఠశాలలు 65 ఉన్నాయి. ప్రాథమి కోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 13 ఉన్నాయి. వీటితోపాటు ఎయిడెడ్ పాఠశాలలు మూడు ఉన్నాయి. వీటి అన్నింటికీ సంబం ధించి రానున్న 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొత్తం పాఠ్యపుస్తకాలు అరకొ రగా మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చాయి. మండల విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తర గతి నుంచి 10వ తరగతివరకు 76 వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరమని రాష్ట్ర విద్యాశాఖకు తెలిపారు. వాటిలో కేవలం 56వేల మందికి మాత్రమే పాఠ్యపుస్తకాలను పంపారు. వాటిలోను 7వతరగతికి సంబం ధించి ఒక్క పాఠ్యపుస్తకం కూడా రాలేదు. అ లాగే పదవ తరగతి పీఎస్ సబ్జెక్ట్‌కు పుస్తకాలు రాలేదు. మరో రెండు రోజులల్లో పాఠశాలలు ప్రారంభం కాబోతుండగా నేటికీ అన్ని పుస్త కాలు రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

56వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయి

అద్దంకి మండలంలో 76వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరం అని జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు తెలియజేశామని ఎంఈవోలు డీ గంగాధరరావు, బీ సుధాకరరావు తెలిపారు. వాటిలో ఇప్పటికి 56వేల మందికి మాత్రమే పుస్తకాలు వచ్చాయని, మిగిలిన పాఠ్య పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 11,006 పాఠ్యపుస్త కాలు, 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 15,610 పుస్తకాలు వచ్చాయన్నారు. ఏపీసీ ఆదే శాల మేరకు వారి కేటాయించిన తేదీలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్త కాలు, నోట్ పుస్తకాలు, షూ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా రాష్ట్ర విద్యాశాఖ తగు చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈవోలు కోరారు.


బ్రిడ్జిపై కూలి ఉన్న రైలింగ్

కొమ్మమూరు కాలువ బ్రిడ్జిపై కూలిన రైలింగ్

- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ప్రజలు, వాహనదారులు

కారంచేడు (పర్చూరు), జూన్ 10 : వాడరేవు పిడుగురాళ్ల రహదారిలోని కారంచే డు కొమ్మమూరు కాలువపై ఉన్న బ్రిడ్జి రైలింగ్ కూలి ప్రమాదాలకు నిలయంగా మా రింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈబ్రిడ్జి పై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం బ్రిడ్జిపై రైలింగ్ కూలిపోవడంతో వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం కొంత శిథిలావస్థకు చేరడం, బ్రిడ్జి అంచులపై ఏర్పాటు చేసిన రైలింగ్ కూలిపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. దీంతోపాటు, వృద్ధులు, చిన్నారులు సైతం ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జికి రైలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా ఆర్అండ్‌బీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అంసరం ఎంతైనా ఉంది.

మనస్తాపంతో మహిళ బలవన్మరణం

చీరాలటౌన్, జూన్ 10 : మనస్తాపంతో మహిళ బలవన్మరణం చెందిన సంఘ టన ఆదివారం రాత్రి స్థానిక వైకుంఠపురం పోలేరమ్మ గు డి సమీపంలో చోటుచేసు కుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలశెట్టి పోలేరమ్మ (35) భర్త శివకుమార్ నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయారు. ఆమె అప్పటి నుంచి స్వల్ప అనారోగ్యానికి గురైంది. ఈక్రమంలోనే జీవితంపై ఆశ చంపుకుని ఇంట్లోనే పురుగు మందు తాగింది. స్థానికులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులు కూడా మృతిచెందడంతో ఒక్కగానొక్క 15 ఏళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలి హాస్పి టల్ వద్ద విలపిస్తున్నాడు.


వీసీ రాధాకృష్ణన్ ద్వారా బంగారు పతకాన్ని అందుకుంటున్న యశస్విని

యశస్వినికి గోల్డ్‌మెడల్

హైదరాబాద్, జూన్ 10 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 6వ స్నాతకోత్సవం సోమవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అద్దంకిలోని రాంనగర్‌కు చెందిన పావులూరి యశస్విని బాంబినో అగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ గోల్డ్ మెడల్‌ను వ్యవసాయ వర్సిటీ కులపతి వీసీ రాధాకృష్ణన్ చేతులమీదుగా అందుకున్నారు. ఎంఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సులో అత్యధిక ఓవరాల్ జీపీఏ సాధించిన యశస్వినికి ఈ గోల్డ్‌మెడల్ దక్కింది. తల్లిదండ్రులు పావులూరి శ్రీనివాసబాబు, రాణి ప్రోత్సాహమే తనను ఈ స్థాయికి నిలిపిందని యశస్విని తెలిపారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

- మూడేళ్లకే నెర్రలిచ్చిన రోడ్డు
- కంకర లేచిపోయి అధ్వానంగా మారిన వైనం


మూడేళ్లకే నెర్రెలిచ్చిన సీసీ రోడు

దర్శి, జూన్ 10: వైసీపీ ప్రభుత్వ హయాంలో దర్శి పట్టణంలో నిర్మిం చిన అంతర్గత రో డ్లు మూడు సంవ త్సరాలకే దెబ్బతి న్నాయి. పలురోడ్లు కుంగిపోయి నెర్ర లిచ్చాయి. కొన్నిరో డ్లు కంకరలేచి పోయి గుంతలమ యం వంయ్యాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా సీసీ రోడ్లు నిర్మిం చడంతో అతి తక్కు వ కాలానికే రోడ్లు దెబ్బతిన్నాయి. ద ర్శిపొదిలి రోడ్డులో నుంచి హ్యాపీ హో మ్స్‌కు వెళ్లే దారిలో మూడేళ్ళ క్రితం వే సిన సీసీ రోడ్డు నెర్ర లిచ్చి పగిలిపోయిం ది. అంతర్గత రోడ్లు కంకర లేచిపోయి గుంతలు పడ్డాయి. దర్శికురిచేడు రోడ్డులోని బీసీ కాలనీలో కూడా దెబ్బతిన్నాయి. గతంలో టీడీపీ హయాంలో వేసిన రోడ్లు 20 సంవత్సరాలు జరిగినా చెక్కు చదర లేదు. వైసీపీ హయాంలో నిర్మించిన సీసీ రోడ్లు మూడే ళ్ళకే దెబ్బతినటం తో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా సీసీ రోడ్డు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మార్టూరు, జూన్ 10 : మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన వీబూది గిరీష్ (25) వివాహిత చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆమెకు భర్త, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బొల్లా పల్లి గ్రామంలో గిరీష్ అనే మహిళ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మ హత్యాయత్నం చేశారు. అనంతరం ఈ విషయాన్ని గమ నించిన కుటుంబసభ్యులు ఆమెను చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్టేషన్‌కు సమాచారం ఇచ్చి నట్లు తెలిపారు. గిరీష్ స్వగ్రామం పెద దర్శి. ఆరేళ్ల కిందట బొల్లాపల్లి గ్రామానికి చెందిన అంకమ్మరావుతో వివాహం అయింది. మద్యానికి బానిసైన అంకమ్మరావు తర చుగా భార్యపై చేయిచేసుకొని వేధించేవారు. ఈ విషయమై తనకుమార్తెను అల్లుడు అంకమ్మరావు మానసికంగా శారీరకంగా వేధించడంతోఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి కే పెదఅంజయ్య స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రేపు పీఎంశ్రీ పాఠశాలల టీచర్లకు శిక్షణ

ఒంగోలు(విద్య), జూన్ 10 :జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులకు ఈనెల 12న ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. నేషనల్ మిషన్ ఫర్ మెంటరింగ్, నేషనల్ ప్రొఫెషనల్ స్టాండర్డ్స్ ఫర్ టీచర్స్ వంటి అంశాలపై టీచర్ల వృత్తి పరమైన అభివృద్ధి, విద్యావంత మైన అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దే శమన్నారు. యూట్యూబ్ ద్వారా టీచర్లందరూ శిక్షణను వీక్షించాలన్నారు. ఉప విద్యా ర్థులు, మండల విద్యాధికారులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సుభద్ర కోరారు.

రేషన్ బియ్యం దారిమళ్లిస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 10 : పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం దారి మ ళ్లితే సహించేది లేదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివా రం రేషన్ డీలర్లు కొండయ్యను కలిశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ పరంగా రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం, కందిపప్పు, చక్కెర తదితరాలు నల్లబజారుకు తరలకుండా కార్డుదారులకు అందజేసే బాధ్యత డీలర్లపై ఉందన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని యానాదికాలనీలో నెలనెలా రేషన్ సక్రమంగా పంపిణీ కావడం లేదని అక్కడి వారు తన దృష్టికి తెచ్చారన్నారు. రేషన్ బియ్యంకు ధర నిర్ణయించి డబ్బు తీసుకోండని లబ్ధిదారులకు చెప్పడం లాంటి అంశాలు పునరావృతం కాకూడదని డీలర్లకు సూచించా రు. అందుకు డీలర్లు సానుకూలంగా స్పందించారు. నిబంధనల మేరకు నడుచుకుంటామని చెప్పారు. వారి సమస్యలను కొండయ్య దృష్టికి తెచ్చారు. అనం తరం కొండయ్యకు డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.



నిరుపయోగంగా పడి ఉన్న చెత్త రిక్షాలు

ప్రజాధనం నిరుపయోగం

- తుప్పుపట్టిపోతున్న చెత్తరిక్షాలు
- పంచాయతీలకు అందజేయని వైనం
- అధ్వానంగా పారిశుధ్యం

పొదిలి, జూన్ 10 : స్వచ్ఛ సంకల్పానికి అధికారులు తూట్లుపొడుస్తున్నారు. లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. గ్రామీణప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టడం మానేశారు. పారిశుధ్య నిర్వహణను లోపభూయిష్టంగా మార్చారు. అడపాదడపా కురుస్తున్న వర్షానికి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దోమలు విజృంభించి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచిఉందని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అధికారులే నిర్వీర్యం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నియమించిన స్వచ్ఛరాయబారులు సకాలంలో జీతాలు చెల్లించక పోవడంతో వారు స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ కోసం స్వచ్ఛరాయబారులను నియమించారు. వారి ద్వారా ఆయా గ్రామాలలో తడిపొడి చెత్తలను సేకరించడం ఎప్పటికప్పుడు పారిశుధ్యపనులను చేపట్టాలని తలంచారు. అయితే సకాలంలో వారికి జీతభత్యాలు చెల్లించకపోవడంతో విధుల నుండి తప్పుకోవాల్సి వచ్చింది. పంచాయతీల్లో తడిపొడి చెత్తలను సేకరించేందుకు ప్రభుత్వం వేలాదిరూపాయలు వెచ్చించి చెత్తరిక్షాలను కొనుగోలు చేశారు. ఆ రిక్షాలను స్వచ్ఛరాయబారులకు అందజేయకుండా అధికారులు కాలయాపన చేయడంతో ఆ రిక్షాలు నిరుపయోగంగాపడి ఉన్నాయి. స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా రిక్షాలను ఆరుబైటె ఉంచారు. దీంతో ఎండకు ఎండి వానకు తడిచి తుప్పుపట్టాయి. దీంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఆ కార్యాలయానికి నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నప్పటికీ, ఆ రిక్షాల గురించి పట్టించుకోవడం లేదు. కనీసం తుప్పు పడుతున్న రిక్షాలను ఆయా పంచాయతీలకు అందజేసే చొరవ కూడా చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ప్రజాధనం పట్ల చులకభావంతో వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పులవురు కోరుతున్నారు. ఇప్పటికైనా చెత్తరిక్షాల ద్వారా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి చెత్తసంపద కేంద్రాలకు చేరవేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం రానున్న తరుణంలో అంటు వ్యాధులు ప్రబలకుండా అధికారులు పారిశుధ్యపనులను వేగవంతం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు ప్లంబర్ మృతి

- కోల్డ్ స్టోరేజ్ లిఫ్ట్‌లో ఇనుప రాడ్డు తలకు తగలడంతో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ

మార్కాపురం రూరల్, జూన్ 10: ఇనుపరాడ్డు తలకు బలంగా తగిలి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తిప్పాయపాలెం పంచాయతీ పరిధిలో సోమవారం చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పాయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ కోల్డ్ స్టోరేజీలో ప్లంబర్ వర్క్ చేసేందుకు మార్కాపురం పట్టణం గాంధీ బజారుకు చెందిన పెరుమాళ్ల నరసింహారావు(65) వెళ్లాడు. ప్లంబింగ్ పనులు చేయడం కోసం కోల్డ్ స్టోరేజ్‌లోని లిఫ్టులో ఎక్కాడు. కింది నుంచి బస్తాలు పైకి తీసుకెళ్లెందుకు ప్రత్యేకంగా ఈ లిఫ్ట్‌ను వినియోగిస్తారు. అయితే పనిచేసే క్రమంలో నరసింహారావు కూడా లిఫ్ట్ ఎక్కాడు. ఈ లిఫ్ట్ డిజైన్ కేవలం బస్తాల కోసం మాత్రమే అనువుగా ఉంటుంది. అయితే పైకి వెళ్లిన తర్వాత లిఫ్ట్ పైన ఇనుపరాడ్డు ఆయన తలను బలంగా తాకింది. దీంతో పైనే లిఫ్ట్‌లో మృతిచెందాడు. ఘటన స్థలాన్ని రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్, సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రెండు మిస్సింగ్ కేసులు నమోదు

మార్కాపురం, జూన్10: మార్కాపురం పట్టణ పోలీసులు సోమవారం రెండు మిస్సింగ్ కేసులు నమోదు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శివాజీనగర్ 2వ లైన్‌లో సురభి నిర్మల నివాసం ఉంటోంది. కళాశాల రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తోంది. ఈ నెల 8న విధులకు హాజరైన ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భర్త సురభి శ్రీనివాసులు అన్నిచోట్ల వెదికాడు. కానీ ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు

స్థానిక మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఎనిబెర జోసఫ్ కుమార్తె అరుణకుమారి (20) మానసిక వికలాంగురాలు. ఈ నెల 6న అరుణకుమారి ఇంట్లో నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. దీంతో తండ్రి జోసఫ్ అన్నిచోట్ల వెతికిచూశాడు. కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులుకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేనుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిని బురిడీ కొట్టించిన కేటుగాడు

- ఏటీఎం కార్డు ద్వారా రూ.34వేలు తస్కరణ

గిద్దలూరు టౌన్, జూన్ 10 : వృద్ధులను లక్ష్యంగా చేసుకొని బ్యాంకు ఏటీఎం కేంద్రాల వద్ద కేటుగాళ్లు తమ చేతివాటం చూపుతున్నారు. దీంతో వృద్ధులైన ఖాతాదారులు నష్టపోతున్నారు. తాజాగా గిద్దలూరులో అలాంటి ఘటనే వెలుగు చూసింది. స్థానిక స్టేట్‌బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న ఏటీఎంకు రాచర్ల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పోలా బాలయ్య అనే వృద్ధుడు వచ్చాడు. తన బ్యాంకు ఖాతాలో ఎంత మొత్తం ఉందో తెలుసుకోవాలని అటూఇటూ గమనిస్తున్నాడు. ఇంతలో ఆ కేటుగాడు ఆ వృద్ధుని వద్దకు వచ్చాడు. మిని స్టేట్‌మెంట్ చూస్తే ఎంత డ్రా అయ్యింది, ఎంత ఉన్నది తెలుస్తుందని నమ్మబలికాడు. దీంతో వృద్ధుడు బాలయ్య తన ఏటీఎం కార్డును ఆ కేటుగాడికి ఇచ్చి పిన్ నంబర్ చెప్పాడు. ఆ వృద్ధుడిని మాటల్లో పెట్టి మినిస్టేట్‌మెంట్ తీస్తున్నట్లు నటించాడు. అనంతరం ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ.34వేలు డ్రా చేసుకున్నాడు. మిని స్టేట్‌మెంట్ కాపీ అతనికి ఇచ్చి అక్కడి నుంచి మాయమయ్యాడు. ఆ తరువాత తన అమౌంట్ డ్రా చేసుకునేందుకు వెళ్లగా, అకౌంట్ నుంచి 34వేలు కేటుగాడు చేతిలోకి వెళ్లినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కోట్లలోనే అవినీతి

- పల్లామల్లి సొసైటీలో బయటపడుతున్న సిబ్బంది బాగోతం



విచారిస్తున్న కృష్ణశాస్త్రి

చీమకుర్తి, జూన్10: గత కొన్నేళ్లుగా గుట్టు గా ఖాతాదారులకు తెలియకుండా వారి నమ్మకాన్ని పణంగా పెట్టి సొసైటీ సిబ్బంది పాల్పడిన అవినీతి భాగోతం ఒక్కొక్కటిగా బహిర్గతమవుతోంది. పల్లామల్లి సొసైటీ ఆవరణలో సోమవారం 51ఏ విచారణను అధికారి కృష్ణశాస్త్రి తన బృందసభ్యులతో చేపట్టారు. ఇప్పటివరకూ సొసైటీలో జరిగిన అవినీతి లక్షల్లో ఉంటుందని భావించినా సమగ్ర విచారణ చేపట్టటంతో అవినీతి కోట్లల్లో జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనాకు విచారణ అధికారులు వస్తున్నారు. మూడురోజుల పాటు రైతులనుంచి సమాచారం సేకరించిన తదుపరి విచారణలో వెలుగు చూసిన మేరకు బాధ్యులైన వారికి నోటీసులు జారి చేసి విచారణ జరుపుతారు.అప్పటికి ఎంతమేరకు అవినీతి జరిగింది అనేది పూర్తి స్థాయి లెక్కతేలనుంది. ఇప్పటికే పదుల సంఖ్యలో బాధితులు తమకు అన్యాయం జరిగిందని విచారణ అధికారికి ఫిర్యాదు చేశారు. ఖాతాదారుల డిపాజిట్లపై లోన్ తీసుకొని జేబులో వేసుకోవటం, రుణాలకు జమ చేయమని ఇచ్చిన నగదును జమ చేయకుండా సొమ్ముచేసుకోవటం లాంటి చర్యలకు సిబ్బంది పాల్పడినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తి అయితే ఏమేరకు అవినీతి జరిగిందనే విషయం తేటతెల్లమవనుంది.

నీట్ ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 10 : నీట్ యూజీ-24 ఫలితాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. నీట్ ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు రావడం, వారందరికి 720/720 మార్కులు రావడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. అదే సెంటర్‌లో పరీక్ష రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అట్టెంప్ట్ చేయగా అందులో 163 కరెక్టు అయ్యాయని తెలిపారు. కానీ ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉండగా 720/720 ఏలా వచ్చాయని ప్రశ్నించారు. ఎంతో మంది విద్యార్థులకు సాధ్యంకాని విధంగా మార్కులు వచ్చాయని, వీటన్నింటినిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

నాగులుప్పలపాడు, జూన్ 10 : ఇద్దరు పంచాయితీ కార్యదర్శులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. డీపీవో ఆదేశాల మేరకు ఉప్పుగుండూరు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న హరిబాబును వినోదరాయునిపాలెంకు, అక్కడ పనిచేస్తున్న వీరయ్యను ఉప్పుగుండూరు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఎంపీడీవో మహాలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నారాయణరెడ్డికి అభినందనల వెల్లువ

మార్కాపురం, జూన్10: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గానికి దూరంగా ఉన్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం ఉదయం మార్కాపురం వచ్చారు. ఉదయం నుంచి స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో అందరికీ అందుబాటులోకి వచ్చారు. దీంతో ఆయనకు అభినందనలు తెలిపేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. కొందరు పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు, మున్సిపాలిటీ, వ్యవసాయ, ఐకేపీ, మైనింగ్, పంచాయతీ రాజ్, అటవీశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఆయన్ను కలిసిన వారిలో ఉన్నారు. అదే విధంగా పట్టణంతోపాటు తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే నారాయణరెడ్డికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి అభినందించారు.



నారాయణరెడ్డికి బొకే అందజేస్తున్న పొదిలి సర్కిల్ పోలీసులు



బీజేపీ నాయకులకు స్వీట్లు తినిపిస్తున్న ఎరిక్షన్‌బాబు

కూటమి నేతల సందడి

ఎర్రగొండపాలెం : ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశం అభివృద్ధి పథంలో ఉంటుందని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. నరేంద్ర మోదీ మూడోపర్యాయం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మానవత్వంతో కదిలి, చిన్నారులకు నీడనిచ్చి..

బేస్తవారపేట, జూన్ 10 : మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో తల్లి,తండ్రిని కోల్పోయి అనాథగా మిగిలిన ముగ్గురు పిల్లలకు స్వచ్ఛంద సంస్థలు, పలువురు దాతలు అండగా నిలిచారు. వారి చదువులకు, ఇంటిని నిర్మించుటకు చేయుత నిచ్చారు. ముగ్గురు పిల్లల చదువులకు పలువురు ఆర్థిక సహాయం చేశారు.వారితోపాటు నవ్యఫౌండేషన్, టీం జిందగీ ఫిక్స్ మిషన్, ఫ్రేండ్స్ ఆఫ్ నీడ్ ఆర్గనైజేషన్, కాశి చంద్రమౌళీశ్వర సేవా సేవా సంస్థ, శ్రీకృష్ణ బలిజ సేవా సంఘం, సూర్య శ్రీదేవాంగుల చారిట్రబుల్ ట్రస్టు, జై జవాన్ సేవా ఫౌండేషన్, అమ్మ ఫౌండేషన్, కనిగిరి రజక సేవా సంఘం, బీసీ ఎంప్లాయిస్, జేఏసీ ప్రకాశం, గిద్దలూరు రజక సేవా సంఘం, చేయూత ఫౌండేషన్, చల్లా కొండయ్య బ్రదర్స్ దివ్యవ హెల్పింగ్ హ్యాండ్స్ తదితర సంస్థలు వారికి తోడ్పాటు అందించాయి. చందాల ద్వారా వీరికి ఇంటిని నిర్మించి ఇచ్చారు. కాగా సోమవారం వారు గృహప్రవేశం చేశారు. కాగా చిన్నారుల తల్లిదండ్రులు కొద్దికాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు.



దాతలు నిర్మించిన ఇంటి వద్ద చిన్నారులు



ఆర్థిక సాయం అందజేస్తున్న ఏస్సై నరసింహారావు

- అనాథలైన ముగ్గురు చిన్నారులకు బేస్తవారపేట ఏస్సై బి.నరసింహారావు, ఆయన ఇంటర్మీడియట్ బ్యాచ్ స్నేహితుల ద్వారా రూ.20 వేలు అర్థిక సాయాన్ని అందజేశారు. తమకు సహాయ సహకారం అందించిన వారికి చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో కానరాని సైడు కాలువలు

రోడ్లపై నిలుస్తున్న మురుగు నీరు

త్రిపురాంతకం, జూన్ 10: మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లుకు సైడు కాలువలు లేక అంతర్గత రోడ్లన్నీ మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో నడిచేందుకు పాదచారులకూ తీవ్ర ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న డ్రైనేజీలు అన్ని ప్రాంతాలలోను పూర్తిగా చెత్తా చెదారంతో పూడిపోయి మురికి నీరు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. వర్షపు నీరు, ఆవాసాల్లోని మురికి నీరు డ్రైనేజీల నుంచి పలు ప్రాంతాలలో బయటకు వస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడేళ్ల క్రితం పెద్దమొత్తంలో నిధులు ఖర్చుచేసి సైడు కాలువల్లోని పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించినా ప్రస్తుతం మళ్లీ పేరుకుపోయాయి. దీనికి తోడు గ్రామంలోని బ్రహ్మంగారికాలనీ, ఉత్తరపు బజారు, ఉప్పలగుట్ట వంటి ప్రాంతాల్లో అనేక వీధులకు సీసీరోడ్లు లేవు. పలుచోట్ల సుమారు 20 ఏళ్ల క్రితం వేసిన సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతింది. ఏ ఒక్క వీధిలోనూ, సైడు కాలువలు లేవు. చిన్నపాటి వర్షానికి కూడా నీరు నిలిచి రోడ్లన్నీ చెరువులను, కుంటలను తలపిస్తున్నాయి. దీంతో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ప్రస్తుతం వర్షాలు వస్తున్న నేపథ్యంలో ఈ అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఏ రోగాలు వస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని అన్ని వీధులకు సైడు కాలువలు ఏర్పాటు చేసి డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్లపై నిలిచిన వర్షపునీరు



కాలువలో పేరుకుపోయిన చెత్త

కోరంలేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సింగరాయకొండ, జూన్ 10 : రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూడటంతో ఆపార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జనం సమస్యలపై చర్చించేందుకు కూడా విముఖత చూపుతున్నారు. కోరంలేక స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ప్రభుత్వం మారిన తరువాత తొలి సమావేశం కావడంతో అధికారులు ఫుల్‌గా రాగా సభ్యులు మాత్రం కరువయ్యారు. మండలంలో 19 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా కేవలం ఎంపీపీ కట్టా శోభారాణి, వైస్ ఎంపీపీ షకీలా, శానంపూడి ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే హాజరయ్యారు. పది మంది సర్పంచ్‌లలో పాకల, బింగనపల్లి సర్పంచ్‌లు సైకం చంద్రశేఖర్, జెట్టి విజయలక్ష్మి వచ్చారు. సమావేశం నిర్వహించడానికి కనీసం 8 మంది సభ్యులు ఉండాలి. కానీ కేవలం ముగ్గురు మాత్రమే రావడంతో కోరం సరిపోక సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో నగేష్‌కుమారి ప్రకటించారు. అప్పుడు కూడా కనీస సభ్యులు హాజరుకాకపోతే నిరవధికంగా వాయిదా వేస్తామని ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేష్‌కుమారి

ఘనంగా సినీహీరో బాలకృష్ణ జన్మదినం

- ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ కేడర్, అభిమానులు
- కేకు కట్ చేసిన ఎరిక్షన్‌బాబు

మార్కాపురం, జూన్ 10: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవ వేడుకలు పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దోర్నాల బస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముందుగా టీడీపీ నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 'జై బాలయ్య, జైజై బాలయ్య' అంటూ నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు గోగిరెడ్డి సత్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, గడ్డం నాగరాజు, చెన్నకేశవులు, టీడీపీ నాయకులు కందుల రోహిత్‌రెడ్డి, సయ్యద్ గఫార్, పఠాన్ హుసేన్‌ఖాన్, కాశిరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : సినీహీరో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ బర్తుడే కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ బసవతారకం కేన్సర్ వైద్యశాల ద్వారా పేదలకోసం అయన చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. సినీహీరోగా ఆయన నటసింహం అంటూ కీర్తిని గడించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : కంభం మండల ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు జూనియర్ గౌస్ ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు నియోజకవర్గ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు నూరుల్లాఖాద్రి, సోమయ్య, కేతం శ్రీనివాసులు, సయ్యద్‌గౌస్, తెలుగుదేశం పార్టీ నాయకులు దాదా తదితరులు పాల్గొన్నారు.



పొదిలిలో కేకు కట్ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

రోగులకు రొట్టెల పంపిణీ

పొదిలి: నటసింహం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జడ్పీటీసి మాజీ సభ్యులు కాటూరి పెదబాబు మాట్లాడుతూ ఎన్‌టీఆర్, నట, రాజకీయ వారసత్వాన్ని బాలకృష్ణ కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణాధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, ఇమామ్‌సా నాయకులు సామంతపూడి నాగేశ్వరరావు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆవులూరి యలమంద, ఉలవా గోపి, తానికొండ వెంకట్రావు, డాక్టర్ శ్రీమన్నారాయణ, మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, యాసిన్ కార్యకర్తలు పాల్గొన్నారు.





మార్కాపురంలో అభిమానుల సంబరాలు, పొదిలిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

అవీ..ఇవీ..

సర్వీసును రెగ్యులర్ చేయాలి

గిద్దలూరు, జూన్ 10 : 1998 డీఎస్సీ ద్వారా అర్హత సాధించి గత ఏడాది ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు 11 నెలలుగా మాత్రమే వేతనం అందుతుందన్నారు. చాలా మంది ఉద్యోగ విరమణ వయస్సుకు దగ్గరగా ఉన్న దృష్ట్యా తమ మీద దయవుంచి తమ సర్వీసును రెగ్యులర్ చేసి ఉద్యోగ విరమణ వయస్సును 62కు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఆ మేరకు ఈ ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి తమ అభ్యర్థనను తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తమ సమస్యను తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఈ సందర్భంగా 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 10: మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 15న మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి మార్కాపురం శాఖ అధ్యక్షులు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో కర్నూల్‌కు చెందిన శాంతిరాం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో రోగులను పరీక్షిస్తామన్నారు. ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డు ద్వారా శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి కంటి ఆపరేషన్ ఉచితంగా చేస్తామన్నారు. కంటి పరీక్ష కోసం వచ్చే రోగులు ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని క్యాంపు రోజే కర్నూలు ఆసుపత్రికి తీసుకెళతారన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరం ఉపయోగించుకోదలచిన వారు 9703195747, 9390053731 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఫారూక్ షుబ్లీ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

కెనరా బ్యాంకు అధికారులకు సన్మానం

పెద్ద దోర్నాల, జూన్ 10: స్థానిక కెనరా బ్యాంకులో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న సీనియర్ మేనేజర్ పీ.మురళీకృష్ణ, మేనేజర్ ప్రీతమ్ సాగర్, సీనియర్ అధికారి భరత్ బలసానీలను, నూతనంగా బ్యాంకులో బాధ్యతలు చేపట్టిన మేనేజర్ శ్రీకాంత్, రాజేష్, కృష్ణమోహన్‌లను ఆ బ్యాంకు సిబ్బంది శ్రీను, రాము, ఇస్మాయిల్ తదితరులు సోమవారం ఘనంగా సన్మానించారు.

తిరుపతికి గంగాపాలెం టీడీపీ కార్యకర్తలు



తిరుపతి బయలుదేరిన కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, జూన్ 10 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో, చంద్రబాబు నాయుడు నాలుగో పర్యాయం ముఖ్యమంత్రి కానున్నారు. ఈ సందర్భంగా మండలంలోని గంగాపాలెం టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి సోమవారం బయలుదేరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తిరుపతి కొండకొచ్చి వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటామని ఎన్నికల ముందు మొక్కుకున్నట్లు గంగాపాలెం టీడీపీ నాయకులు తెలిపారు. ఆ మేరకు నాయకులు కార్యకర్తలు సోమవారం లారీలో తిరుపతి కొండకు బయలుదేరి వెళ్లారు.

పిటికాయగుళ్లలో అధ్వానంగా రోడ్డు



అధ్వానంగా రోడ్డు

బేస్తవారపేట, జూన్ 10: మండలంలోని పిటికాయగుళ్ల గ్రామంలోని ఎనుక వీధిలో సూమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే అంతర్గత రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల చిల్లకంప పెరిగి, చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారుతోంది. దీనిపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి పిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఇప్పకైన అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సంగీత విద్యార్థినికి వయోలిన్ వితరణ



వయోలిన్ బహుకరిస్తున్న మండవ మురళీకృష్ణ దంపతులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 10:తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని భవ్యశ్రీకి సూర్యశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ, సవిత దంపతులు సోమవారం వయోలిన్‌ను బహూకరించారు. స్థానిక కర్నూల్‌రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బండ్లమిట్టకు చెందిన అంబటి శ్రీనివాస రావు, సంధ్యారాణి దంపతుల కుమార్తె భవ్యశ్రీ సంగీతంలో డిప్లొమా కోర్సు చేస్తున్నదని, అందుకు అవసరమైన వయోలిన్ కొనే శక్తి లేకపోవటంతో రాజ్ కనపర్తి, శిల్పా రాఘవేంద్రల ఆర్థిక సహాయంతో ట్రస్ట్ ద్వారా సమకూర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ షహనాజ్, సర్దార్ బాషా, మల్లవరపు శ్రీనివాసరావు, జనసేన నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి


గాయపడ్డ చెన్నకేశవులు

దొనకొండ, జూన్ 10: టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త గొడ్డలితో దాడి చేసిన సంఘటన మండలంలోని కట్టకిందపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పోలు కోటేశ్వరరావు ఎన్నికల్లో గ్రామంలో వైసీపీకి వంద ఓట్లు మెజార్టీ వస్తుందనుకుంటే 25 ఓట్లు మెజార్టీ రావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. అందుకు టీడీపీ కార్యకర్త కాటే చెన్నకేశవులు కారణమని భావించాడు. దీంతో గ్రామంలోని టీ కొట్టు వద్ద చెన్నకేశవులు కూర్చొని ఉండగా వైసీపీ కార్యకర్త పోలు కోటేశ్వరరావు గొడ్డలితో దాడి చేశాడు. తప్పించుకునే క్రమంలో చెన్నకేశవులు తలకు గొడ్డలి తగిలి తీవ్రగాయమైంది. చెన్నకేశవులును బంధువులు హుటాహుటీన దొనకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఎస్సై సంపత్‌కుమార్ వైద్యం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

పామూరు, జూన్ 10: మండలంలోని నర్రమారెళ్ల పంచాయతీ పరిధిలోగల సుబ్బక్కపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగు బ్రిడ్జి దగ్గర రోడ్డు కోతకు గురైంది. వర్షాలకు రోడ్డు మార్జిన్‌లోని మట్టి కోసుకుపోయింది. దీంతో ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2.54 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 10: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం రూ.2,54,213 వచ్చినట్టు ఈవో గిరిరాజు నరసింహబాబు ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.లక్షా ఒక్కవెయ్యి లడ్డు ప్రసాదం ద్వారారూ.30,150. అన్నదాన విరాళం ద్వారా వచ్చిన ఆదాయం రూ.1,12,031, వచ్చాయని తెలిపారు. అన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు వాస్తవులు మాధవరావు నారాయణ, సుబ్బలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళం అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మించరూ..

పామూరు జూన్ 10 : చిన్నపాటి వర్షం కురిస్తేనే రోడ్డంత బురదమయమై నెల్లూరు రోడ్డులో ఇండెన్ పెట్రోల్‌బంకు వెనుక వీధి ప్రజలు వాపోతున్నారు. వేలాది రూపాయలు పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లిస్తున్న రోడ్డు నిర్మాణానికి పంచాయతి పాలకులు చొరవ చూపడం లేదంటున్నారు. వర్షం కురిస్తే రోడ్డు బురదమయం కావడంతో స్థానికులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

అనుమతి లేని ఐదు వాహనాలు పట్టివేత

ముండ్లమూరు, జూన్ 10: ముండ్లమూరు పరిధిలో అనుమతి పత్రాలు లేకుండా తిరుగుతున్న ఐదు వాహనాలను దర్శి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఒక్కో వాహనానికి రూ.20వేలు చొప్పు న జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైలెన్స్‌తో పాటు పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు.

రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలి

పామూరు జూన్ 10: రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఎం.విజయకుమార్, డాక్టర్ షేక్ రుబినా తెలిపారు. మండలంలోని ఎస్టీ వర్గాల్లో 2 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వరకు ఉన్న వారికి రక్తహీనత రాకుండా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. రక్తహీనత నివారణ కోసం అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా నియోజకవర్గ స్థాయిలో మాచవరం ప్రభుత్వ వైద్యశాలలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ


మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కురిచేడు, జూన్ 10: కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కురిచేడు ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలు దోమల బారిన పడి మలేరియాకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏదైనా అనుమానాలు ఉంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, జూన్ 10 : మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం మలేరియా మాసోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈనెల 30 వరకు అన్ని గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారులు మధు కిరణ్, సీహెచ్ ప్రవీణ్ కిరణ్‌కుమార్ తెలిపారు. మలేరియా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే, ఉమామహేశ్వర అగ్రహారంలో జరిగిన ర్యాలీలో సబ్‌సెంటర్ పరిధిలోని పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు ఆదరణ పెరగాలి

ఒంగోలు(కల్చరల్), జూన్ 10: భారతీయ సంప్రదాయ కళలైన నటన, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి వాటికి ఆదరణ పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నటుడు, గాయకులు, పీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ కుంభా రాఘవయ్య అన్నారు. సోమవారం స్థానిక వీవీఎం కళాశాల (మంగమ్మ కాలేజీ) ఆవరణలో ఏర్పాటుచేసిన వేదిక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంస్థ చైర్మన్ షేక్ సిద్దాంబి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ చిన్నతనం నుంచే విద్యార్థులకు కళలపట్ల ఆసక్తిని కలిగించాలన్నారు.

రచయిత, దర్శకులు వెలనాటి మల్లికార్జున రావు మాట్లాడుతూ జిల్లా కళాకారులకు పుట్టినిల్లని, ఈ జిల్లానుంచి ఎంతోమంది నటులు సినీరంగంలో ప్రవేశించి రాణించారన్నారు. అటువంటి జిల్లా కేంద్రంలో కళలలో శిక్షణనిచ్చేందుకు మంచి సంస్థను ఏర్పాటుచేయటం అభినందించదగిన విషయమన్నారు. సినీ స్టంట్ మాస్టర్, డైరక్టర్ బి.విక్కీమాస్టర్ మాట్లాడుతూ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం సైతం కళారంగాన్ని ప్రోత్సహించినప్పుడే ఎంతోమంది ఔత్సాహిక కళాకారులు వెలుగులోకి వస్తారన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ కె.రంగారావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇటువంటి సంస్థను ఏర్పాటుచేయటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంగీత కళాకారుల సంఘ అధ్యక్షురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, ఆంజనేయులు, సయ్యద్ ఇస్మాయిల్, గోరంట్ల చినరామయ్య, డాక్టర్ ఏ.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయనీగాయకులు డి.కోటేశ్వరరావు, శ్రీదేవి, శేషారత్నం తదితరులు గానం చేసిన పలు సినీగీతాలు అలరించాయి.

చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్),జూన్ 10 : జిల్లాలో పీసీఅండ్ పీఎన్డీటీ యాక్టును పటిష్టంగా అమలు చేయడంతో పాటు ఈ చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన పీసీఅండ్ పీఎన్డీటీయాక్టు అమలుపె జిల్లా మల్టీమెంబర్ అప్రోప్రియేట్ ఆథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టం కింద అనుమతులు పొందిన స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తారా లేదా అని నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం రెన్యూవల్ చేసుకుంటున్నారా లేదా అనేది కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆయన ఆదేశించారు. స్కానింగ్ సెంటర్స్ అనుమతుల్లో భాగంగా ఈ సమావేశంలో ఎనిమిది కొత్త దరఖాస్తులు, ఎనిమిది రెన్యూవల్ దరఖాస్తులు ఆమోదించగా ఒక దరఖాస్తును తిరస్కరించారు.

సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీధరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ నాగార్జున, సార్డ్ ఎన్‌జీవో సభ్యులు సరోజిని తదితరులు ఉన్నారు.

గూడుకు నోచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు

» అద్దె భవనాల్లో అవస్థలు


తాళ్లూరులో శ్లాబ్‌కే పరిమితమైన అంగన్‌వాడీ భవనం

తాళ్లూరు, జూన్ 10: అరకొర వసతులతో అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఏళ్లతరబడి పక్కాభవనాలను నిర్మించక పోవటంతో చాలీచాలని అద్దెభవనాల్లో కొనసాగుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్వపు సమితి అయిన తాళ్లూరులో 2002 సంవత్సరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి సమితి పరిధిలోని తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాల్లోని గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈకేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించటం, ఆరోగ్యసూచనలు పాటించటం వంటి సదుపాయాలు అందుతుంటాయి.

ప్రస్తుతం తాళ్లూరు మండలంలో 54 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, కేవలం 21 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 17 కేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. 16 కేంద్రాలు అద్దె చెల్లింపులు లేని భవనాల్లో నడుస్తున్నాయి. కొన్నిగ్రామాల్లో అద్దెభవనాలు దొరకక పోవటంతో చాలీచాలని ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలకు ప్రభుత్వం అందజేసిన ఆటవస్తువులను వినియోగించలేక పోతున్నారు. దీనికితోడు కేంద్రాలకు సరఫరా జరిగే నిత్యావసర వస్తువులను భద్రపరచలేక పోతున్నామని కొందరు కార్యకర్తలు అంటున్నారు. నెలకు ఒక్కో కేంద్రానికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు చెల్లిస్తున్నారు. ఐదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం మండల పరిధిలో 8 భవనాలకు నిధులు మంజూరుచేయగా పనులు ప్రారంభించారు. నిర్మాణదశలో ఉన్న పనులు అర్థంతరంగా నిలిపి వేశారు.


తాళ్లూరులో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద రజానగరం, తాళ్లూరు, లక్కవరం, బొద్దికూరపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరుచేయగా పనులు చేపట్టారు. ఆతర్వాత నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, అర్థంతరంగా నిలిచిన భవన నిర్మాణ పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నాసిరకంగా సీసీరోడ్ల నిర్మాణం

» మూడేళ్లకే నెర్రలిచ్చిన రోడ్డు

» కంకర లేచిపోయి అధ్వానంగా మారిన వైనం


మూడేళ్లకే నెర్రెలిచ్చిన సీసీ రోడు

దర్శి జూన్ 10: వైసీపీ ప్రభుత్వ హయాంలో దర్శి పట్టణంలో నిర్మించిన అంతర్గత రోడ్లు మూడు సంవత్సరాలకే దెబ్బతిన్నాయి. పలురోడ్లు కుంగిపోయి నెర్రలిచ్చాయి. కొన్నిరోడ్లు కంకరలేచిపోయి గుంతలమయంమయ్యాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా సీసీ రోడ్లు నిర్మించడంతో అతి తక్కువ కాలానికే రోడ్లు దెబ్బతిన్నాయి. దర్శి-పొదిలి రోడ్డులో నుంచి హ్యాపీ హోమ్స్‌కు వెళ్లే దారిలో మూడేళ్ళ క్రితం వేసిన సీసీ రోడ్డు నెర్రలిచ్చి పగిలిపోయింది. అంతర్గత రోడ్లు కంకర లేచిపోయి గుంతలు పడ్డాయి.


అధ్వానంగా సీసీ రోడ్డు

దర్శి-కురిచేడు రోడ్డులోని బీసీ కాలనీలో కూడా దెబ్బతిన్నాయి. గతంలో టీడీపీ హయాంలో వేసిన రోడ్లు 20 సంవత్సరాలు జరిగినా చెక్కు చదరలేదు. వైసీపీ హయాంలో నిర్మించిన సీసీ రోడ్లు మూడే ళ్ళకే దెబ్బతినటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

» రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

» వంతెన ఏర్పాటుచేసినా పట్టించుకోని వైనం

» రక్షకదళం హెచ్చరిస్తున్నా బేఖాతర్

» ఆదమరిస్తే అంతేసంగతులు


దొనకొండ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటి ప్లాట్‌పాం ఎక్కుతున్న ప్రయాణికులు

దొనకొండ, జూన్ 10: రైలు ప్రయాణికులు తీవ్ర నిర్లక్ష్యంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. పిల్లాపాపలతో తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. క్షణం పాటు అలక్ష్యం ప్రాణాలనే బలిగొంటుందని తెలిసినా పట్టించుకోవటం లేదు. దొనకొండ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలను మారేందుకు రైల్వే అధికారులు వంతెన ఏర్పాటుచేసినా రైలు ప్రయాణికులు మాత్రం రైలు ఎక్కేందుకు రైలు పట్టాలు దాటుతూ ఇటువంటి సాహసాలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం రైల్వే డబ్లింగ్ లైన్ ఏర్పాటు కావటంతో గూడ్స్ రైళ్లు నిత్యం వేగంగా రాకపోకలు జరుపుతున్నాయి. వినుకొండ, నర్సరావుపేట, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రైలు ఎక్కేందుకు మూడవ నెంబర్ ప్లాట్‌ఫాంకు వెళ్లాల్సి ఉంది. ప్రయాణికులు ప్రమాదాలను పట్టించుకోకుండా రైలు వచ్చిందనే హడావుడిలో కొందరు, రైలు రాకపోయినా వంతెన ఎక్కలేక మరికొందరు పట్టాలు దాటుతూ మూడవ నెంబర్ ప్లాట్‌పాంకు చేరుతుండటం ప్రతిరోజు జరుగుతున్న తంతు. మూడవ నెంబర్ పాట్‌ఫాంలో రైలు దిగిన అధికసంఖ్యలో ప్రయాణికులు సైతం బయటకు వచ్చేందుకు వంతెన మీదుగా రాకుండా పట్టాలు దాటుతున్నారు. చివరకు చిన్నపిల్లలను ఎత్తుకొని కొందరు, మహిళలు, వృద్ధులు సైతం కష్టమైనా పట్టాలు దాటుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రైల్వే రక్షకదళం సిబ్బంది ఒకవైపు హెచ్చరికలు చేస్తున్నా ప్రజలు పట్టించుకోకుండా పట్టాలు దాటి వెళ్తుండటం గమనార్హం. గతంలో ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు వేగంగా వచ్చి ఢీకొనటంతో ప్రాణాలు కోల్పోయారు. ప్లాట్‌పాంలు మారేందుకు ఏర్పాటుచేసిన వంతెనపై కోతులు ఉండటంతో వంతెన ఎక్కేందుకు భయాందోళనలు కలుగుతున్నాయని కొందరు ప్రయాణికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి వంతెన ఎక్కలేని రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం ఎక్స్‌లేటర్ ఏర్పాటుతో పాటు రైలు ప్రయాణికులు రైలు పట్టాలు దాటి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

దశలవారీగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

» మున్సిపల్ చైర్మన్ గఫార్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్

కనిగిరి, జూన్ 10: మున్సిపాల్టీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తిచేయాలని చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కొవిడ్ కారణంతో పాటు ఇతర కారణాలతో కొన్ని చేయలేకపోయామన్నారు. ప్రతిఒక్కరూ తమ సహకారాన్ని అందించి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, రామనబోయిన శ్రీనివాసులు, పెన్నా ఏడుకొండలు, నక్కా రామకృష్ణ, దాసరి మురళి, రిజ్వానా ఖాలక్, దేవకిరాజేష్, షేక్ ఖాసింసా, వేల్పుల వెంకటేశ్వర్లు, రాచపూడి మాణిక్యరావు, దేవరాజ్, పోతిరెడ్డి రాజా, దేవకి రాజీవ్, చింతం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాగా, కనిగిరి మున్సిపాల్టీలో తమ ఉనికిని చాటుకునేందుకు వైసీపీ నేతలు నానా తంటాలు పడుతున్నారు. గత మూడేళ్ళుగా మున్సిపాల్టీలో చక్రం తిప్పిన షాడోలకు భవిష్యత్తులో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో మున్సిపల్ చైర్మన్ వారికి భరోసా ఇచ్చేందుకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. సమావేశానికి కూడా ఎక్కువమంది షాడోలే రావటం చర్చనీయాంశంగా మారింది.

పీహెచ్‌సీలో అన్నదానం

కురిచేడు, జూన్ 10: కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన 300 మంది గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. కురిచేడు ఆశా కార్యకర్త ఉప్పలపాటి కొండమ్మ తన భర్త శ్రీను జ్ఞపకార్థ ఆర్థిక సహకారం అందించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు ఆకలి తీర్చడం దేవునికి ప్రసాదం సమర్పించడం లాంటిదని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ జేబీ రామారావు అన్నారు.

కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రవీణ్, లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీ రమణారావు, ఏలిసెట్టి రంగనాయకులు, గుప్తా, ఇందూరి వెంకట నరిసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సినీహీరో బాలకృష్ణ జన్మదినం


బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా దర్శిలో కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, జూన్ 10: సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పుట్టినరోజు కేకును కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ వారసుడిగా సినీరంగంలో, రాజకీయ రంగంలో తిరుగులేని విజయాలు సాధిస్తున్నారని చెప్పారు. అనంతరం షిరిడి సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, గుర్రం బాలకృష్ణ, తిరుపతిరావు, దారం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టీడీపీ మండల నాయకుడు యరగొర్ల బసవయ్య నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు బసవయ్య కేకు కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పామూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఎస్.సాంబయ్య కేకు కట్‌చేసి శ్రేణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎస్‌పురం మండల కేంద్రంలోనూ బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కురిచేడు: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాలకృష్ణ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ గంధం గురునాథం, కమతం నాగిరెడ్డి, మొఘల్ మస్తాన్ వలి, గడ్డం బాలయ్య, గణపర్తి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పనులపై విచారణ కమిటీ నియామకం?

దర్శి జూన్ 10: జడ్పీ నిధుల వినియోగంలో అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో విచారణ కమిటీని నియమించినట్లు తెలిసింది. జడ్పీ నిధులు వైసీపీ నాయకులకు పందేరం, మట్టి పనుల పేరుతో మేత శీర్షికన ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు జడ్పీ పనుల కేటాయింపు, నిర్వహణపై అక్రమాలను నిగ్గు తేల్చేందుకు విచారణ కమిటీని నియమించినట్లు సమాచారం. దీంతో వైసీపీ నాయకులు, పనులు చేసిన నిర్వాహకులు తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

కనిగిరిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

కనిగిరి, జూన్ 10: కనిగిరిలో పెరిగిన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా సోమవారం నుంచి ఒన్‌వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఓప్రకటన విడుదలచేశారు. పట్టణంలోని ఎమ్మెస్సార్ రోడ్డు, వైఎస్సార్ రోడ్డు, తీగలగొంది రోడ్డులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. ఓవీ రోడ్డు నుంచి ఎమ్మెస్సార్ రోడ్డులోకి పోయేందుకు తీగలగొంది నుంచి వెళ్ళాలని సూచనలు జారీ చేశారు. ఎమ్మెస్సార్ రోడ్డు నుంచి ఓవీ రోడ్డులోకి వెళ్ళాలంటే వైఎస్సార్ రోడ్డు నుంచి వాహన రాకపోకలు సాగించాలని పోలీసులు పేర్కొన్నారు. పామూరు బస్టాండు సెంటర్ నుంచి చెప్పులబజారు మీదుగా పునుగోడు వైపు వెళ్ళే భారీ వాహనాలకు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు నిషేధాజ్ఞలు విధించారు. భారీ వాహనదారుల వెసులుబాటు కోసం కందుకూరు రోడ్డు నుంచి శంఖవరం రోడ్డులో నుంచి పునుగోడు వైపునకు వెళ్ళేందుకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. వాహనదారులు తమ వాహనాలను రోడ్డుకి ఎడమవైపు మాత్రమే నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు. పోలీసు నిబంధలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

డంపింగ్ యార్డులుగా రహదారులు

» దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ముండ్లమూరు - తమ్మలూరు రహదారి పక్కన పడవేసిన వ్యర్థపదార్థాలు

ముండ్లమూరు, జూన్ 10: మండలంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులుగా మారాయి. గ్రామాల్లోని చెత్తాచెదారం రోడ్డు పక్కన పడవేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో పాదాచారులు, వాహన చోదకులు ఆ రహదారులపై వెళ్ళాలంటే ముక్కు మూసుకొని వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టించు కోవాల్సిన పంచాయతీ అధికారులు వైపు కూడా కన్నెత్తి చూడటం లేదు. . ఇటీవల వర్షాలు కురవటంతో వ్యర్థ పదార్థాలు కుళ్ళి దుర్గంధం వెదజల్లుతుంది. ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి వేంపాడు ఎస్సీ కాలనీ వద్ద, అద్దంకి - దర్శి ప్రధాన రహదారి, మారెళ్ళ నుంచి జమ్మలమడక వెళ్ళే రహదారి, ఈదర నుంచి బొప్పూడి వారిపాలెం వెళ్ళే రహదారి , ఉల్లగల్లు నుంచి కెల్లంపల్లి వెళ్ళే రహదారి, పసుపుగల్లు నుంచి ముండ్లమూరు వెళ్ళే ప్రధాన రహదారి డంపింగ్ యార్డులను మరిపిస్తున్నాయి. ఇటీవల వర్షాలు కురవటంతో దోమలు ఎక్కువై వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థ పదార్థాలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాగా, మండలంలోని పలుగ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఒకటి రెండు గ్రామాలు తప్ప మిగతా గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డుల్లో గ్రామాల్లో ఉన్న వ్యర్థ పదార్థాలను వాటిల్లో వేయకుండా, రహదారుల పక్కన పడవేస్తున్నారు. దీంతో రహదారులు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

117 జీవోను రద్దు చేయాలి

ఒంగోలు విద్య, జూన్ 10: విద్యాశాఖలో అలజడికి కారణమైన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి అధ్యక్షుడు జనార్దనరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో రెండు మాధ్యమాల్లో బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించేందుకు వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐఆర్, పీఆర్సీతో, ఓపీఎస్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు పాండురంగ వరప్రసాద్, ఐవీ.విజయసారథి, నాయబ్‌రసూల్, శేషారావు, హనుమంతరావు, దేవిప్రసాద్, శేఖరరెడ్డి, శివరామకృష్ణ, తిరుమల, యోహానురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.330

సంతనూతలపాడు, జూన్ 10: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు కిలో ధర రూ.330లు పలికింది. వేలంకు చిలంకూరు నుంచి 1,430 పొగాకు బేళ్లు రాగా 1,342 బేళ్లు కొనుగోలు జరగ్గా 88 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.330లు పలకగా, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.311.52 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో 30 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
మంగళవారం 11 జూన్ 2024





● కంపచెట్ల గ్రహణం వీడిన తరువాత ఆలిండియా సర్వీసెస్ అధికారుల భవన సముదాయం, ఎమ్మెల్యే క్వార్టర్స్





రాజధానికి.. జీవం

● యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న రాజధాని పనులు ● కూటమి గెలిచిన మరుక్షణం నుంచి మొదలైన పనులు ● రోడ్లు, ప్రభుత్వ భవనాలకు వీడుతున్న గ్రహణం ● సగానికి పైగా పూర్తయిన జంగిల్ క్లియరెన్స్ పనులు ● త్వరలో ప్రారంభం కానున్న భవన సముదాయ పనులు ● కొత్త కాంతులతో కళకళ లాడుతున్న నవ్యాంధ్ర రాజధాని

ఐదేళ్లు.. రాజధాని అమరావతికి వైసీపీ ప్రభుత్వం గ్రహణం పట్టించింది. ఇప్పుడా గ్రహణం వీడింది. కూటమి గెలుపుతో అమరావతి రాజధాని ఊపిరి పీల్చుకుంది. దీంతో రాజధాని నగరాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటి వరకూ రాజధాని గ్రామాలవైపు ముఖం కూడా చూపని సీఆర్డీఏ అధికారులు రాజధాని రోడ్లపై ఉరుకులు పరుగులు పెడుతూ ఆగమేఘాల మీద పనులను పరుగులు పెట్టిస్తున్నారు. కొత్త కాంతులతో నవ్యాంధ్ర రాజధాని కళకళ లాడుతోంది. ఇప్పటివరకూ కంప చెట్లతో కనుమరుగైపోయిన ఆ ప్రాంతం ఇప్పుడు కొత్త శోభ దిద్దుకుంది.

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతికి పూర్వ వైభవం రాబోతోంది. ఐదేళ్ల క్రితం మొదలైన రాజధాని గ్రహణం ఎట్టకేలకు వీడిపోయింది. మూడు రాజధానుల పేరుతో రాజధాని రైతులకు ఐదేళ్లుగా నరకం చూపించిన అధికార వైసీపీ ఓటమిపాలవడంతోనే రైతులకు మంచిరోజులు వచ్చాయి. అయితే వారంతా కొత్త ప్రభుత్వం కొలువుదీరాక రాజధాని పనులు మొదలవుతాయని భావించారు. కానీ అడగకుండానే ఆకలి తీర్చే అమ్మలాగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందే రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించారు. తనకు రాజధాని అమరావతి నిర్మాణం ఎంతటి ప్రాణప్రదమో ఆయన చెప్పకనే చెప్పారు. ఒక్క మాట కూడా మాట్లాడకుండానే పనులు ప్రారంభించి రైతుల కళ్లలో కాంతులు నింపారు. దీంతో రాజధాని నగరాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రైతుల మొహాల్లో నవ్వులు విరబూస్తున్నాయి.

నాడు శిథిల స్వప్నంలా రాజధాని రోడ్లు

గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాజధానిలో చీకట్లు అలముకున్నాయి. మూడు రాజధానుల అంశాన్ని ముందుకు తెచ్చి అమరావతిని అంతం చేయాలని భావించిన ప్రభుత్వం నగర నిర్మాణాన్ని పూర్తిగా వదిలేసింది. ముళ్ల కంపలు, శిథిలమైన రోడ్లు, ఆగిపోయిన భవనాలు తప్ప మరేమీ కనిపించేవి కావు. రాజధానిలో కంపచెట్లు పెరిగిపోవడంతో చాలాచోట్ల భవనాలు, రోడ్లు కూడా కనిపించకుండా పోయాయి. రాజధానిలో పనులు ఆగిపో వడంతో ఆ వైపు చూసేవారు కూడా లేక నవనగరాలు నిర్మానుష్యంగా తయారయ్యాయి. రోడ్లు ధ్వంసమైపోయాయి. సామాగ్రి దొంగలపాలైపోయింది. కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయి. భవనాలు శిథిల శిల్పాల్లా మిగిలిపోయాయి. కానీ నాలుగు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొత్త ప్రభుత్వం అధికారికంగా ఇంకా కొలువు దీరక ముందే పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటి వరకూ రాజధాని గ్రామాలవైపు ముఖం కూడా చూపని సీఆర్డీఏ అధికారులు రాజధాని రోడ్లపై పరుగులు పెడుతూ ఆగమేఘాల మీద పనులను పరుగులు పెట్టిస్తున్నారు. స్వయంగా రాష్ట్ర అత్యున్నత అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలు, ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వరకూ అధికారులు స్వయంగా అమరావతిలో పర్యటిస్తూ పనులను ప్రత్యక్షంగా పర్య వేక్షిస్తున్నారు. దగ్గరుండి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రాజధాని గ్రామాల్లో పనులు రాకెట్ వేగంతో ముందుకు సాగుతున్నాయి.

ప్రభుత్వ భవనాలకు రోడ్డు క్లియరెన్స్

ఐదేళ్లుగా నిర్మాణం జరగకపోవడం ప్రభుత్వ భవనాలన్నీ శిథిలాలయాలుగా మారిపోయాయి. అటువైపు వెళ్లేందుకు దారి కూడా లేకుండా కంప చెట్లు రోడ్లపై మొలిచాయి. గడిచిన రెండు రోజుల్లో అధికారులు వాటిని తొలగించారు. భవనాల చుట్టూ పెరిగిన కంప చెట్లు పూర్తిగా తొలగించడంతో ఆకాశ హర్మ్యాలు అందంగా కనిపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో అక్కడ కూడా పనులు ప్రారంభం కాబోతున్నాయని, మరో ఐదారు నెలల్లో అవి కూడా అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కాగా ఐదేళ్ల క్రితం ఆగిపోయిన సీఆర్డీయే కార్యాలయం ఇప్పుడు ముగింపు దశకు చేరింది. దాదాపు రంగులు కూడా పూర్తై, మెరుగులు దిద్దేదశలో వుంది. ఇంటీరియర్ పనులు కూడా పూర్తి చేసి మరో రెండు నెలల్లో అక్కడి నుంచే కార్యకలాపాలు ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఎమ్మెల్యే క్వార్టర్లు, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల భవనాలు దుమ్ము దులుపుకుని కనువిందు చేస్తున్నాయి.



లింగాయపాలెం రోడ్డులో విద్యుత్ లైన్ల పనులు

రేయింబవళ్లూ కొనసాగుతున్న అభివృద్ధి పనులు

రాజధానిలో ఐదేళ్లుగా ఆగిపోయిన పనులు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గత నాలుగు రోజులుగా పనులు ఆగకుండా శరవేగంగా సాగుతున్నాయి. గతంలో మాదిరిగా రేయింబవళ్లూ ఆగకుండా పనులు జరిపిస్తున్నారు. 29 గ్రామాల్లో 100కు పైగా పొక్లెయినర్లతో అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. అవీ సరిపోకపోవడంతో మరిన్ని పొక్లెయినర్లను తెప్పించి పనులు జరిపిస్తున్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టిన అధికారులు రోడ్లు, విద్యుత్ సదు పాయాల కల్పనపై దృష్టిసారించారు. రోడ్లను శుభ్రం చేయడానికి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయడానికి వందలమంది పని చేస్తున్నారు. రాజధాని రవాణాకు ఆయువుపట్టైన సీడ్ యాక్సిస్ రోడ్డుకు సొబగులు అద్దుతున్నారు. వాడకం లేక శిథిలమై, మొక్కలు మొలిచిన రోడ్లను శుభ్రం చేస్తున్నారు. డివైడర్లపై వీధి దీపాలు ఏర్పాటు చేసి నవ నగరాల్లో కాంతులీనుతున్నాయి.

శంకుస్థాపన ప్రాంతానికి మహర్దశ

ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన ప్రాంతం కళకళలాడుతోంది. ఇప్పటి వరకూ కంపచెట్లతో కనుమరుగైపోయిన ఆ ప్రాంతం ఇప్పుడు కొత్త శోభ దిద్దుకుంది. శిలాఫలకాలు, మ్యూజియం చుట్టూ వున్న కంపచెట్లను తొలగించి అందంగా తీర్చిదిద్దారు. అమ రావతిలో పనులు వేగం పుంజుకోవడంతో రాకపోక లు కూడా పెరిగాయి. ఎప్పుడూ వెలవెలబోయే సీడ్ యాక్సిస్ రోడ్డు వాహనాల రాకపోకల తో కళకళలాడుతోంది. ఈ క్రమంలో రాజధానిలో అభివృద్ధి పనులు చూసేందుకు వచ్చే పర్యాటకులు సందడి కూడా మొదలయింది.



సీడ్ యాక్సిస్ రోడ్డు డివైడర్‌పై కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



కంప చెట్లు తొలగించిన సెక్రటేరియట్ భవనాలకు వెళ్లే రోడ్డు



రంగులద్దుకున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం



జంగిల్ క్లియరెన్స్ తరువాత శంకుస్థాపన ప్రాంతం



రాయపూడిలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్

అమరావతి.. జిగేల్

● సీడ్ యాక్సెస్ రోడ్డుకు పూర్వ వైభవం
● రాయపూడిలో 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పనులు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతికి ఐదేళ్ల అంధకారం వీడింది. మళ్లీ విద్యుత్ కాంతులీనుతున్నాయి. వైసీపీ పాలనలో అమరావతి విధ్వం సంతో చీకట్లు కమ్ముకున్నా.. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో.. రాజధాని పునరుద్ధరణ పనులు ప్రారంభంతో తిరిగి అమరావతి ప్రకాశిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఆర్‌డీఏ అధికారులు అమరావతిలోని రోడ్లకు విద్యుదీపాల పనులు చేపట్టారు. అమరావతికి ప్రధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డులో పనిచేయని విద్యుద్దీపాలను రెండురోజుల పాటు శ్రమించి మరమ్మతులు చేశారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో లైట్లను వెలిగించటంతో సీడ్ యాక్సెస్ రోడ్డు దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. విద్యుద్దీపాల వెలుగులను సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ స్వయంగా రాయపూడి వరకు వెళ్లి పరిశీలించారు.

అమరావతిలో కోటి లీటర్ల 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పనులు

అమరావతి రాజధానిలోని రాయపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ అధికారుల సన్నద్ధమయ్యారు. సోమవారం సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వెళ్లి 10 ఎంఎల్‌డీ వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. అమరావతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చేపట్టిన పనుల్లో ఇది కూడా ఒకటి. పనులు అసంపూర్తిగా ఉండటంతో.. దీనిని పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోజుకు కోటి లీటర్ల నీటిని పంపిణీ చేసే సామర్థ్యం ఈ 10 ఎంఎల్‌డీకి ఉంటుంది.



పన్నెండున పండుగే

● సీఎం ప్రమాణ స్వీకారోత్సవం...
● జిల్లా అంతటా పండగ వాతావరణం
● ప్రభుత్వ కార్యాలయాలన్నింటికి విద్యుత్ దీపాలతో అలంకరణ
● 12న గన్నవరం వెళ్లేందుకు అన్ని చోట్ల అందుబాటులో బస్సులు
● రాయలసీమ నుంచి వచ్చే ప్రజలకు ఇక్కడ ఆతిథ్యం



విద్యుత్ వెలుగుల్లో బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం

గుంటూరు, జూన్10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న దృష్ట్యా జిల్లా అంతటా పండగ వాతావరణం ప్రతిబింబించేలా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మూడు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించాల్సిందిగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి ఆదేశాలు అందాయి. అలానే ప్రమాణ స్వీకారాత్సవ కార్యక్రమానికి పరిమితంగా ప్రజలను అనుమతిస్తున్నందున జిల్లాలో ఎక్కడికక్కడ ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీవీఐపీ, వీఐపీ పాస్‌లు పొందిన వారితో పాటు మరి కొందరు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగే గన్నవరం వెళ్లేందుకు వీలుగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం మూడో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని తొలుత అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకోసం రాజధానిలోని పలు ప్రాంతాలతో పాటు మంగళగిరి ఎయిమ్స్‌ని కూడా పరిశీలించారు. అయితే ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు హాజరు కాబోతున్న దృష్ట్యా భద్రతని పరిగణనలోకి తీసుకొని గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఐటీ పార్కు ప్రదేశాన్ని ఎంపిక చేశారు. అదే అమరావతి రాజధానిలో అయితే చాలా హెలి ప్యాడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలానే వర్షం కురిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయానికి కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉన్న ఐటీ పార్కు స్థలాన్ని ఖరారు చేశారు. కాగా సీఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి రాయలసీమ నుంచి 8 వేల మంది వరకు ప్రతినిధులు హాజరౌతారని అంచనా వేస్తున్నారు. వారికి తగిన ఆతిథ్య ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్ర టభుత్వం కలెక్టర్‌ని ఆదేశించింది. దాంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ముస్లిం షాదీఖానా, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలలో అతిథిగృహాలను వారికి కేటాయిస్తారు. వారంతా 11వ తేదీన సాయంత్రమే జిల్లాకు చేరుకొంటారు. ఈ నేపథ్యంలో వారికి వేర్వేరు చోట్ల బస ఏర్పాటు చేసి రాత్రి విందు, ఉదయం అల్పాహారం సరఫరా చేస్తారు. అనంతరం గన్నవరం వెళ్లేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తారు. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలకు కొన్ని చోట్ల రంగులు వేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి పండగ వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్నారు. ముఖ్య కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



బాపట్ల : సచివాలయానికి విద్యుత్ వెలుగు

బాపట్లలో జిల్లాలో..

బాపట్ల: చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మున్సిపల్ కమీషనర్ బి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలంయంతోపాటు 20 వార్డు సచివాలయాల భవన సముదాయాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడురోజులపాటు విద్యుత్ వెలుగులలో ప్రభుత్వ కార్యాలయాలు ఉంటాయని అధికారులు తెలియజేశారు.

రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు టూటైర్ ఏసీ బోగి



రేపల్లె, జూన్ 10: తీరప్రాంత ప్రయాణికులకు రైల్వే అధికారులు డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు టూటైర్ ఏసీ బోగీని అందు బాటులోకి తీసుకురావటం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ బోగిలో రేపల్లె కోటాలో 58 బెర్త్‌లు ఉండగా, ఒక్కో బెర్త్ ధర రూ.865గా రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు గతంలో థర్డ్ ఏసీ బోగి ఉండగా, అదనంగా టూటైర్ ఏసీ బోగిని ఏర్పాటు చేశారు.



పెమ్మసాని చంద్రశేఖర్‌కి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖని ప్రధాని మోదీ కేటాయించారు. సోమవారం మంత్రులకు శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగా ప్రాధాన్యం కలిగిన శాఖని పెమ్మసానికి కేటాయించడంపై ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమౌతోంది. ఆయన సహకారంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు సమూలంగా అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయిన్ లు, వంతెనలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సుదీర్ఘకాలం తర్వాత కేంద్ర మంత్రివర్గంలో గుంటూరు జిల్లాకు ప్రాతి నిధ్యం లభించింది. కాగా గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి ఏ శాఖని కేటాయిస్తారోనన్న చర్చ సోమవారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా జరిగింది. కాసేపు వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ఇస్తారని పార్టీ నాయ కులు, కార్యకర్తలు చర్చించుకొన్నారు. మరికొందరు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖలో సహాయ మంత్రి ఇస్తారని, తద్వారా అమరావతి రాజధానితో పాటు పట్టణప్రాంతాలకు మేలు జరుగుతుందని భావించారు. అయితే సాయంత్రం ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ కేటాయించారు. ఈ శాఖ కూడా ప్రాధాన్యమైన వాటిల్లో ఒకటని భావిస్తున్నారు. ఉపాధి హామీ కార్యక్రమం ద్వారా పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయించి ఒకవైపు కూలీలకు పనులు, మరోవైపు అభి వృద్ధి పనులు చేయించే అవకాశం ఉంటుంది.

కమ్యూనికేషన్ల శాఖ కూడా ప్రాధాన్యం కలిగినదేనన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. నేడు ప్రపంచం అంతా ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ తదితర రంగాలు రాజ్యమేలుతున్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనికేషన్ల శాఖ కీలకమైనది. సాంకేతిక విప్లవాన్ని జిల్లాలోని యువత అందిపుచ్చుకొనే అవకాశాలను కల్పించే కార్యక్రమాలను అమలు చేయవచ్చు. ఈ రెండు శాఖలే కాకుండా కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఇతర శాఖల మంత్రులను మెప్పించి, ఒప్పించి నిధులు మంజూరు చేయించే అవకాశం పెమ్మసానికి దక్కింది. ఈ అవకాశాన్ని ఆయన చక్కగా సద్వినియోగం చేసుకొని జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తారని అంతా ఆశిస్తున్నారు.

శపథం నెగ్గించుకున్న చంద్రబాబు

● అన్నమాట ప్రకారమే ముఖ్యమంత్రిగా చంద్రబాబు

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'చంద్ర బాబు అంటే అది.. ఎక్కడైతే అవమానపడ్డారో.. అక్కడే సగర్వంగా తలెత్తుకు నిలబడ్డారు.. దటీజ్ చంద్రబాబు!' - ఇది రాజధాని రైతుల నోట వినిపిస్తున్న మాట! రాజధాని గ్రామాల్లో ప్రతిధ్వనిస్తున్న మాట! తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని రీతిలో అనూహ్య విజయం పొందడం పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాటి చంద్రబాబు శపథమే రాజధాని నిర్మాణానికి శ్రీరామ రక్ష అయిందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తమ తలరాతలు మారబోతున్నాయని వారు సంబరాలు చేసు కుంటున్నారు.

అసెంబ్లీ సాక్షిగా శపథం ..

గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి అన్న కనీస గౌరవం లేకుండా చంద్రబాబును తీవ్ర అవమానంపాలు చేశారు. అసెంబ్లీ సాక్షిగా నిరాధార నిందారోపణలు చేస్తూ, ఆయన సతీమణిని అవమానించ డంతో ఆయన అసెంబ్లీ నుంచి శోకాతప్తుడై బయటకి వచ్చారు. గుండెలు పగిలే ఆవేదనను అదుపు చేసుకోలేక కన్నీరు కార్చారు. బయటకు వచ్చే ముందు కౌరవ సభగా మారిన అసెంబ్లీని గౌరవ సభగా మార్చి ముఖ్యమంత్రిగా అడుగుపెడతానని శపథంచేశారు. ఆరోజున ఆయన చేసిన శపథం ప్రజల గుండెలను కదిలించివేశాయి. ప్రజలంతా ఆయన వెంటే నిలిచారు. ఆయన శపథం నెరవేరేలా చరిత్ర ఎరుగని తీర్పునిచ్చారు. అధికార వైసీపీకి డిపాజిట్లు లేకుండా చేసి తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. అవమానాల్ని అధిగ మించి ఆత్మస్థైర్యంతో తాను నిలబడడమే కాకుండా, తాను తలపెట్టిన రాజధానిని, తనను నమ్మిన రైతాంగాన్ని కాపాడారని రైతులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. ఈ గెలుపు చంద్రబాబు గెలుపు మాత్రమే కాదని అది రాజధాని రైతుల, రాష్ట్ర ప్రజల గెలుపని అంటున్నారు.


బాబును అవమానించారు



రాజధాని రైతులను వేధించడం, మాజీ ముఖ్య మంత్రి అన్న గౌరవం కూడా లేకుండా చంద్రబాబును అవమానించడం జగన్‌రెడ్డి చేసిన దిద్దుకోలేని తప్పు. చంద్ర బాబును అవమానించడం, ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరిని అల్లరిపాలు చేయాలనుకోవడమే వైసీపీకి శాపంగా మారింది. ప్రజలు తగిన బుద్ధి చెప్పారు.

- సురేంద్ర, అమరావతి అసైన్డ్ రైతు

భువనేశ్వరి శాపం తగిలింది



ఏనాడు రాజకీయాల జోలికి రాని చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని వైసీపీ ప్రభుత్వం, జగన్ అనుచర గణం అవమానించాలని చూసింది. ఆమె శాపమే వారికి తగిలింది. అందుకే వారికి ప్రతిపక్ష స్థానం కూడా దక్కలేదు.

- కామినేని గోవిందమ్మ

యశస్వినికి గోల్డ్‌మెడల్



వీసీ రాధాకృష్ణన్ ద్వారా బంగారు పతకాన్ని అందుకుంటున్న యశస్విని

హైదరాబాద్, జూన్ 10 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 6వ స్నాతకోత్సవం సోమవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అద్దంకిలోని రాంనగర్‌కు చెందిన పావులూరి యశస్విని బాంబినో అగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ గోల్డ్ మెడల్‌ను వ్యవసాయ వర్సిటీ కులపతి వీసీ రాధాకృష్ణన్ చేతులమీదుగా అందుకున్నారు. ఎంఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సులో అత్యధిక ఓవరాల్ జీపీఏ సాధించిన యశస్వినికి ఈ గోల్డ్‌మెడల్ దక్కింది. తల్లిదండ్రులు పావులూరి శ్రీనివాసబాబు, రాణి ప్రోత్సాహమే తనను ఈ స్థాయికి నిలిపిందని యశస్విని తెలిపారు.

దర్శి ఏఎంసీ చైర్మన్ రాజీనామా



రాజీనామ పత్రంతో షేక్ షకీలా

దర్శి, జూన్ 10: దర్శి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు రాజీనామాలు చేయటం ఆరంభించారు. అందులో భాగంగా దర్శి ఏఎంసీ చైర్మన్ షేక్ షకీలా సోమవారం రాజీనామా చేశారు. మార్కెట్ యార్డు కార్యదర్శి పద్మశేఖర్‌కు రాజీనామా పత్రం అందజేశారు. పలువురు సభ్యులు కూడా రాజీనామాలు చేశారు. మరికొంతమంది నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు త్వరలో రాజీనామాలు చేసే అవకాశం ఉంది.

త్రిపురాంతకం ఎంపీపీ రాజీనామా



రాజీనామా లేఖను జడ్పీ డిప్యూటీ సీఈవోకు అంజేస్తున్న కోట్ల సుబ్బారెడ్డి

త్రిపురాంతకం, జూన్ 10: త్రిపురాంతకం మండల పరిషత్ అధ్యక్ష పదవికి కోట్ల సుబ్బారెడ్డి రాజీనామా చేశారు. ఒంగోలు జడ్పీ డిప్యూటీ సీఈవో హనుమంతరావుకు రాజీనామా లేఖను సోమవారం అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో తెలిపారు. కోట్ల సుబ్బారెడ్డి వెంట ఉమ్మడివరం ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైసీపీ నాయకుడు ఆర్‌వీ.పిచ్చయ్య ఉన్నారు.

ఒకరోజు ఆలస్యంగా పాఠశాలలు పునఃప్రారంభం

ఒంగోలు(విద్య), జూన్ 10: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు ఒకరోజు ఆలస్యంగా పునఃప్రారంభం కానున్నాయి. విద్యాశాఖ ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు ఈనెల 12న పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే అదేరోజు ఉదయం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో 12న సెలవు దినంగా ప్రకటించి 13న పాఠశాలలు ప్రారంభించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. వారి కోరికను మన్నించిన ప్రభుత్వం పాఠశాలలు ఈనెల 13న పునఃప్రారంభించాలని ఆదేశించింది.

ట్రాక్టర్ ప్రమాదంలో యువ రైతు దుర్మరణం



మణికంఠరెడ్డి(ఫైల్)

చీరాలటౌన్, జూన్ 10 : పొలం సాగు చేసుకునేందుకు తండ్రితో కలిసి ట్రాక్టర్‌తో దుక్కి దున్నుకుంటున్న యువ రైతు ప్రమాదవశాత్తు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చీరాల మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కల మణికంఠరెడ్డి (23) రైతు. ఇతనికి భార్య కుసుమ, మూడేళ్ల పాప ఉన్నారు. గ్రామ శివారులోని పొలంను సాగు చేసుకునేందుకు ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నారు. ఇతని తండ్రి సుందర రామిరెడ్డి ట్రాక్టర్ నడుపుతుండగా రోటామీటర్ మిషన్ పొలాన్ని దున్నుతుంది. ఈక్రమంలో అడ్డుగా వచ్చిన కలుపు తొలగించేందుకు మిషన్ దగ్గరకు వెళ్లిన మణికంఠ ప్రమాదవశాత్తు రోటామీటర్ కింద పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మరోవైపు మణికంఠరెడ్డి భార్య మరో కాన్పుకు సిద్ధంగా ఉన్న క్రమంలో ఘటన అందరినీ కలచివేసింది. సోమవారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టీడీపీ విజయోత్సవ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

పంగులూరు, జూన్ 10: పంగులూరులో టీడీపీ సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి సాధించిన ఘన విజయంతో పాటు అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్ అత్యధిక మెజార్టీతో నాలుగోసారి గెలుపు సాధించడంతో శ్రేణులు సోమవారం రాత్రి విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బాణసంచాకాల్చారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, గొట్టిపాటి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. డీజే పాటల మోత, యువకుల కేరింతలతో హోరెత్తించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, జాగర్లమూడి సుబ్బారావు, చిలుకూరి ప్రసాద్ నాయుడు, కుర్రా వెంకటరావు, చౌదరిబాబు, చిలుకూరి నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలు నగరానికి పూర్వవైభవం

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 10 : అభివృద్ధిలో ఒంగోలు నగరానికి పూర్వవైభవం తీసుకురావాలని, అందుకోసం అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని, అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన దామచర్ల తన నివాసంలో తొలి సమావేశం కార్పొరేషన్ అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు నగరంలో జరిగిన అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులపై సమీక్షించారు. ముఖ్యంగా నగర ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని సూచించారు. గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు తాగునీరు సరఫరా పనుల గురించి అడిగి తెలుసుకున్న ఆయన ఇటీవల కాలంలో తాగునీటి కోసం మంజూరు అయిన రూ. 339 కోట్లతో చేపట్టిన పనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదించిన పనులు వేగవంతం చేయలన్నారు. నగరంలో తాగునీటికి సమస్య లేకుండా చూడాలని, లీకుల నియంత్రణతోపాటు, శివారు కాలనీల ప్రజలు అవస్థలు పడకుండా సకాలంలో తాగునీరు అందించాలని ఆదేశించారు. త్వరితగతిన పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని ఆదేశించారు. సమావేశంలో కమిషనరు ఎం.జశ్వంత్‌రావు, మునిసిపల్ ఇంజనీర్ జానీబాషా, డీఈలు గణపతి, పద్మజ, ఆర్‌వో మధుబాబు, ఆర్‌ఐలు శ్రీనాథ్, అమ్మిరెడ్డి, మిరియాల శ్రీను, సాయి, సుస్మిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి మున్సిపల్ కార్యాలయం ప్రక్షాళన జరిగేనా..!

- అవినీతికి అలవాటు పడిన కౌన్సిలర్లు
- టీడీపీ వైపు చూస్తున్న వైనం
- వేచి చూసే ధోరణిలో నేతలు



అద్దంకి మున్సిపల్ కార్యాలయం

అద్దంకి, జూన్ 10 : అద్దంకి మున్సిపాలిటీలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత పాలకవర్గం అవినీతికి అలవాటు పడి పట్టణ ప్రజలను జలగల్లా పీల్చుకు తింటున్నారన్న విమర్శలు ఉన్నాయి. మేజర్ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి అధికారులు అవినీతికి పాల్పడితే పాలకవర్గం కన్నెర్ర చేసిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు కూడా చాటుమాటుగానే వ్యవహారాలు చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా ప్రతినిధులే వాటాలకు తెరలేపడంతో అవినీతి మరింత పెచ్చుమీరింది. కొన్ని విభాగాల అధికారులకు టార్గెట్‌లు ఇచ్చి మరీ వసూలు చేశారన్న విమర్శలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో మున్సిపాలిటీలో ఏ చిన్న పని కావాలన్నా సదరు వైసీపీ కౌన్సిలర్ లేదా, వార్డు ఇన్‌చార్జిని కలిస్తేనే జరిగే పరిస్థితి ఏర్పడింది. ఆ నాయకుడి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తరువాత సంబంధిత విభాగంలో ముడుపులు ముట్ట చెపితేనే ఫైల్ ముందుకు కదిలేది. ఆయా పనులకు సంబంధించి సంబంధిత విభాగ అధికారి మామూళ్లు వసూలు చేసి సంబంధిత నేతలకు పంచి పెట్టే విధంగా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఆయా విభాగాల అధికారులు కూడా విసుగు చెంది తమ వల్ల కాదనే పరిస్థితి కూడా వచ్చిందంటే అద్దంకిలో కౌన్సిలర్‌లు, వైసీపీ నేతలు ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. టీడీపీ కౌన్సిలర్‌లు, సానుభూతి పరులకు సంబంధించిన భవనాలు, ఇళ్ల స్థలాలు, వెంచర్‌లు అయితే చాలు ధ్వంసం చేయించే విధంగా వ్యవహరించిన సందర్భాలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అయితే వైసీపీ నేతల దాహాన్ని తీర్చలేక భూములు కొనుగోలు చేసి కూడా వెంచర్ లు వేయకుండా మిన్నకున్నారు. కొందరు కౌన్సిలర్‌లు అయితే ఎన్నికల సమయంలో పెద్ద మొత్తంలో ఖర్చు చేశాం, ఆ మొత్తాన్ని ప్రజల నుంచి సంపాదించాలన్న విధంగా వసూలు పర్వానికి తెరలేపారు అనే విమర్శలు ఉన్నాయి.

ఇలా అవినీతి దాహం పెరగడంతో అద్దంకి మున్సిపల్ పాలకవర్గంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఒక్క సారిగా ఉలికిపాటుకు గురయ్యారు. గతంలో జరిగిన అవినీతి బయట పడకుండా చేసుకునేందుకు మరలా యథావిధిగా తమ హవా కొనసాగించేందుకు, తమ పదవులను కాపాడుకునేందుకు వీలుగా టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయంలో టీడీపీ నాయకత్వం తొందర పడకుండా వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ కౌన్సిలర్‌ల విషయంలో ఒకింత కఠినంగా వ్యవహరించి గతంలో జరిగిన సంఘటనలపై విచారణ చేయించడంతో పాటు భవిష్యత్‌లో ఎలాంటి అవినీతికి తావులేకుండా చర్యలు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అద్దంకి మున్సిపాలిటీలో గాడితప్పిన పాలనను దారిలో పెట్టే విధంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీలో మామూళ్ల వసూళ్లకు అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న కౌంటర్‌లకు ఫుల్‌స్టాప్ పెట్టే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైఛీపీ..

వైసీపీ వణికిపోతోంది. ఒక్కసారిగా శ్రేణుల్లో బేలతనం నెలకొంది. స్థానికసంస్థల ప్రజాప్రతినిధులైతే పదవులను కాపాడుకునే ప్రయత్నాల్లో పడ్డారు. తదనుగుణంగా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలను మచ్చిక చేసుకునేందుకు కొందరు చూస్తుండగా అవకావం ఇస్తే టీడీపీలో చేరేందుకు అత్యధికులు సిద్ధమవుతున్నారు. ఎలాగూ అవకాశం లేదనుకున్న కొందరు రాజీనామా బాట పట్టారు. ఇలా మొత్తంగా వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు అతలాకుతలమవుతుండగా ఆ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులు వారి గురించి పట్టించుకోవటం లేదు. ఇటుచూస్తే టీడీపీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే కన్నా వీలైనంత త్వరగా చట్టపరంగా వారిని పదవుల నుంచి తొలగించే యోచన చేస్తున్నారు. సోమవారం పశ్చిమప్రాంతంలోని కొందరు ఎంపీపీలు పదవులకు రాజీనామాలు చేయగా ఒంగోలు మేయర్, పలువురు కార్పొరేటర్లు టీడీపీలో చేరే ప్రయత్నాలకు శ్రీకారం పలకటం విశేషం.

- పార్టీలో ఒక్కసారిగా బేలతనం
- రాజీనామాలు.. ఫిరాయింపులు
- దామచర్లను కలిసే ప్రయత్నంలో ఒంగోలు మేయర్
- ఆచితూచి అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే
- కనిపించని ఓడిపోయిన అభ్యర్థులు
- జీవో మార్పించాలన్న ఆలోచనలో ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రభుత్వంలో ఏ పార్టీ ఉంటే దానికి అనుకూలంగా స్థానిక సంస్థల ఫలితాలు రావటం సహజం. అయితే జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం తీవ్రమైన అప్రజాస్వామ్య చర్యలతో మొత్తం స్థానిక సంస్థలను చేజిక్కించుకునే ప్రయత్నం చేసింది. ఎక్కువభాగం సఫలీకృతమయ్యారు. తదనుగుణంగా జిల్లాలో కూడా అన్నీ నియోజకవర్గాల్లో స్థానికసంస్థల ఎన్నికల్లో వైసీపీ హవా కనిపించింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఏర్పడి జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలతోపాటు రెండు లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవటం తెలిసిందే. దీంతో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల్లో వణుకు మొదలైంది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీలు తదితర పదవులకు ఎంపికైన వారికి మరో రెండున్నరేళ్ల వరకు పదవుల్లో కొనసాగే అవకాశం ఉంది. అయితే ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లను అవిశ్వాస తీర్మానంతో తొలగించే అవకాశం ఉంది. దీంతో ప్రధానంగా ఆ పదవుల్లో ఉన్నవారు టీడీపీ ఎమ్మెల్యే మద్దతు కోసం పరుగులు తీస్తున్నారు.

దామచర్లను కలిసేందుకు ఒంగోలు మేయర్ ప్రయత్నం

జిల్లాలో ఏకైక కార్పొరేషన్‌గా ఉన్న ఒంగోలులో గత ఎన్నికల్లో వైసీపీ భారీ విజయం సాధించింది. మొత్తం 50 డివిజన్లకుగాను 43ను వైసీపీ గెలుచుకోగా ఆరు డివిజన్లలో టీడీపీ, ఒకచోట జనసేన అభ్యర్థులు గెలుపొందారు. అయితే ప్రస్తుత సాధారణ ఎన్నికల పోలింగ్‌కు ముందే వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. టీడీపీ బలం 11కి చేరింది. పరిస్థితి గమనించి కాబోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత టీడీపీలో చేరేందుకు తహతహలాడుతున్నారు. అవకాశం ఇస్తే కలిసి మాట్లాడతానంటూ ఎమ్మెల్యే జనార్దన్‌కు సమాచారం పంపారు. తనతోపాటు కొందరు కార్పొరేటర్లను తీసుకొని టీడీపీలో చేరాలనే ఆలోచన ఆమెకు ఉన్నట్లు తెలుస్తోంది. తదనుగుణంగా వైసీపీ కార్పొరేటర్లతో ఆదివారం తన ఇంట్లో సమావేశమయ్యారు. ప్రస్తుతం 39 మంది కార్పొరేటర్లు ఉండగా సుమారు 27మంది ఆమెతో సమావేశమైనట్లు తెలిసింది. 13 మంది గైర్హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన కార్పొరేటర్లు ఎక్కువమంది తమ డిమాండ్లు నెరవేరిస్తే వైసీపీని వీడేందుకు సంసిద్ధమేనని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా మేయర్ సుజాత దామచర్లను కలిసేందుకు అవకాశం ఇవ్వాలని సమాచారం పంపారు.

పోలింగ్‌కు ముందే ఒకసారి ప్రయత్నం

కాగా పోలింగ్‌కు ముందే టీడీపీకి మద్దతు ప్రకటించేందుకు మేయర్ సుజాత సిద్ధమైనట్లు సమాచారం. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్ ఆమె తరపున రాయబారం చేసినట్లు కూడా తెలుస్తోంది. ఎన్నికల ప్రచారం సమయంలో ఒంగోలు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆమె పార్టీలో చేరే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు బాలినేని ఆమెను కట్టడి చేసినట్లు తెలుస్తోంది. టంగుటూరు వచ్చిన సీఎం జగన్ వద్దకు ఆమెను తీసుకెళ్లి మాట్లాడించినట్లు కూడా తెలిసింది. త్రుటిలో అవకాశం తప్పింది లేదంటే మీకు సంతనూతలపాడు ఎమ్మెల్యే టికెట్ వచ్చేదని జగన్ చెప్పి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఆ తర్వాత ఆమె పార్టీ మారే యోచన వీడినట్లు ప్రచారం జరిగింది. అప్పట్లో టీడీపీ నాయకులు కూడా వైసీపీ నుంచి ముఖ్యులు ఎవరొచ్చినా పార్టీలో చేర్చుకునేందుకు ద్వారాలు తెరిచారు. దాంతో మేయర్ ఒకే అని ఉంటే పార్టీలో చేర్చుకునేవారే. ప్రస్తుతం కూడా కార్పొరేషన్ మేయర్‌గా అధికారికంగా దామచర్లను కలిసి అభినందించాలన్న, సమస్యలపై చర్చించాలన్నా అందుకు ప్రత్యేక అనుమతులు అవసరం లేదు. కానీ పార్టీ మారే యోచనతోనే ఆమె తన మద్దతు కార్పొరేటర్లతో ప్రత్యేకంగా కలవాలని దామచర్లకు సమాచారం పంపారని భావిస్తున్నారు.

దామచర్ల ఆచితూచి అడుగు

కాగా కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించిన దామచర్ల జనార్దన్ ఈ విషయంలో ఆచితూచి అడుగు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఎవరొచ్చినా పార్టీలో చేర్చుకునే పంథాను అనుసరించిన జనార్దన్ ప్రస్తుతం ఆలోచనలో పడినట్లు తెలిసింది. కార్పొరేషన్‌లో అనుకున్న అభివృద్ధి సాధించాలంటే పాలక మండలి సహకారం అవసరం. ఆ కోణంలో ప్రభుత్వానికి అనుకూల పాలక మండలి ఉండాలనేది ఆయన ఆలోచన. అయితే పార్టీశ్రేణుల నుంచి వైసీపీ మేయర్, కార్పొరేటర్లను చేర్చుకునే విషయంలో వ్యతిరేకత ఎదురవుతోంది. మరో వైపు మేయర్‌కు మద్దతుగా కొందరు దామచర్లపై వత్తిడి పెంచినట్లుగా కూడా సమాచారం. దీంతో పాలకమండలిని కట్టడి చేయాలనుకునే అవకాశాలపైన, అవసరమైతే అనుకూలమైన కొత్త మేయర్‌ను ఎంపిక చేసుకునే అవకాశాన్ని కూడా ఆయన పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేయర్‌ను అవిశ్వాస తీర్మానంతో తొలగించేందుకు వారు ఎన్నికైన నాలుగేళ్ల తర్వాతే అవకాశం ఉంటుంది. అలా చూస్తే ప్రస్తుత మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు మరో ఏడాది సమయం ఉంది. దీంతో మంత్రిమండలి ఏర్పడిన తర్వాత కొత్తచట్టం తీసుకొస్తే ఉన్నవారిని తొలగించేందుకు వెంటనే అవకాశం వస్తుంది. అయితే అప్పుడైనా కార్పొరేషన్‌లో ఎక్కువమంది కార్పొరేటర్ల మద్దతు కోసం వైసీపీ వారిని చేరదీయాలి. దీంతో తొందర పడకుండా ఒంగోలు కార్పొరేషన్ పాలకమండలిని దారిలోకి తెచ్చుకునే అంశంపై నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని తెలిసింది. అందుకే మేయర్ అడగ్గానే ఇంటర్వ్యూ ఇవ్వకపోగా ఇవ్వనని కూడా చెప్పకుండా జనార్దన్ తటస్థ వైఖరిలో ఉన్నారని భావిస్తున్నారు.

విద్యుదాఘాతంతో సోదరులు మృతి

- ఆటోలో టెంటు సామాను తీసుకొస్తుండగా ఘటన
- ముండ్లపాడులో విషాదం



లోహిత్‌క్రిష్ణ, సాయిక్రిష్ణ (ఫైల్)

గిద్దలూరు టౌన్, జూన్ 10: తండ్రికి సాయం చేసేందుకు వెళ్లిన ఆ ఇద్దరు కుమారులను మృత్యువు కబళించింది. విద్యుత్ షాక్ రూపంలో వారిని బలితీసుకొంది. ట్రాలీ ఆటోకు సర్వీసువైరు తాకడంతో రెప్పపాటులో ముక్కుపచ్చలారని పిల్లలు విగతజీవులయ్యారు. తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చారు. ఈ విషాద ఘటన గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన శీలం గోపీకృష్ణ అదే గ్రామంలో న్యూ గోపాలకృష్ణ సప్లయర్స్ నడుపుతున్నారు. గిద్దలూరులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీప వీధిలో ఒక గృహప్రవేశానికి తన సప్లయర్స్ నుంచి వంటసామాను, షామియానా సామాను సరఫరా చేశాడు. గృహప్రవేశం ముగిసిన తర్వాత తిరిగి సామానును ముండ్లపాడుకు తీసుకు వెళ్లాల్సి ఉంది. దీని కోసం గోపీకృష్ణ కుమారులు లోహిత్‌కృష్ణ(18), సాయికృష్ణ(16) ఆటోను తీసుకుని గిద్దలూరు వచ్చారు. సెలవులు కావడంతో తండ్రికి సాయం చేసేందుకు వారు వచ్చారు. అక్కడి సామానంతా ఆటోలో నింపుకొని ముండ్లపాడు బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లగా ఓ ఇంటి కోసం ఏర్పాటు చేసిన సర్వీసు తీగ ఆటోలోని సామానును తాకింది. దీంతో ఆటో నడపుతున్న లోహిత్‌కృష్ణ ఆటో దిగాడు. దీంతో ఎర్త్ పాస్ అయ్యి ఒక్కసారిగా ఇద్దరు అన్నదమ్ములు అక్కడే మృతిచెందారు. సామాను తెస్తామని వెళ్లిన కుమారులు ఇరువురు మృత్యువాతపడ్డారని తెలుసుకున్న గోపీకృష్ణ దంపతులు బంధువులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. విగత జీవులై పడివున్న కుమారులను చూసి దంపతులు సొమ్మసిల్లి పడిపోయారు.

తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ..

ఐటీఐ పూర్తిచేసిన లోహిత్‌కృష్ణ, 10వ తరగతి పూర్తిచేసిన సాయికృష్ణలు ఖాళీ సమయాలలో తండ్రికి సహాయపడుతూ ఉండేవారు. వీరు ఇరువురు ఒకేసారి మృతిచెందడంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు. నిన్నటివరకు కలిసిమెలిసి తిరుగుతున్న అన్నదమ్ములు ఒకే పర్యాయం మృతిచెందారన్న వార్తతో ముండ్లపాడులో విషాదం నెలకొంది. ఘటనపై గిద్దలూరు సీఐ సోమయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



పాండురంగాపురం వద్ద ఒడ్డుకు చేరిన మృతదేహం

చీరాలటౌన్, జూన్ 10 : ఆదివారం మధ్యాహ్నం వాడరేవు లైట్ హౌస్ సమీపంలోని సముద్రతీరంలో గల్లంతైన కాటి జయపాల్(18) మృతదేహం బాపట్ల సమీపంలోని పాండురంగాపురం సముద్ర తీరంలో సోమవారం మధ్యాహ్నం ఒడ్డుకు చేరింది. గల్లంతైనప్పటి నుంచి పోలీసులు, కుటుంబ సభ్యులు బాపట్ల వద్ద నుంచి చినగంజాం వరకు అన్ని ప్రాంతాల్లో వెదుకుతూనే ఉన్నారు. ఎట్టకేలకు సోమవారం మృతదేహం ఒడ్డుకు చేరింది. దీంతో కుమారుడు విగతజీవిగా ఉండడాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఈపూరుపాలెం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి అందరికీ ఆహ్వానం

- రేపు కేసరిపల్లి వద్ద కార్యక్రమం
- నేడు విజయవాడలో కూటమి శాసనసభా పక్ష సమావేశం



విద్యుత్ వెలుగుల్లో ప్రకాశం భవనం

ఒంగోలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేయనుండగా ఆ కార్యక్రమానికి భారీగా వెళ్లేందుకు జిల్లాలోని తెలుగు తమ్ముళ్లు సన్నద్ధమవుతున్నారు. అయితే పార్టీ శ్రేణులు అందరికీ అధినేత ప్రమాణస్వీకారానికి ఆహ్వానం పలుకుతున్నా అధిష్ఠానం అక్కడి సభా ప్రాంగణంలోకి మాత్రం పరిమిత సంఖ్యలోనే అనుమతించాలని నిర్ణయించారు. గన్నవరం విమానాశ్రయం ఎదురు కేసరపల్లి వద్ద బుధవారం ఉదయం 11.27కు సీఎంగా బాబు ప్రజల సమక్షంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రధాని మోదీతోపాటు పలురాష్ట్రాల సీఎంలు, పలువురు కేంద్రమంత్రులు కార్యక్రమంలో పాల్గొనున్నారు. దీంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు ప్రమాణస్వీకారోత్సవం జరిగే ప్రాంగణం కేవలం 18 ఎకరాలు మాత్రమే. అలా స్థలం తక్కువగా ఉండటం, ఎక్కువగా ప్రముఖులు వస్తుంటడంతో వారి భద్రత దృష్ట్యా సభా ప్రాంగణంలోకి ముఖ్యనేతలను మాత్రమే అనుమతించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రకారం ఒక్కొక్క నియోజకవర్గానికి 150 పాసులను మాత్రమే ఇవ్వనున్నారు. అందులో 20 వీవీఐపీ పాసులు కాగా 130 వీఐపీ పాసులు ఉంటాయి. వారంతా ఎవరి వాహనాలలో వారు వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనే భావనతో వాహనాల పాసులను కూడా నియంత్రిస్తున్నారు. నియోజకవర్గానికి కేవలం 20 పాసులు మాత్రమే ఇవ్వనున్నారు. మిగిలిన వారు ఏపీ బస్సులలో వచ్చేవిధంగా నియోజకవర్గానికి నాలుగు బస్సులను కేటాయిస్తున్నారు.

ప్రభుత్వపరంగానే కార్యక్రమం

కార్యక్రమం అంతా ప్రభుత్వపరంగానే సాగుతుంది కనుక పాసులను కూడా అధికారులే ఇవ్వనున్నారు. జిల్లాలో కలెక్టర్ల ఆధ్వర్యంలో నియోజకవర్గానికి 150 పాసులు ఆ టీడీపీ ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జికి అందజేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. అలాగే 20 వాహన పాసులను ఇవ్వడంతో రవాణా శాఖ ద్వారా నియోజకవర్గానికి నాలుగు బస్సులను సమకూర్చే బాధ్యత కూడా కలెక్టర్లకు అప్పగించారు. ఆ మేరకు అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇవ్వగా పాసులు, వాహనాల అనుమతి ఇతర అంశాలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అచ్చెన్నాయుడు సోమవారం ఉదయం టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ ఎమ్మెల్యేలకు సూచనలు చేశారు. సభా ప్రాంగణ పరిధిని దృష్టిలో పెట్టుకుని పాసుల సంఖ్యను నిర్ణయించామని, అదనంగా ఒక్కటి కూడా ఇచ్చే అవకావం లేదని స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు, ఆ పాసులో కొన్నింటిని మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు కూడా ఇవ్వాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యేల సమావేశం

అదేసమయంలో నియోజకవర్గాల్లో పాసుల కేటాయిపులలో ఆ నియోజకవర్గం నుంచి పొలిట్‌బ్యూరోలో, రాష్ట్ర కమిటీలో, అనుబంధ విభాగాల రాష్ట్ర బాధ్యులుగా వారికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి తర్వాత స్థానికంగా ముఖ్య నేతలకు ఇవ్వాలని సూచించారు. అయితే భారీ విజయాలు నేపథ్యంలో పెద్దఎత్తున పార్టీశ్రేణులు ప్రమాణస్వీకారానికి ఆహ్వానించాలని సూచించారు. ప్రాంగణం నుంచి విజయవాడ వరకు ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేస్తుండగా పాసులు ఉన్నవారిని లోపలికి అనుమతించి మిగతా వారు బయటి నుంచి చూసేలా సూచనలు ఇచ్చారు.

ఇదిలాఉండగా బుధవారం సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనుండగా కూటమి తరఫున గెలుపొందిన ఎమ్మెల్యేల ఉమ్మడి సమావేశం మంగళవారం విజయవాడలో జరగనుంది. అక్కడి ఏ1 కన్వెన్షన్‌లో ఉదయం పది గంటలకు ఈ సమావేశం జరగనుండగా అందులో చంద్రబాబును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోనున్నారు. కాగా ఆ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు సోమవారం రాత్రికే విజయవాడ చేరుకున్నారు.

ప్రమాణస్వీకార సభ ప్రత్యక్ష వీక్షణ.. జిల్లా అంతటా ఎల్ఈడీ స్ర్కీన్లు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ స్వీకార ప్రమాణ మహోత్సవాన్ని జిల్లాలో ప్రజానీకం ఎక్కువమంది తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్షణం కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ వైపు దృష్టిసారించారు. పలువురు అధికారులకు ఆ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అన్ని నియోజకవర్గాలకు పాసులు అందించే బాధ్యతను డీటీసీ సుశీల, ఆర్టీసీ ఆర్‌ఎం సుధాకర్‌లకు అప్పగించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం నుంచి బుధవారం వరకు విద్యుత్ అలంకరణ బాధ్యతను అందరూ జిల్లా, డివిజన్, మండల అధికారులకు అప్పగించారు.

ఇక ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఎక్కువమంది ప్రజలు వీక్షించేలా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించిన కలెక్టర్ వాటి పర్యవేక్షణ బాధ్యతను జడ్పీ సీఈఓ, డీపీఓలకు అప్పగించారు. అన్ని చోట్ల ఆప్టిక్ ఫైబరు లైన్లు ఏర్పాటు చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలకు సూచించారు. మొత్తం ఏర్పాట్ల పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఓడా వైస్ చైర్మన్ వి.విశ్వేశ్వరరావును నియమించారు.

ఇకనైనా పట్టించుకుంటారా..?

- శిథిలమైన ఉద్యోగుల వసతి భవనాలు
- విలువైన ప్రభుత్వ స్థలంలో పాడైన పోలీస్, ఎన్ఎస్పీ గృహాలు

మార్టూరు, జూన్ 10 : జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ ఉద్యోగులు కోసం నిర్మించిన వసతి గృహాలు నేడు శిథిలమయ్యాయి. విలువైన స్థలాల్లో గతంలో ఏర్పాటు చేసిన వసతిగృహాలు నివాసానికి ఉపయోగంలేకుండా మారాయి. కనీసం ఈ భవనాలు కనిపించకుండా వాటి చుట్టూ ముళ్లచెట్లు, పొదలు పెరిగాయి. దాంతో వీటి పరిసరాల్లోని కొందరు వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించేందుకు వేచిచూస్తున్నారు. ఈ భవనాలు నిర్మించే సమయంలో అక్కడ స్థలం ధర తక్కువగా ఉన్నా, ప్రస్తుతం అక్కడ స్థలం ధర సెంటు లక్షల్లో పలుకుతోంది. మార్టూరు మండలంలో మార్టూరులో పోలీస్ క్వార్టర్స్, కోనంకిలో ఎన్ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగుల వసతి భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి.



శిథిలమై ముళ్లచెట్ల మధ్య ఉన్న పోలీస్ క్వార్టర్స్.. ఎన్నెస్పీ కార్యాలయంలో పాడైన ఉద్యోగుల వసతి భవనాలు.. కోనంకిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం

మార్టూరులో పోలీస్ క్వార్టర్స్ శిథిలం

దాదాపుగా 25 ఏళ్ల క్రితం మార్టూరులో జాతీయ రహదారికి తూర్పువైపున పోలీస్ స్టేషన్ ఉండేది. ఈ స్టేషన్ ఆవరణలో సుమారు అర ఎకరం స్థలం ఉండడంతో అప్పటి అధికారులు చొరవతో సుమారు 8 పోలీస్ క్వార్టర్ భవనాలను నిర్మించారు. వాటిలో ఎస్ఐ నివాసం ఉండడం కోసం కూడా ప్రత్యేకంగా క్వార్టర్‌ని నిర్మించారు. ఈ సమయంలో ఎస్ఐతో పాటు స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుళ్లు కూడా ఆ భవనంలోనే ఉండేవారు. అయితే పోలీస్ స్టేషన్ ప్రాంతం జాతీయరహదారికి దిగువగా ఉండడం, పల్లంగా ఉండడంతో భారీగా వర్షం కురిస్తే అంతా నీటిమడుగులు ఏర్పడేది. పోలీస్ క్వార్టర్స్ పైకప్పులు దెబ్బతినడంతో తరచూ పోలీసు కుటుంబాలు ఇబ్బందిపడేవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ నిర్మాణం అంటే ఈ పోలీస్ క్వార్టర్స్‌కు ఎదురుగా జాతీయరహదారికి పడమరవైపు ప్రభుత్వ స్థలంలో నూతనంగా స్టేషన్ ఏర్పాటైంది. దాంతో పాతస్టేషన్‌ను కొత్త భవనంలోకి మార్చేశారు. అనంతరం స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐతో పాటు పలువురు కానిస్టేబుళ్లు గ్రామానికి దూరంగా ఉన్న, వసతులులేని కార్వర్టర్స్‌ని వదిలేసి గ్రామంలోని అద్దె ఇళ్లలో నివాసముంటున్నారు. ఆ తర్వాత వాటివైపు కన్నెత్తి చూసే పోలీసులు లేకపోవడంతో ఈ భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. అదీగాక ఈ క్వార్టర్స్‌ని పట్టించుకున్న అధికారులు లేకపోవడంతో మార్టూరులో పోలీస్ క్వార్టర్స్ ఉన్నాయనే సంగతిని పోలీసులతోపాటు ప్రజలు మర్చిపోయారు. పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లే దారిని కూడా కొంతమంది ఆక్రమించారు. శిథిలమైన పోలీస్ క్వార్టర్స్‌ని తొలగించి నూతన భవనాలను నిర్మిస్తే పోలీసు ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

కోనంకిలో ఎన్ఎస్పీ ఉద్యోగుల నివాసాలు

మండంలోని కోనంకి ఎన్నెస్పీ కార్యాలయ ఆవరణలోనే 25 ఏళ్ల క్రితం ఉద్యోగుల కోసం సుమారు 5 వసతి గృహాలను ఏర్పాటు చేశారు. ఎన్నెస్పీ కోనంకి సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే ఉద్యోగులుకానీ, కోనంకిలో ఉన్న కార్యాలయంలో పనిచేసే వారు ఈ వసతి గృహంలో ఉండేవారు. ఐదేళ్లకే అవి శిథిలం కావడంతో ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. ఈ స్థలంలోనే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ భవనం ఉంది. అదికూడా శిథిలం అయింది. ఐనా అధికారులు ఉద్యోగులు నామమాత్రంగా కార్యాలయాన్ని వినియోగిస్తున్నారు. దాదాపుగా 40 సెంట్ల విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో భవిష్యత్‌లో ఎన్నెస్పీ ఉద్యోగుల కోసం, ఈ సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు ఉపయోగపడేలా కొత్తగా భవనాలు నిర్మిస్తే అందరికీ ఎంతో ప్రయోజనంగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ ఆవరణలోని శిథిలమైన భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించి, ఉద్యోగులకు వసతిని కల్పిస్తే ఎంతో ఉపయోగంతోపాటు విలువైన ఎన్నెస్పీ స్థలాలు ఆక్రమణకు గురికావు. ఇప్పటికైనా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించి అందరికీ ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం దారిమళ్లిస్తే సహించేది లేదు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 10 : పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం దారి మళ్లిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం రేషన్ డీలర్లు కొండయ్యను కలిశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వ పరంగా రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం, కంది పప్పు, చక్కెర తదితరాలు నల్లబజారుకు తరలకుండా కార్డుదారులకు అందజేసే బాధ్యత డీలర్లపై ఉందన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని యానాదికాలనీలో నెలనెలా రేషన్ సక్రమంగా పంపిణీ కావడం లేదని అక్కడి వారు తన దృష్టికి తెచ్చారన్నారు. రేషన్ బియ్యంకు ధర నిర్ణయించి డబ్బు తీసుకోండని లబ్ధిదారులకు చెప్పడం లాంటి అంశాలు పునరావృతం కాకూడదని డీలర్లకు సూచించారు. అందుకు డీలర్లు సానుకూలంగా స్పందించారు. నిబంధనల మేరకు నడుచుకుంటామని చెప్పారు. వారి సమస్యలను కొండయ్య దృష్టికి తెచ్చారు. అనంతరం కొండయ్యకు డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

అద్దంకి, జూన్ 10 : సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినోత్సవాన్ని సోమవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు, పట్టణపార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, గార్లపాటి శ్రీనివాసరావు, కాకాని అశోక్, వడ్డవల్లి రామారావు, లహరి, రామాంజనేయులు, బచ్చల వాసు పాల్గొన్నారు.

బల్లికురవ : పలు గ్రామాలలో సినీహీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. యువత కేక్ కట్ చేశారు. అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, ఉప్పుమాగులూరు, కొణిదెన తదితర గ్రామాలలో మిఠాయిలు పంచిపెట్టారు.

వేటపాలెం(చీరాల) : అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ త్రివిక్రమ్ మెమోరియల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సోమవారం సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు అన్నదానం చేశారు. అనంతరం ఆశ్రమంలోని వారికి టవల్స్‌ను పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు కౌతవరపు జనార్దనరావు, ప్రేమ్‌కుమార్, పూర్ణ, అంజనేయులు, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మార్టూరు, జూన్ 10 : మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన వీబూది గిరీష్ (25) వివాహిత చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆమెకు భర్త, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బొల్లాపల్లి గ్రామంలో గిరీష్ అనే మహిళ ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మ హత్యాయత్నం చేశారు. అనంతరం ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్టేషన్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. గిరీష్ స్వగ్రామం పెద దర్శి. ఆరేళ్ల కిందట బొల్లాపల్లి గ్రామానికి చెందిన అంకమ్మరావుతో వివాహం అయింది. మద్యానికి బానిసైన అంకమ్మరావు తరచుగా భార్యపై చేయిచేసుకొని వేధించేవారు. ఈ విషయమై తనకుమార్తెను అల్లుడు అంకమ్మరావు మానసికంగా శారీరకంగా వేధించడంతోఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి కే పెదఅంజయ్య స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కొమ్మమూరు కాలువ బ్రిడ్జిపై కూలిన రైలింగ్

- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో ప్రజలు, వాహనదారులు

కారంచేడు (పర్చూరు), జూన్ 10 : వాడరేవు పిడుగురాళ్ల రహదారిలోని కారంచేడు కొమ్మమూరు కాలువపై ఉన్న బ్రిడ్జి రైలింగ్ కూలి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం బ్రిడ్జిపై రైలింగ్ కూలిపోవడంతో వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం కొంత శిథిలావస్థకు చేరడం, బ్రిడ్జి అంచులపై ఏర్పాటు చేసిన రైలింగ్ కూలిపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు. దీంతోపాటు, వృద్ధులు, చిన్నారులు సైతం ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జికి రైలింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిశగా ఆర్అండ్‌బీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అంసరం ఎంతైనా ఉంది.



బ్రిడ్జిపై కూలి ఉన్న రైలింగ్

అరకొరగా వచ్చిన పాఠ్యపుస్తకాలు

- రేపు పాఠశాలలు పునఃప్రారంభం
- రాని టెన్త్ పీఎస్, 7వతరగతి పుస్తకాలు
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆందోళన




ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

అద్దంకిటౌన్, జూన్ 10 : విద్యా సంవత్సరం మరో రెండు రోజుల్లో ప్రారంభం కాబోతుంది. ఆయా పాఠశాలలలోని విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు అరకొరగా మండలానికి చేరాయి. మండలంలో మొత్తం 76వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరంకాగా వాటిలో కేవలం 56 వేల మంది విద్యార్థులకు మాత్రమే పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. దీనికితోడు పలు తరగతులకు అ సలు పాఠ్యపుస్తకాలు రాకపోగా మరో తరగతికి సంబంధించి ఒక సబ్జెక్ట్ పుస్తకాలు రాలేదు. దీంతో పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో పుస్తకాలు రాకపోతే ఎలా అని విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అద్దంకి మండలంలో మొత్తం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 65 ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 13 ఉన్నాయి. వీటితోపాటు ఎయిడెడ్ పాఠశాలలు మూడు ఉన్నాయి. వీటి అన్నింటికీ సంబంధించి రానున్న 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొత్తం పాఠ్యపుస్తకాలు అరకొరగా మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చాయి. మండల విద్యాశాఖ అధికారులు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 10వ తరగతివరకు 76 వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరమని రాష్ట్ర విద్యాశాఖకు తెలిపారు. వాటిలో కేవలం 56వేల మందికి మాత్రమే పాఠ్యపుస్తకాలను పంపారు. వాటిలోను 7వతరగతికి సంబంధించి ఒక్క పాఠ్యపుస్తకం కూడా రాలేదు. అలాగే పదవ తరగతి పీఎస్ సబ్జెక్టుకు పుస్తకాలు రాలేదు. మరో రెండు రోజులల్లో పాఠశాలలు ప్రారంభం కాబోతుండగా నేటికీ అన్ని పుస్తకాలు రాకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

56వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయి

అద్దంకి మండలంలో 76వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అవసరం అని జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు తెలియజేశామని ఎంఈవోలు డీ గంగాధరరావు, బీ సుధాకరరావు తెలిపారు. వాటిలో ఇప్పటికి 56వేల మందికి మాత్రమే పుస్తకాలు వచ్చాయని, మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరలో వస్తాయన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 11,006 పాఠ్యపుస్తకాలు, 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 15,610 పుస్తకాలు వచ్చాయన్నారు. ఏపీసీ ఆదేశాల మేరకు వారి కేటాయించిన తేదీలోపు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా రాష్ట్ర విద్యాశాఖ తగు చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈవోలు కోరారు.



విద్యుత్ కాంతులతో ఎంపీడీవో కార్యాలయం

కార్యాలయాలకు విద్యుత్ శోభ

బల్లికురవ. జూన్ 10 : టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువు దీరనున్న సందర్భంగా మూడు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ కాంతులను ఏర్పాటు చేస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి సోమవారం రాత్రి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో హనుమారెడ్డి పర్యవేక్షణలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

మనస్తాపంతో మహిళ బలవన్మరణం

చీరాలటౌన్, జూన్ 10 : మనస్తాపంతో మహిళ బలవన్మరణం చెందిన సంఘటన ఆదివారం రాత్రి స్థానిక వైకుంఠపురం పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలశెట్టి పోలేరమ్మ (35) భర్త శివకుమార్ నాలుగేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయారు. ఆమె అప్పటి నుంచి స్వల్ప అనారోగ్యానికి గురైంది. ఈక్రమంలోనే జీవితంపై ఆశ చంపుకుని ఇంట్లోనే పురుగు మందు తాగింది. స్థానికులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లిదండ్రులు కూడా మృతిచెందడంతో ఒక్కగానొక్క 15 ఏళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలి హాస్పిటల్ వద్ద విలపిస్తున్నాడు.



శ్రీశైలంలో పూజలు చేస్తున్న గొట్టిపాటి కుటుంబ సభ్యులు

శ్రీశైలంలో గొట్టిపాటి ప్రత్యేక పూజలు

అద్దంకి, జూన్ 10 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం కుటుంబసభ్యులతో కలిసి శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం గొట్టిపాటి రవికుమార్, ఝాన్సీ దంపతులు, పూజారులు ఆశీర్వదించారు.

ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు

అద్దంకి, జూన్ 10 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మాధవరావు, శింగరకొండ వాసవీ ఆర్యవైశ్య అన్నదాన సత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, టీడీపీ ఆర్యవైశ్య నేతలు మామిడి రాంబాబు, పొట్టి శివ తదితరులు బల్లికురవలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రవికుమార్‌ని కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను ఏపీటీఎఫ్ మండల నేతలు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు మలాది నాగరాజు, కరి రామయ్య, అనపర్తి రమేష్‌బాబు, కె.మల్లికార్జునరావు, శ్రీహరి, శంకరరావు, రాజశేఖర్, సుబ్బారావు, కోటేశ్వరరావు, రాఘవయ్య, అంకయ్య, వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేని కలిసినవారిలో ఉన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



పోటీపడుతున్న సోపిరాల ఎడ్లు

చినగంజాం, జూన్ 10 : మండలంలోని సోపిరాల గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని నాటుబండి పోలురాథ బల ప్రదర్శనలో సోమవారం ఎడ్లు పోటీపడ్డాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన మండల స్థాయి పోటీలకు కడవకుదురు, సోపిరాల, పెదగంజాం, రాజుబంగారుపాలెం, చినగంజాం, కుక్కలవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన 14 ఎడ్ల జతలు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలను గ్రామ బైరు బండ్ల యూనియన్ నాయకులు ఆమంచి బ్రహ్మయ్య, గంటా సుబ్బారావు ప్రారంభించారు. ఎడ్ల పందేలు గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని వారు అన్నారు. యువకులు, పెద్దల ఈలలు, కేరింతలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ పోటీలను ఉత్సాహంగా తిలకించారు. పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు మంగళవారం బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. న్యాయనిర్ణేతగా తంగేడి హసన్, వ్యాఖ్యాతగా తుమ్మలపెంట చిన్నాలు వ్యవహరించా రు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన ఎడ్ల జత యాజమానులను నిర్వాహకులు శాలువాలు కప్పి సన్మానించారు. సోపిరాల గ్రామ బైరుబండ్ల యూనియన్ అధ్యక్షుడు తుమ్మలపెంట జయరావు, సభ్యులు చెరుకూరి భాస్కరరావు, ఆమంచి ఏసు, సీహెచ్ అంకమ్మ, రాంబాబు, కృష్ణ, అప్పారావు, శివశంకర్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.



ఎమ్మెల్యే గొట్టిపాటికి స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

మీ కృషితోనే అఖండ విజయం

- ఎమ్మెల్యే గొట్టిపాటి
- ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- ఘనస్వాగతం పలికిన టీడీపీ కార్యకర్తలు, అధికారులు

బల్లికురవ. జూన్ 10 : ఎన్నికలలో టీడీపీ కూటమి అఖండ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలలో ఘన విజయం సాధించిన అనంతరం సోమవారం తొలిసారిగా బల్లికురవ మండలానికి వచ్చిన గొట్టిపాటికి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్, గొట్టిపాటి హనుమంతురావు విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన శ్రే ణులను ఎమ్మెల్యేగా విడివిడిగా కలిసి తన గెలుపునకు శ్రమించినవారిని అభి నందించారు. కొరిశపాడు మండలం పమిడిపాడు నుంచి పెద్ద ఎత్తున వాహ నాల్లో వచ్చి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కృషి చేసిన వారందరికీ అండగా ఉంటానన్నారు. పలు శాఖల అధికారులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి శంకర్, అమరనేని కాశియ్య, మాలపాటి పోతురాజు, గొట్టిపాటి లక్ష్మయ్య, అంజిరెడ్డి, దద్దాల అంజయ్య, జూపల్లి రాఘవరావు, ధూళిపాళ్ల బుల్లిరామయ్య, పుచ్చకాయల సుబ్బరామయ్య, ఆళ్ల చంద్రమౌళి, ముంద్రు దానయ్య, జాష్టి శ్రీరంగనాయకులు, పత్తిపాటి వెంకట్రావు, ఏడుకొండలు, భైరపునేని అజయ్, హనుమంతురావు, యాగంటి సింగరయ్య, కోట శ్రీనివాసరావు, అరవింద్‌కుమార్, అబ్రహం పాల్గొన్నారు.

కాబోయే మంత్రి అంటూ నినాదాలు

కాబోయే మంత్రి గొట్టిపాటి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కష్ట కాలంలో కూడా పార్టీ కోసం ముందుండి నిలిచిన ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఖాయమంటూ పలువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శుభాకాంక్షలు తెలిపిన పమిడిపాడు మహిళలు



ఎమ్మెల్యేని అభినందిస్తున్న పమిడిపాడు టీడీపీ మహిళలు

మేదరమెట్ల : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను పమిడిపాడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. సోమవారం పమిడిపాడు నుంచి పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు రవికుమార్‌కు పూల మాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో వచ్చిన గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి పమిడిపాడు గ్రామంలోనే తెలుగుదేశం పార్టీకి 1147 మెజార్టీ వచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలోని తెలుగుదేశం కార్యకర్తలు తమ ఆనందాన్ని రవికుమార్‌తో పంచుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ ఆధ్వర్యంలో 7 బస్సులు, 15 కారు, పెద్ద సంఖ్యలో ద్విచక్ర వానాల్లో బల్లికురవ వెళ్లారు. గ్రామంలో మహిళా కార్యకర్తలు ఊరేగింపు అనంతరం వెళ్లారు. కార్యక్రమంలో పిన్నక శ్రీనివాసరావు, విక్రం కృపానాగేశ్వరరావు తోపాటు మహిళలు ఉన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు



పతకాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కోచ్

కొత్తపేట(చీరాల), జూన్ 10 : ఏకే అండ్ వీకే కళాశాల విద్యార్థులు పలువురు ఆదివారం రేపల్లె భోగి ధర్మ తైక్వాండో అకాడమీలో జరిగిన తైక్వాండో పోటీలలో విజేతలుగా నిలిచారు. ఈ నేపథ్యంలో సోమవారం కళాశాలలో జరిగిన క్యాక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలజవాణి విజేతలను అభినందించారు. కోచ్ శాంతివరప్రసాద్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో పోటీలో గెలుపొందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



వైద్యాధికారికి డ్రెస్సింగ్ మెటీరియల్‌ను అందజేస్తున్న లక్ష్మీనారాయణ

చినగంజాం, జూన్ 10 : ప్రాథమిక వైద్యశాలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోపిరాల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డ్రెస్సింగ్ మెటీరియల్‌ని సోమవారం అందజేశారు. దాతలు అందజేసిన మెటీరియల్ వైద్యశాలకు వచ్చే పేద ప్రజలకు ఉపయోగపడునని వైద్యాధికారి తెలిపారు. సోపిరాల గ్రామానికి చెందిన దాత ఎన్ఆర్ఐ పల్లపోలు సురేంద్రకుమార్ సొంత నిధులతో సమకూర్చిన డ్రెస్సింగ్ మెటీరియల్‌ని ఆయన తండ్రి లక్ష్మీనారాయణ వైద్యాధికారికి అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పీ సాయిశ్రీచరణ్, భవానీ, సీహెచ్‌వో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు చిరంజీవి, ఉల్దారాణి, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరబాబు, సిబ్బంది మురళి, మహేష్, సుబ్బారావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, టీడీపీ నాయకులు టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, శిఖరం హరిమోహన్‌రావు, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పద్మనాభయ్య, గంటా వెంకటనారాయణ, ధర్మవరపు ఏసునారాయణ, గుండ్రెడ్డి నరసింహారావు, సిద్ధం రాము పాల్గొన్నారు.

స్కిల్‌హబ్ సెంటర్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి, జూన్ 10 : కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో శిక్షణకు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఎంగోపీకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని వారు కోరారు.

'సోమశిల'కు 3,753 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 10 : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతోంది. డ్యాం నీటిమట్టం అడుగంటి బోసిపోగా నైరుతి రుతుపవనాలతో రాయలసీమ జిల్లాల్లో కురుస్తున్న వర్షంతో నాలుగు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 2,966 క్యూసెక్కులు ఉండగా సోమవారం 3,753 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 7.825 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



అద్భుత ఘట్టం వీక్షణకు 11 ఎల్‌ఈడీ స్క్రీన్‌లు

● సీఎంగా రేపు చంద్రబాబు ప్రమాణస్వీకారం ● జిల్లాలో విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 10 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం సందర్భంగా జిల్లాలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. విజయవాడ సమీపంలోని గన్నవరం కేసరపల్లి ఐటీ పార్కు వద్ద బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనుండగా, ఈ అద్భుత ఘట్టాన్ని జిల్లావాసులూ వీక్షించేలా జిల్లావ్యాప్తంగా 11 ప్రదేశాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా చూసేందుకు వెళ్లే వారి కోసం జిల్లాలో 32 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటలకు బస్సులు బయలుదేరి 12న ఉదయానికి గుంటూరు చేరుకుంటాయని చెప్పారు. అక్కడ కల్యాణ మండపంలో సేదతీరి, అల్పాహారం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సోమవారం నుంచి 12వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జేసీ సేదు మాధవన్, డీఆర్వో లవన్న, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, రవాణాధికారి శేషయ్య పాల్గొన్నారు.


విద్యుద్దీప వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు

దెబ్బైపోయాం!

- 'ఫోర్జరీ' స్కాంలో తలలు పట్టుకుంటున్న అధికారులు
- ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు, ఓ లైసెన్సు ఇంజనీరు పాత్ర కీలకం?
- ఓ సహకార సొసైటీ ఛైర్మన్ ఒత్తిడితో పత్రాలు సిద్ధం
- తీగలాగే కొద్దీ వెలుగు చూస్తున్న వాస్తవాలు

నెల్లూరు (సిటీ), జూన్ 10 : నెల్లూరు నగర పాలక సంస్థలోని ఫోర్జరీ సంతకాల స్కాం కొత్త మలుపు తిరుగుతోంది. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మేయర్ భర్త జయవర్ధన్‌తోపాటు సహకార సొసైటీల ఛైర్మన్ పాత్ర కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాలతోనే పత్రం సిద్ధమైనట్లు విమర్శలు గుప్పుమంటుండగా, సచివాలయాల్లోని ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ఈ స్కాంను దగ్గరుండి నడిపినట్లు సమాచారం. నెల్లూరు కార్పొరేషన్‌లోని ఫోర్జరీ సంతకాల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నెల్లూరులోని వివిధ ప్రాంతాలలో 70 భవనాల వరకు ఓసీ లేకుండానే మార్టిగేజ్‌లను విడుదల చేశారు. ఇవన్నీ నిర్మాణ దశలో ఉండగానే జరిగినట్లు ప్రధాన ఆరోపణలు వ్యక్తమవుతుండగా, తుదిగా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పత్రాన్ని నడిపినట్లు తెలుస్తోంది. న్యాయవాది కాకు మురళి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా తన సంతకం కాదని ధ్రువీకరించడం ఈ స్కాంలో గమనార్హం. కాగ నెల్లూరురూరల్లో సహకార సంస్థకు ఛైర్మన్‌గా ఉన్న ఓ వ్యక్తి తొలుత పత్రాలను సిద్ధం చేయగా అందుకు ఓ మహిళ ప్రజాప్రతినిధి భర్త తుది మెరుగులు దిద్దినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 12, 24 డివిజన్లలోని సచివాలయాల్లో ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ఈ ఇద్దరికి ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులు సహకరించినట్లు సమాచారం. కాగ ఈ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, సిబ్బంది మాత్రం వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో ముందుకెళ్లడం వల్ల మోసపోయామంటూ తలలు పట్టుకుంటున్నారు.

● లోతైన దర్యాప్తు దిశగా

ఫోర్జరీ సంతకాల వ్యవహారంపై మండిపడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్ లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికే బాధ్యులైన అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేసి లిఖితపూర్వక వివరణ తీసుకుంటున్న ఆయన తదుపరి తన సంతకాలు ఎలా ఫోర్జరీ జరిగాయంటూ విచారణ జరుపుతున్నట్లు సమాచారం. భవనాలకు సంబంధించిన పత్రాలు ఎలా వెళ్లాయి? ఏ ఏ సెక్షన్ల అధికారుల ద్వారా ముందుకు సాగాయంటూ ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మెగా డీఎస్సీపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంతోపాటు ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాలో డీఎస్సీ అభ్యర్థులు శిక్షణ పొందుతున్న ప్రాంతాల్లో ఎన్ని పోస్టులు ఉంటాయి? ప్రకటన ఎప్పుడు వస్తుంది? పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారంటూ చర్చించుకుంటున్నారు. బుధవారం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చేసే తొలి సంతకం మెగా డీఎస్సీ కావడంతో అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నిరుద్యోగుల నిరీక్షణ
- జిల్లాలో పెరగనున్న టీచర్ పోస్టులు
- జీవో నెం.117 తొలగిస్తారన్న ప్రచారం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

నెల్లూరు (విద్య), జూన్ 10 : బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన లక్షలాది మంది నిరుద్యోగులు చిన్న ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని వేయికళ్లతో ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ చూడగానే ఆవేదన చెందడంతోపాటు లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులు పూర్తి చేసిన తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు.

● వేలాది మందిలో ఉత్కంఠ

గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు మార్చి నెలలో వైసీపీ ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో వేలాది మంది యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఇప్పటి వరకు రెండు డీఎస్సీలు నిర్వహించగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తక్కువ సమయంలో మూడో డీఎస్సీ విడుదల చేశా రు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం 2014, 2018లో మెగా డీఎస్సీలు ప్రకటించడంతోపాటు పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం నాలుగున్నరేళ్ల తరువాత ఎన్నికల సమయంలో డీఎస్సీని హడావుడిగా ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని నిరుద్యోగులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకట న వెలువడుతుండడంతో వేలాదిమంది యువతో ఉత్కంఠ నెలకొంది. తమ జీవితాల్లో వెలుగులు నిండే సమయం ఆసన్నమైందంటూ నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జీవో నెం.117 ముసుగులో ఉపాధ్యాయ ఖాళీలను కుదించడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి తగ్గించారు. జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయాలని ఇందులో కూడా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ పోస్టులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. జిల్లాలో వేలమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తుండగా కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ చేయడంపై వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు ఉన్నా కూడా భర్తీ చేయకుండా గడిచిన ప్రభుత్వంలో పోస్టులను దాచేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీల కొరత ఉండడంతో విద్యార్థుల చేరిక కూడా తగ్గిపోయినట్లు గణాంకాలు చెపుతున్నాయి. అలాగే పలు ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగుతుండగా ఈ పాఠశాలల్లో బోధన నామమాత్రంగానే ఉంటుంది. మరికొన్ని చోట్ల సీఆర్పీలు ఉపాధ్యాయులుగా కొనసాగుతుండగా ఆయా ప్రాంతాల్లో మాత్రం పోస్టులను భర్తీ చేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంపై యువత, నిరుద్యోగులు కోటి ఆశలతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీఓను తొలగించి, పాఠశాలలకు పూర్వవైభవం తీసుకువస్తారని, ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తారన్న ప్రచారంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పోస్టులు పెరిగే చాన్స్!

సంబరం!


కోటంరెడ్డికి కేక్ తినిపిస్తున్న అజీజ్

సినీనటుడు నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం అట్టహాసంగా జరుపుకున్నారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు రూరల్, గూడూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశిం సునీల్, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన బాలయ్య వీడియో ఆకట్టుకుంది.

టపాసుల గోదాములో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్!

ఒకరికి తీవ్రం, ఇద్దరికి స్వల్ప గాయాలు


మంటల్లో తగలబడుతున్న టపాసుల గోదాము

విడవలూరు, జూన్ 10 : బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప జాతీయ రహదారి సమీపంలోని టపాసుల గోదాములో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... బోగోలుకు చెందిన మాదినేని సుమంత్ కొంతకాలంగా టపాసుల గోదాము నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి సరుకు రావడంతో గోదాములోపల సుమంత్, తిప్పకు చెందిన పీట్ల సురేష్ రేనా సర్దుతున్నారు. అయితే, గోదాములో విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు కింద పడి ఒక్కసారిగా మంటలు రేగడంతో సుమంత్, ఈయన తండ్రి నాగేశ్వరావు బయటకు పరుగులు తీశారు. వీరి వెనుకే పరుగు తీస్తున్న సురేష్ దుస్తులకు మంటలు అంటుకోవడంతో శరీరం చాలా వరకు కాలింది. పెద్ద మంటలు, టపాసుల మోతలు చూసిన స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. తిప్ప ఎస్‌ఐ బోజ్య, కావలి రూరల్ సీఐ నాగభూషనం వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కావలి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. టపాసుల పేలుడు కారణంగా గోదాము గోడలు విరిగి పైస్లాబు కూలింది. అర్ధగంట వ్యవధిలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. జిల్లా అగ్నిమాపక అధికారి వాకా శ్రీనివాసులురెడ్డి, కావలి ఇంచార్జి సుధాకర్, తహసీల్దారు వెంకటరత్నం, వీఆర్వో సతీష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడు సురేష్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

వీఎస్‌యూలో ఫైళ్లు మాయం..?

వెంకటాచలం, జూన్ 10: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పలు ఫైళ్లు బయటకు వెళ్తున్నాయని సోమ వారం పుకార్లు షికారు చేశాయి. గత వైసీపీ ప్రభుత్వం లో యూనివర్సిటీ ఉన్నతాధికారులు వారి హయాంలో జరిగిన పనులకు సంబంధించిన పలు ఫైళ్లను మాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో యూనివర్సిటీ లో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులు, కార్యకలాపా లన్నింటిపై క్షేత్రస్థాయిలో ఒక ప్రత్యేక కమిటీని వేసి విచా రణ జరిపించాలని, ఒకవేళ అక్రమాలు జరిగినట్లు నిర్ధార ణ అయితే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్య లు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈ కష్టాలు ఇంకెన్నాళ్లు!?

చినుకు రాలితే చాలు నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు చెరువును తలపిస్తోంది. వేదాయపాళెం సెంటర్ సమీపంలోని మున్సిపల్ స్కూలు వరకు సిమెంటు రోడ్డు వేసిన గత పాలకులు పాత రోడ్డు కనెక్టవిటీని మరిచారు. దీంతో సిమెంటు రోడ్డు ఎత్తుగా ఉండటం వల్ల వర్షం కురిస్తే ఈ ప్రాంతం చెరువును తలపిస్తోంది. అలాగే, కరెంటాఫీస్ సెంటర్ వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకింది. ప్రస్తుతం ఈ రెండుచోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పడి, అందులో వర్షపునీరు నిలిచింది. ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నడిరోడ్డుపై ఎంతపెద్ద గుంతో...!


చెరువు కాదండోయ్.. పటేల్ విగ్రహం వద్ద..


అదుపుతప్పితే అంతే.. వేదాయపాళెం సెంటర్ వద్ద రోడ్డు దుస్థితి

అధ్వానంగా అంతర్గత రోడ్లు



ఆత్మకూరు వీవర్స్‌కాలనీలో రోడ్డు దుస్థితి

ఆత్మకూరు, జూన్ 10: మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లి, వీవర్స్‌కాలనీ, బీసీ కాలనీ, పేరారెడ్డిపల్లి, వెంకట్రావుపల్లిలోని అంతర్గతరోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొన్ని ప్రాంతాల్లో కొంత మేరకు సీసీ రోడ్లు నిర్మించినా పూర్తిగా సమస్యల పరిష్కారం కాలేదు. 23వార్డుల్లో 120కిలోమీటర్ల మేర అంతర్గత రోడ్లు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో రూ.25కోట్లతో పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే అవి టెండర్ దశలో ప్రభుత్వం మార డంతో ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. దానికితోడు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ము రుగు కాలువల్లోని నీరు రోడ్లపై పారుతోంది. పాలకులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాబు ప్రమాణస్వీకారానికి బస్సు

ఉదయగిరి రూరల్, జూన్ 10: ఈ నెల 12న విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు సీతారామపురం, ఉదయగిరి మండలాలకు బస్సు ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 6గంటలకు సీతారామపురం, 7 గంటలకు ఉదయగిరి టీడీపీ కార్యాలయాల నుంచి బస్సు బయలుదేరు తుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సొసైటీ చైర్మన్ రాజీనామా



సీఈఓకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న రామాంజనేయులు

వరికుంటపాడు, జూన్ 10: స్థానిక సొసైటీ కార్యాలయ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు సోమవారం పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిన ఆయన రాజీ నామాపత్రాన్ని సీఈవో రత్తయ్యకు అందజేశారు. నామినేటెడ్ పదవి కావడంతో ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ రాజీనామా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సచివాలయంలో చంద్రబాబు ఫొటో



రామాపురం సచివాలయంలో ఫొటోను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూన్ 10: రామాపురం సచివాలయంలో సోమవారం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫొటోను ఆవిష్కరించారు. అలాగే సచివాలయంతో పాటు రైతుభరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల్లోనూ గత ప్రభుత్వానికి సంబంధించిన నవరత్నాల శిలాఫలకాలను సైతం తొలగించారు.

సంగంలో ఫ్లాగ్‌మార్చ్



సంగం, జూన్ 10: సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిపిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రంలోని పారామిలిటరీ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

నారా భువనేశ్వరితో కాకర్ల కుటుంబం



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకర్ల కుటుంబ సభ్యులు

ఉదయగిరి రూరల్, జూన్ 10: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని సోమవారం ఉండవల్లిలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన కుటుంబసభ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఘన విజయం సాధించడం పట్ల ఆమె కాకర్లను అభినందించారు. ఉదయగిరి అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భువనేశ్వరి కాకర్లకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట కాకర్ల సతీమణి ప్రవీణ, తమ్ముడు కాకర్ల సునీల్, మరదలు సురేఖ, కుమార్తె ధాత్రి ఉన్నారు.

ఆనంను కలిసిన దర్గా పీఠాధిపతులు



ఆనంను సత్కరిస్తున్న దర్గా నిర్వాహకులు

అనంతసాగరం, జూన్ 10: ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని సోమవారం అనంతసాగరం ముష్కార్ అలీషా ఖాదరీ దర్గా నిర్వాహకులు సయ్యద్ షానీసాహెబ్, మజీద్ సాహెబ్, మీరాన్‌లు నెల్లూరులో ఆయన నివాసంలో కలిసి అభినందించారు. శాలువాలతో సత్కరించిచారు. అనంతసాగరం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఖాసీం బాష, రహీంసాహెబ్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతం అభివృద్ధికి సమష్టిగా కృషి

● కావలి ఎమ్మెల్యే దగుమాటి



టీడీపీ నాయకులతో కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

ఉదయగిరి రూరల్, జూన్ 10: మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాసనసభ్యులు కాకర్ల సురేష్‌తో కలిసి చర్యలు చేపడతామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ శుభ కార్యానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన తొలుత టీడీపీ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ముచ్చటించి మాట్లాడారు. వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తిచేసి ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఉదయగిరికి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు తీసుకొచ్చి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను శాశ్వతంగా దూరం చేస్తామన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కాకర్ల సురేష్ ప్రణాళికతో ఉన్నారని, అందుకు తాము కూడా చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, పమిడి రవికుమార్‌చౌదరి, రంగారెడ్డి, శ్రీకుర్తి రవీంద్ర, గడ్డం శ్రీనివాసులు, మతకాల శ్రీనివాసులు, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పరాజయానికి సజ్జలే కారణం

● సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి



ఉదయగిరి రూరల్, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయానికి కారణం సజ్జల రామకృష్ణారెడ్డే అని ఉదయగిరి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచుల హక్కులను కాలరాసి అన్నివిధాలుగా వారు నష్టపోయేలా చర్యలు తీసుకున్నట్లు ఆరోపించారు. పంచాయతీల నిధులను సైతం పక్కదారి పట్టించేలా సలహాలిచ్చి పార్టీ ఘోర పరాభావానికి సజ్జల ముఖ్యపాత్ర పోషించారన్నారు. సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సజ్జల చేసిన దుర్మార్గపు పనులతో రాష్ట్రంలో వైసీపీకి ఈ దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి తన సొంత ప్రయోజనాలకు వాడుకుని అక్రమంగా ప్రభుత్వం సొమ్మును దోచుకున్న వ్యక్తి సజ్జల అన్నారు. ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని దోచుకొన్న కోట్ల రూపాయలను నష్టపోయిన సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సజ్జల పంచిపెట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదినం



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్ననాయకులు



చేజర్ల: కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఉదయగిరి రూరల్, జూన్ 10: స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు సోమవారం సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న, రియాజ్, బొజ్జా నరసిం హులు, నల్లిపోగు రాజా, గడ్డం శ్రీనివాసులు, నరసింహ, సయ్యద్ నవాజ్, ఖాన్‌సా, మాబాషా, ఉప్పుటూరి వెంక టయ్య, మట్ల రామయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

చేజర్ల: ఆదురుపల్లిలో టీడీపీ సీనియర్ నాయకలు చీర్ల వెంకటేశ్వర్లు బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలకు స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో చీర్ల వెంకటయ్య, పీర్ల వెంకటయ్య, సీనయ్య, పటాన్ షాన్‌వాజ్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

అనంతసాగరం, జూన్ 10: మండలంలోని శాంతినికేతన్, వికాస్, లిటిల్‌ఏంజెల్స్, సూర్య ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఆత్మకూరు డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. పక్కాగా అనుమతులు ఉండాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించాలని ఆదేశించారు. సరైన వసతులు సమకూర్చాలని, అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయరాదని సూచించారు. రికార్డులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈవో-1 జానకీరాం ఉన్నారు.

సీతారామపురం: ప్రైవేటు పాఠశాలలకు అన్ని అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎంఈఓ ఎస్‌కె మస్తాన్‌వలి తెలిపారు. సోమవారం అన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వసతులు సక్రమంగా ఉండాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ మండల వారీగా బృందాలను ఏర్పాటు చేసిందన్నారు.

రామోజీరావు మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నేతలు

ఆత్మకూరు, జూన్ 10: స్థానిక పాత గవర్నమెంట్ హాస్పటల్ ప్రాంగణంలో సోమ వారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆత్మకూరు బ్రాంచ్ చైర్మన్ మహ్మద్ సాదిక్‌హుసేన్ ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి సంతాపసభను ఏర్పాటు చేశారు. పార్టీల నేతలు, పురప్రముఖులు, జర్నలిస్టులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడు ముల సుధాకర్‌రెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సంగం, జూన్ 10: విద్యుదాఘాతంతో మరణించిన సంగం వినోద్, గుండెపోటుతో మృతి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, అనారోగ్యంతో మరణించిన లాలా మస్తాన్ కుటుంబసభ్యులను సోమవారం ఆత్మకూరు కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

విచ్చలవిడిగా కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్

చేజర్ల, జూన్ 10: మండలంలో కాలంచెల్లిన కూల్ డ్రింక్స్ తాగి ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. నాలుగు రోజులు కిందట చిత్తలూరులోని యువకులు మజా కొనుగోలు చేయగా అమ్మకం తేదీ గడువు ముగిసిన బాటి ళ్లను గుర్తించి దుకాణదారులను ప్రశ్నించారు. వారికి దీనిపై అవగాహన లేకపోవడంతో తెల్లబోయారు.

సాగరంలో వైద్యసిబ్బంది ర్యాలీ

అనంతసాగరం, జూన్ 10: మండలకేంద్రంలో సోమవారం వైద్యసిబ్బంది మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్ రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



కార్ల స్టాండ్‌గా ఆసుపత్రి!

కావలి, జూన్ 10: కావలి ఏరియా వైద్యశాల ప్రాంగణం కార్లస్టాండ్‌గా మారింది. వైద్యశాలలో నూతన భవనం నిర్మాణం అనంతరం గతంలో వైద్యశాల మొదటిలోనే ఉన్న పాత భవనం పూర్తిగా తొలగించారు. దీంతో అక్కడ విశాలమైన స్థలం ఉండటంతో దానిని చదును చేసి వైద్యశాల పార్కింగ్ కోసం ఉంచారు. అయితే వైద్యశాల పట్టణ నడిబొడ్డున ట్రంకురోడ్డును ఆనుకుని ఉండటంతో వివిధ పనుల నిమిత్తం పట్టణంలోకి వచ్చినవారు తమ కార్లను వైద్యశాలలో పార్కింగ్ చేసుకుని వెళుతున్నారు. అలాగే పరిసర ప్రాంతాల వ్యాపారులకు కూడా తమ దుకాణాల వద్ద కారు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వారు కూడా వైద్యశాల ఆవరణలో తమ కార్లను పార్కు చేసుకుని వెళుతున్నారు. దీంతో వైద్యశాల ఆవరణం కారు పార్కింగ్ ప్రదేశంగా తయారైంది. దీంతో ఆసుపత్రికి అత్యవసర పనుల మీద వచ్చినవారి వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందికరంగా ఉంది. వైద్యాధికారులు స్పందించి వైద్యశాల ఆవరణలో ఇతరుల కార్లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబును కలిసిన ఇంటూరి



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇంటూరి

కందుకూరు, జూన్ 10 : టీడీపీ జాతీ య అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి చంద్రబాబునాయుడు ఢిల్లీ రాజకీయాలకు సమయం కేటాయించడంతో ఆయనను కలిసేందుకు సమయం పట్టిందని, మంగళవారం టీడీఎల్పీ సమా వేశం, బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం ఉండటం తో రెండు రోజులపాటు అమరావతిలోనే నాగేశ్వరరావు ఉంటారని సమాచారం. కాగా, నాగేశ్వరరావును సోమవారం ఉదయం బడేవారిపాలెంలోని ఆయన నివాసంలో పలు శాఖల అధికారులు, వివిధ గ్రామాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అలాగే కందుకూరులోని పార్టీ కార్యాలయంలోనూ పలువురు ఆయనను కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కందుకూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు అభినందనలు తెలిపారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

కావలి, జూన్ 10: చట్టబద్ధత మరచి ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా కొత్త కార్మికులను విధుల్లోకి తీసుకున్న స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిషనర్ కొంత ప్రలోభాలకు ఆశపడి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పాడని 27మంది కొత్త వారిని కార్మికులుగా చేర్చుకుని 10మందికి జీతాలు రాయటం చట్ట విరుద్ధం అన్నారు. కొత్త వారిని చేర్చు కోవాలంటే కౌన్సిల్ తీర్మానం కాని ప్రత్యేకాధికారైన ఆర్డీవో తీర్మానం ఉండాలన్నారు. అలా తీర్మానం చేసి జిల్లా ఆప్కాస్‌కు పంపితే అక్కడ ఆమోదించి కలెక్టర్‌కు పంపితే ఆయన పరిశీలించి రాష్ట్ర ఆప్కాస్‌కు పంపిస్తారన్నారు. అక్కడ ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకుంటారన్నారు. ఇవన్నీ లేకుండా కమిషనర్ కొత్త వారికి జీతాలు ఎలా పెడతారని ప్రశ్నించారు. జిల్లా ఆప్కాస్‌లో సమాచారం తెలుసుకుంటే కొత్తవారి పేర్లు ఎవరివీ లేవని చెపుతున్నారని తెలిపారు. ఈ విషయంపై నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు చేవూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకరానికి బస్సు ఏర్పాటు

అల్లూరు, జూన్ 10: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి పాల్గొనే వారి కోసం అల్లూరు నుంచి బస్సును ఏర్పాటు చేసినట్లు సోమవారం ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మంగళవారం రాత్రి 10 గంటలకు స్థానిక రామకృష్ణా జూనియర్ కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. పాల్గొనే వారికి అవసరమైన వసతులు ఏర్పాటు చేశామని పాల్గొనేవారు ముందుగా కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

కావలిటౌన్, జూన్ 10: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందళన తప్పదని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచులయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక సీఐటీయూ నేతలు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం మేనేజర్ షేక్ సికిందర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని, ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించాలన్నారు. హెల్త్ అలెవెన్సులు, సక్రాంతి కానుకలు సమ్మె కాలం జీతాలతో పాటు కార్మికులకు ఇవ్వాల్సిన సమదుస్తులు గ్లౌజులు, ఇవ్వడం లేదని వాపోయారు. తక్కువ జీతాలతో ఎక్కువ పనులు చేయించడం శ్రమ దోపిడీ చేయడమేనన్నారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, బీ రమేష్, తురకా శీనయ్య, మహేష్, జేమ్, బాబు పాల్గొన్నారు.

విద్య విజ్ఞానానికి, క్రీడలు ఆరోగ్యానికి అవసరం

బిట్రగుంట, జూన్ 10: విద్యార్థులకు విద్య.విజ్ఞానాన్ని ఏవిధంగా అందజేస్తుందో క్రీడలు ఆరోగ్యానికి అవసరమని కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్ అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఇంగ్లీష్ మీడియం లిటిల్ ఇంగ్లాండ్ క్రీడా మైదానంలో బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు జరిగిన సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్ సోమవారం ముగిసింది. సీనియర్ క్రీడాకారుడు ఎస్ఏ నవీద్ పర్యవేక్షణలో 35మంది చిన్నారులకు ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ షూ, జెర్సీ, షార్ట్‌లను దేవరాల, వాకర్స్ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్ రాజు, శేషాద్రిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోజస్‌చిట్టి, దీపు, నైనిల్, పండు, కోచ్ అఖిల్ ఉన్నారు. ఈ సందర్భంగా బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆహ్వానం మేరకు రైల్వే క్రీడా మైదానికి విచ్చేసిన దేవరాల సుబ్రహ్మణ్యంను అధ్యక్షులు స్వర్ణన్‌రాజు, కార్యదర్శి పీ.జీవన్‌కుమార్, సభ్యులు రామయ్య, శ్యాంసుధాకర్‌లు సన్మానించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

● సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు, జూన్ 10: కందుకూరు డివిజన్‌లో ప్రజల సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా అర్జీల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు సబ్ కలెక్టరు జి విద్యాధరి సోమవారం తెలిపారు. డివిజన్‌లోని ఏడు మండలాల్లో నిర్ణీత తేదీలలో ఈ కార్యక్రమం నిర్వహించి అన్ని శాఖల అధికారులు అక్కడ అందుబాటులో ఉండేలా చూసి వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆమె వివరించారు. ఈనెల 11న లింగసముద్రం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో, 12న ఉలవపాడు వెలుగు కార్యాలయం ప్రాంగణంలో, 13న వలేటివారిపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమం తొలివిడత నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా మండల తహసీల్దారులు, ఎంపీడీఓలు సంయుక్తంగా ఈకార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేయటంతో పాటు అన్నిశాఖల మండలస్థాయి అధికారులు తగు సమాచారంతో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. అలాగే ఈ కార్యక్రమంపై ప్రజలకు తెలిసేలా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో దండోరా వేయించాలని ఆదేశించినట్లు, డివిజన్‌లోని అన్ని మండలాల్లో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నేడు లింగసముద్రంలో ప్రజా విజ్ఞప్తుల దినం

లింగసముద్రం, జూన్ 10 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా విజ్ఞప్తుల దినం జరుగుతుందని తహసీల్దారు జి శ్రీచరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ జి విద్యాధరి, ఎంపీడీఓ యు శేషుబాబు పాల్గొని సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థి ప్రతిభ

కందుకూరు, జూన్ 10 : జేఈఈ అడ్వాన్స్‌డ్ జాతీయ స్థాయి ఫలితాలలో కందుకూరు పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి ఏ శ్యామ్ సిద్విలాస్ (2204) ర్యాంక్ సాధించాడు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం బాస్కరరావు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రస్థాయి ఫలితాలలో తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని, అధ్యాపకుల నిరంతర కృషి ఇలాంటి అసాధారణ ఫలితాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ర్యాంక్ సాధించిన విద్యార్థికి అభినందనలు తెలిపారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల బాస్కరరావు, బీ నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్ షావుల్ హమీద్ తదితరులు అభినందించారు.



శ్యామ్ చిద్విలాస్‌ను అభినందిస్తున్న ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు

నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు



కావలి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కావ్య , బాలకృష్ణ అభిమానులు

కావలి, జూన్ 10: సినీ హీరో, హిందూపూరు శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలు సోమవారం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ అధ్యక్షుడు జ్యోతిబాబూరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ బాలయ్య అభిమానులకు ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. అభిమాన సంఘం నాయకుడు జ్యోతిబాబూరావు నాయకత్వంలో ఇంత మంది అభిమానులు తరలిరావటం, ఉత్సాహంగా సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘాల నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, పోట్లూరి శ్రీనివాసులు, చవల రామకృష్ణ, అక్కిలగుంట సూరిబాబు, ఉప్పాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండాపురం: బాలకృష్ణ జన్మదినాన్ని సోమవారం మండలకేంద్రంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేకును కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో పోలినేని రమేష్, చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, బద్దిపూడి మాచర్ల, వీ.మణికుమార్ పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక ఎన్డీఏ కూటమి కార్యాలయంలో సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా పార్టీ మండల మధుమోహన్‌రెడ్డి కేక్‌ను కట్ చేసి అభిమాన సంఘం నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో అన్నవరం-2 ఎంపీటీసీ భ్యుడు కోర్పాటి మాధవరెడ్డి, జలదంకి సొసైటీ మాజీ అధ్యక్షుడు కొర్రపాటి రామారావు, టీడీపీ యువనేతలు నిమ్మకాయల మురళీయాదవ్, గంటా అశోక్‌నాయుడు, ముచ్చాల మదుసూదనరెడ్డి, బాలకృష్ణ పూనూరు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బాలయ్య పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

బిట్రగుంట: స్థానిక నందమూరి అభిమాలు సురేష్, అశోక్‌నాయుడు, ఫిలిప్‌లు ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలో వేడుకలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా బాలయ్య అభిమాన సంఘం అధ్యక్షుడు ఎద్దుల రవి, కావలి బాలయ్యబాబు వీరాభిమాని శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కేక్‌కట్, భోజన పొట్లాలు పంపిణీ చేశారు. బోగోలు కూడలిలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్వీపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్ భవానీ, ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు, వీఎస్‌ఆర్‌పేట కొత్తూరు వార్డు నెంబరు బాలాజీ ఉన్నారు.

కందుకూరు, జూన్ 10: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేకు కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుడ్లూరులో...

గుడ్లూరు : నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ అభిమానులు భారీ కేక్ కట్‌చేసి అల్పాహార విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, తోలకల ధనుష్, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవులు, రామకృష్ణ, కాపులూరి శ్రీను పాల్గొన్నారు.